నేటి దినపత్రిక

సూర్య

www.suryaa.com

visit us @ http://epaper.suryaa.com

ఆదివారం | 6 జనవరి 2019 | హైదరాబాద్

సంపుటి 12 | సంచిక 68

| పేజీలు 12+16+16 | వెల: రూ. 8.00

Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi

ఆనుగ్రహం

శ్రీ విళంబి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత రుతువు, పుష్యమాసం, శుక్ల పక్ష తిథి : పాడ్యమి పూర్తి, నక్షత్రం. పూర్వాషాఢ సా.5.06 వర్జ్యం రా.1.52 నుంచి 3.36 వరకు, రాహుకాలం: సా.4.30 నుంచి 6.00 వరకు, దుర్ముహూర్తం: సా.4.25 నుంచి 5.13 వరకు సూర్యోదయం : ఉ.6.36 గం; సూర్యాస్తమయం: సా.5.42



17న కొత్త సభ కొలువు

17 నుంచి 20 వరకు శాసనసభ సమావేశాలు

- 16న ప్రొటెం స్పీకర్‌గా ముంతాజ్ అహ్మద్ ఖాన్ ప్రమాణం
- 17న ఎమ్మెల్యేలచే ప్రమాణం
- మధ్యాహ్నం స్పీకర్ ఎన్నికపై షెడ్యూల్ ప్రకటన, నామినేషన్ల దాఖలు
- 18న స్పీకర్ ఎన్నిక
- 19న ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ ప్రసంగం
- 20న గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానం
- ప్రగతి భవన్‌లో సీఎం అధ్యక్షతన సమావేశం

శాసనసభ సమావేశాల నిర్వహణకు ముహూర్తం ఖరారైంది. తెలంగాణ శాసనసభ సమావేశాలు జనవరి 17 నుంచి 20వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు కొనసాగనున్నాయి. ఈ మేరకు ఇవాళ అసెంబ్లీ కార్యదర్శి, అధికారులతో సీఎం కేసీఆర్ ప్రగతిభవన్‌లో సమావేశమై శాసనసభ సమావేశాల నిర్వహణపై చర్చించారు. జనవరి 16న సాయంత్రం 5 గంటలకు ప్రొటెం స్పీకర్‌గా మజ్లిస్ ఎమ్మెల్యే ముంతాజ్ అహ్మద్ ఖాన్ ప్రమాణస్వీకారం చేయనున్నారు.

హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి : గవర్నర్ నరసింహన్ ముంతాజ్ అహ్మద్ ఖాన్ తో ప్రమాణస్వీకారం చేయిస్తారు. మరుసటి రోజు నుంచి శాసనసభ కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయి. జనవరి 17న ఉదయం 11:30 గంటలకు అసెంబ్లీ సమావేశాలు ప్రొటెం స్పీకర్ అధ్యక్షతన ప్రారంభమవుతాయి. నూతనంగా ఎన్నికైన శాసనసభ సభ్యులు ప్రమాణస్వీకారం చేస్తారు. ఈ కార్యక్రమం సుమారు రెండుగంటలు కొనసాగుతుంది. ఆ తర్వాత జూబ్లీహాల్ ప్రాంగణంలోని కౌన్సిల్ లాన్స్ లో శాసనసభ సభ్యులకు లంచ్ ఉంటుంది. 17వ తేదీన స్పీకర్ ఎన్నిక షెడ్యూల్ ప్రకటన, నామినేషన్ కార్యక్రమాలు కూడా వుంటాయి. 18వ తేదీన స్పీకర్ ఎన్నిక, ఎన్నికైనట్లు ప్రకటన వుంటాయి. ఆ తరువాత నూతనంగా ఎన్నికైన మిగతా 6లో


ముంతాజ్ అహ్మద్ ఖాన్

రుణ మాఫీ పేరుతో రాజకీయాలు చేయలేం

రైతులను కాంగ్రెస్ ఓటు బ్యాంకుగా చూస్తోంది

- వారు ప్రజలకు తిండిపెట్టే అన్నదాతలన్నది మా పార్టీ భావన
- రైతు రుణ మాఫీపై కాంగ్రెస్‌పై విరుచుకుపడిన ప్రధాని మోడీ
- దొంగ ఎప్పుడూ కాపలాదారుని వెళ్లగొట్టాలనే చూస్తాడు
- రాహుల్‌పై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తిన ప్రధాని మోడీ



భువనేశ్వర్, రాంచీ :ప్రధాని నరేంద్ర మోడీ శనివారం ఝార్ఖండ్, ఒడిశాలలో పర్యటించి, పలు ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ కార్యక్రమాలతో పాటు బహిరంగ ర్యాలీలలో కూడా మోడీ ప్రసంగించారు. ఈ సందర్భంగా మోడీ కాంగ్రెస్ పార్టీపైన, పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీపైన తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఝార్ఖండ్‌లో మాట్లాడిన సందర్భంలో మోడీ కాంగ్రెస్‌ను విమర్శిస్తూ, ఆ పార్టీ రైతులను వోటు బ్యాంకుగా పరిగణిస్తోందని అన్నారు. రైతుల రుణ మాఫీపై ప్రధాని మోడీ మరో సారి కాంగ్రెస్‌ను తప్పు పట్టారు. రైతులను వోటు బ్యాంకుగా చూస్తున్న ఆ పార్టీ రుణ మాఫీ పేరుతో రైతులను తప్పు దారి పట్టిస్తోందని ఆయన అన్నారు. ఝార్ఖం డ్‌లోని పాలములో శనివారం జరిగిన మిగతా 6లో

కేంద్రం సవతితల్లి ప్రేమ

ప్రశంసలే తప్ప నిధులు మంజూరు చేయడం లేదు

- మిషన్ భగీరథ, కాకతీయలకు పలు అవార్డులు
- 24 వేల కోట్లు సాయం చేయాలన్న నీతి ఆయోగ్
- హవ్వా... నీతి ఆయోగ్ సిఫార్సు తిరస్కరిస్తారా?
- ఇలాగే వ్యవహరిస్తే పార్లమెంట్ ఎన్నికల్లో ఆ ఒక్క సీటు దక్కదు
- ఏపీలో రాజకీయాలు చేయాలంటే అక్కడికే వెళ్లాల్సిన అవసరం లేదు
- ఈవీఎం ట్యాంపరింగ్‌లా? కంప్యూటర్లను కనిపెట్టిన బాబుకే తెలియాలి
- అసెంబ్లీ ఓటమి నుంచి తేరుకోని కాంగ్రెస్
- ఆపార్టీకి అభ్యర్థులే కరవన్న టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, మేజర్‌న్యూస్ : తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం అన్యాయం చేస్తోందని టీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీ రామారావు ఆరోపించారు. రాష్ట్రంలో బీజేపీ ఉనికి లేదని కేంద్రం పక్షపాతంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. తెలంగాణ సాగు, తాగు నీటి ప్రాజెక్టులకు కేంద్రం సహకరించడం లేదని ఆరోపించారు. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ అద్భుతమని నీతిఆయోగ్ చెప్పినా, కేంద్రం నిధులు ఇవ్వడం లేదన్నారు. మిషన్ భగీరథను మన్‌కీ బాత్‌లో ప్రధాన మంత్రి మోదీ సైతం ప్రశంసించారని గుర్తు చేశారు. ప్రశంసలు తప్ప నిధులు మాత్రం ఇవ్వడంలేదంటూ మండిపడ్డారు. ఒక్క ప్రాజెక్టుకైనా జాతీయ హోదా ఇవ్వమంటే కేంద్రం స్పందించడంలేదని ఆరోపించారు. శనివారం తెలంగాణభవన్‌లో కేటీరామారావు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన మిషన్ భగీరథ, మిషన్ కాకతీయకు అన్ని వైపులా నుంచి ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయన్నారు. నీతి అయోగ్ కూడా ఈ రెండు పథకాలకు రూ. 24 వేల కోట్ల సాయాన్ని ఇవ్వాలని ప్రతిపాదించిన విషయాన్ని ఈసందర్భంగా కేటీఆర్ గుర్తు మిగతా 6లో



సూర్య వెబ్‌సైట్

సూర్య ఈ - పేపర్

కదం తొక్కుతున్న బీసీలు



రిజర్వేషన్లకోసం నేడు ఇందిరాపార్కు వద్ద భారీ ధర్నా


6లో

2 ప్రశ్నలు అడగండి

- మోడీని నిలదీయాలని ప్రజలకు రాహుల్ పిలుపు
- రఫేల్ ఒప్పందంపై మరోసారి విమర్శలు

న్యూఢిల్లీ : రఫేల్ ఒప్పందంపై తాను అడిగిన ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం చెప్పడం లేదని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ విమర్శించారు. ఈ దృష్ట్యా రఫేల్ యుద్ధ విమానాల ఒప్పందంపై ప్రధాని నరేంద్ర మోడీని నిలదీయాలని దేశ ప్రజలకు రాహుల్ గాంధీ పిలుపు ఇచ్చారు. తాను పార్లమెంట్‌లో అడిగిన ప్రశ్నలకు రక్షణ శాఖ మంత్రి నిర్మల సీతారామన్ సమాధానం చెప్పలేదని రాహుల్ పేర్కొంటూ, ఆ రెండు ప్రశ్నలను దేశ ప్రజలంతా ప్రధాని మోడీని అడగాలని కోరారు. శనివారం రాహుల్ ఇచ్చిన ట్వీట్‌లో 'ఆర్ఎం (రక్షణ శాఖ మంత్రి) పార్లమెంట్‌లో 2 గంటల పాటు మాట్లాడారు. ఆమెను నేను అడిగిన 2 తేలికపాటి ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేక పోయారు' అని పేర్కొన్నారు. ఈ ట్వీట్‌తోపాటు శుక్రవారం పార్లమెంట్‌లో ఆయన అడిగిన 2



ప్రశ్నలకు సంబంధించిన వీడియోను జత చేశారు. ఈ వీడియోను చూసి, షేర్ చేయాలని కోరారు. ఈ రెండు ప్రశ్నలకు ఔను మిగతా 6లో

విజయ్ మాల్యా

@ పారిపోయిన ఆర్థిక నేరస్థుడు

- ప్రకటించిన పిఎమ్ఎల్ఎ ప్రత్యేక కోర్టు
- శనివారం తీర్పు వెల్లడి
- విచారణపై స్టేకు నిరాకరణ
- తాజా ఆదేశంతో మద్యం వ్యాపారి ఆస్తుల జప్తునకు వీలు



వివరాలు 5లో

మళ్లీ సమ్మె

- 8,9 తేదీల్లో బ్యాంకు ఉద్యోగుల స్ట్రైక్
- ఉద్యోగ విధానాలపై కేంద్రం తీరుకు నిరసన
- పాల్గొంటున్న పది ట్రేడ్ యూనియన్‌లు
- భారతీయ బ్యాంకుల సమాచారం



వివరాలు 5లో

అంతే ఇంతే!



ఈ సంవత్సరం బ్యాంకుల సమ్మె నామసంవత్సరంగా ప్రకటిద్దాం సార్!

పాదయాత్రలో తుదిఘట్టం

3600 కిలోమీటర్ల ప్రస్థానం ● పార్టీలోకి జోరుగా వలసలు

- తిత్లీ తుఫాన్ నష్టపరిహారం ప్రజలకు చేరలేదు
- 337వ రోజు ప్రజా సంకల్పయాత్రలో వై.యస్. జగన్మోహన్‌రెడ్డి



(సూర్యబ్యూరో శ్రీకాకుళం): వైఎస్సార్‌కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు వై.యస్. జగన్మోహన్‌రెడ్డి ప్రజా సంకల్పయాత్ర శనివారం నాటికి 337 వ రోజుకు చేరుకుంది. ఇచ్ఛాపురం, సోంపేట మండలాల్లో తురకశాసనం క్రాస్ శిబిరం నుంచి ప్రారంభమైంది. పాలవలస కొర్లాం, బారువ, జంక్షన్ మీదుగా లక్కవరం క్రాస్ వరకు కొనసాగింది. బారువ జంక్షన్ వద్ద జననేత తన సుదీర్ఘ పాదయాత్రలో 3600 కిలోమీటర్లు పూర్తిచేసుకున్నారు. ఇచ్ఛాపురం నియోజకవర్గంలో సోంపేట మండలంలో ఆనేక చోట్ల ప్రజలు ఆయనతో మమేకమై సమస్యలను తెలిపారు. పాదయాత్రప్రారంభంలో టి. శాసనంకు చెందిన మత్స్యకారులు జగన్‌ను కలిసి సమస్యలు ప్రస్థావించారు. తిత్లీ తుఫాన్‌లో జరిగిన నష్టాన్ని పరిహారం మాత్రం అందలేదని ఆ పరిహారం చెల్లింపుల్లో రాజకీయాలు చోటుచేసుకున్నాయని చెప్పుకొచ్చారు. మరో వైపు సముద్రం ఒడ్డున కూడా అక్రమంగా ఇసుక తవ్వడం వలన నీరు ఉప్పుగా మారుతుందని ఫలితంగా గ్రామాల్లో మంచినీరు కరువవుతుందని టి.శాసనంకు మిగతా 6లో



ఉత్తమ్‌కు ఉద్వాసన!

- త్వరలో టిపిసిసి కొత్త కార్యవర్గం
- పార్లమెంటు ఎన్నికలకు ఐదు కమిటీలు
- ఐదుగురితో ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీ



వివరాలు 3లో

జానారెడ్డికి, షబ్బీర్ అలీకి షాక్



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి: కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నేతలు మాజీ సీఎల్పీ నేత, మండలి విపక్షనేత కె.జానారెడ్డి, షబ్బీర్‌అలీకి సర్కార్ భారీ షాక్ ఇచ్చింది. తాజా మాజీ శాసనసభలో జానారెడ్డి శాసనసభలో ప్రతిపక్ష నేతగా ఉన్న విషయం తెలిసిందే. అలాగే షబ్బీర్ అలీ మొన్నటి వరకు కూడా తెలంగాణ శాసనమండలికి ప్రతిపక్ష నేతగా ఉన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఇద్దరు జానారెడ్డి, షబ్బీర్ అలీ ఓటమిపాలయ్యారు. ప్రతిపక్షనేతల హోదాలో ఉన్న వారిద్దరికీ తెలంగాణ రాష్ట్ర ఇంటెలిజెన్స్ అధికారులు నోటీసులు జారీ చేశారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో వారిద్దరూ తమకు ఉన్న ప్రొటోకాల్ ప్రకారం బుల్లెట్ ప్రూఫ్ వెహికల్ వాడుకున్నారు. ప్రభుత్వమే వారికి సౌకర్యం కల్పించింది. బుల్లెట్ ప్రూఫ్ వాహనాలు వాడుకున్నందుకు 9లక్షల 860 చెల్లించాలని నోటీసు తెలంగాణ ఇంటెలిజెన్స్ అధికారులు నోటీసులు జారీ చేశారు. జానారెడ్డి 87రోజులు బుల్లెట్ ప్రూఫ్ వెహికల్ వాడినందుకు కిలోమీటర్ కు 37 రూపాయల చొప్పున, డ్రైవర్ బత్తా రోజు కు 100 రూపాయల చొప్పున 4,20,094 రూపాయలు చెల్లించాలంటూ నోటీసుల్లో పేర్కొన్నారు. అలాగే షబ్బీర్ అలీ 90 రోజులు బుల్లెట్ ప్రూఫ్ వెహికల్ వాడినందుకు కిలోమీటర్ కు 37 రూపాయల చొప్పున, డ్రైవర్ బత్తా రోజు కు 100 రూపాయల చొప్పున మొత్తం 4,79,936 రూపాయలు చెల్లించాలని నోటీసులో పేర్కొన్నారు. ఈ నోటీసులపై కాంగ్రెస్‌పార్టీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నది.

లయోలా కాలేజీ
విద్యా, క్రమశిక్షణకు మారుపేరు

- కాలానికి అనుగుణంగా శిక్షణ పొంది ముందుకెళ్లాలి
- లౌకిక విధానమనేది భారతదేశ ప్రజల డిఎన్ఏలోనే ఉంది
- ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు

(అమరావతి సూర్య ప్రధాన ప్రతినిధి): సమాజంలోని యువతకు దిశా నిర్దేశం చేయడంలో లయోలా లాంటి ప్రముఖ విద్యాసంస్థల కృషి ప్రశంసనీయమని ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు అన్నారు. విజయవాడ ఆంధ్రా లయోలా కాలేజీ 65 వ వార్షికోత్సవం మరియు కాలేజి ప్రథమ ప్రిన్సిపల్ రెవ. ఫాదర్ తియో మత్తయాస్ ఎస్‌జె శతజయంతి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు హాజరయ్యారు. తొలుత ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడుకు కాలేజికి ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్ విద్యార్థుల నుండి గౌరవ వందనం స్వీకరించిన అనంతరం రెవ.ఫా. తియో మత్తయాస్ చిత్రపటానికి పూలను సమర్పించి నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సభలో ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు మాట్లాడుతూ మన దేశం గర్వించదగిన ముద్దుబిడ్డ రెవ.ఫా.తియో మత్తయాస్ అని అన్నారు. చెన్నైలో ఉన్న లయోలా కాలేజిని తెలుగుగడ్డకు తీసుకువచ్చి లయోలాకు ముందు ఆంధ్రా పదాన్ని చేర్చిన వ్యక్తి రెవ.ఫా. తియో మత్తయాస్ అని అన్నారు. చర్త్రిలో లయోలా కాలేజికి ఒక ప్రత్యేకతను తీసుకువచ్చిన వ్యక్తిగా నిలిచిపోయారన్నారు. 1954 ఏప్రియల్ నెలలో విజయవాడలోని ఆంధ్ర లయోలా కళాశాల వ్యవస్థాపక ఆచార్యులుగా నియుక్తులయ్యారన్నారు. ఆంధ్ర లయోలా కళాశాలను అన్ని విధాలుగా నిజమైన జేసుసభ కళాశాలగా తీర్చిదిద్దారు. అప్పటి వరకు ఆంధ్ర, తమిళనాడు ప్రాంతాలకు జేసుసభ ప్రొవిన్షియల్‌గా పనిచేసిన రెవ.ఫా.డగ్లస్ గోర్డాన్ విజయవాడలోని ఆంధ్ర లయోలా కళాశాలకు రెండవ ప్రిన్సిపల్‌గా నియక్తులగుటకు వీలుగా రెవ.ఫా. తియో మత్తయాస్ తన పదవిని విడిచి 1959 నుండి 1962 వరకు ఆంధ్ర లయోలా కళాశాలలోనే భౌతిక శాస్త్ర ఆధ్యాపకునిగా, గోగినేని హాస్టల్ వార్డెన్‌గా అద్భుతమైన సేవలందించి అందరి ప్రశంసలు చూరగొన్నారన్నారు. రాష్ట్రానికి చెందిన ఎంతో మంది ప్రముఖులు ఆంధ్రా లయోలా కాలేజీలో చదివి నేడు దేశంలో, విదేశాలలో కూడా ప్రముఖ స్థానాలలో వెలుగొందుతున్నారన్నారు. తెలుగు నేలపై ఈయన చేసిన సేవలు అనిర్వచనీయమని, ఆయన క్రమశిక్షణకు, అంకితభావానికి మారుపేరన్నారు. లయోలా కాలేజిలో విద్యాపరమైన క్రమశిక్షణకు మారుపేరుగా తీర్చిదిద్దడంలో ఆయన ప్రముఖ పాత్ర నిర్వహించారన్నారు. విద్యార్థులు చదువుతో పాటు వారి జీవితాలలో ఎదగడానికి క్రమశిక్షణ, సమయపాలన చాలా ముఖ్యపాత్ర వహిస్తాయన్నారు. జీవితంలో క్రమశిక్షణ, అంకితభావంతో ఉంటే అనుకున్న లక్ష్యాలను సాధించగలుగుతామన్నారు. రెవ.ఫా తియో మత్తయాస్ ఆయా రంగాలలో ప్రముఖ వ్యక్తిగా ఎదగడానికి క్రమశిక్షణ, అంకితభావమే కారణమన్నారు. సమాజానికి సేవలు అందించడంలో ఆయనకు ఆయనే సాటి అని అన్నారు. ఉన్నత విద్యలో భారతదేశం ప్రపంచంలో మూడవ స్థానానికి చేరుకుందన్నారు. ముఖ్యంగా 33 వేల కాలేజీలు, 769 యూనివర్శిటీలు విద్యను అందిస్తుండగా ఇందిరాగాంధీ ఒపెన్ యూనివర్శిటి 3 లక్షల మందికి విద్యను అందిస్తూ ప్రపంచవ్యాప్తంగా ఎంతో ప్రసిద్ధి చెందిందన్నారు. అవకాశాలను సాధించాలంటే మారుతున్న కాలానికి అనుగుణంగా తగిన శిక్షణ పొంది ముందుకు వెళ్లాలన్నారు. భారతదేశం ప్రాచీన కాలంలోనే విద్యకు నిలయంగా మారిందని అందుకు నలంద, తక్షశిల, పుష్పగిరి మంచి విద్యాలయాలుగా వెలుగొందాయని అందులో విద్యను అభ్యసించడానికి చైనా లాంటి దేశాల నుంచి వచ్చారన్నారు. యువతలో స్కిల్ ఉంటే ప్రపంచంలో ఎక్కడైనా రాణించగలుగుతామని, మన తెలుగువారు అమెరికాలోని శాన్‌ఫ్రాన్‌సిస్కో, సిలికాన్ వ్యాలిలో నిరూపిస్తున్నారన్నారు. ఎమన చర్త్రి, సంస్కృతి మూలాలను మరచిపోకుండా తెలుసుకుని ముందుకు సాగాలన్నారు. నేడు ప్రపంచ వ్యాప్తంగా సిద్ధాంతం పెరిగి రాద్ధాంతం పెరిగిపోతుందన్నారు. భారతదేశం సహనశీలత గల దేశమని ఏ దేశంపై ముందుగా దాడి చేయదు ఎప్పుడూ చేయలేదన్నారు. మానవ సేవే మాధవ సేవ అని భారతదేశ విధానమన్నారు. భారతదేశ జనాభాలో 35 సంవత్సరాల వయస్సు గల జనాభా 65 శాతం కలిగి ఉండటం మన అభివృద్ధికి కలిసి వచ్చే అంశమన్నారు. ప్రపంచవ్యాప్తంగా 100 టాప్ యూనివర్శిటీలలో మనదేశానికి చెందిన ఐఐటి, ఐఐఎంలు చోటు సంపాదించుకున్నాయన్నారు. దేశంలో నదుల పేర్లన్నీ మహిళల పేర్లే ఉన్నాయన్నారు. కాలేజి ప్రధానం చేసిన వివిధ అవార్డులలో 75 శాతం మంది బాలికలే ఉండటం మంచి పరిణామమన్నారు. ప్రస్తుతం కాలేజిలో బోధించే మోరల్ సైన్స్ సబ్జెక్ట్‌లో మోరల్ విలువలు పోయి సైన్స్ మాత్రమే మిగిలిందని అలా కాకుండా ప్రస్తుత విద్యావిదానం మోరల్ సైన్స్‌కు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. భారతదేశ సంస్కృతి, సాంప్రదాయాలు ప్రకృతిపై



నిర్మితమయ్యాయని వాటిని భావితరాలకు అందించాల్సిన అవసరం అందరిపై ఉందన్నారు. లౌకిక విధానం అనేది మన భారతదేశ ప్రజల డిఎన్ఎలోనే ఉందన్నారు. పెద్దలు చెప్పిన ప్రతి దాంట్లో శాస్త్రం ఉంటుందని అందుకు ప్రతి ఒక్కరు మన సంస్కృతి, సాంప్రదాయాలకు నిలయమైన యోగా, ఆహారపు అలవాట్లను పాటించాలన్నారు. బ్రెయిలీ లూయి ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని, ఉపాధ్యాయుల పాత్ర ఇందులో చాలా ప్రాముఖ్యంగా ఉండాలన్నారు. మాజీ రాష్ట్రపతి ఏజే కలాం చెప్పినట్లు ఉన్నత కలలు కనండి వాటిని సాకారం చేసుకోండని యువతకు మార్గదర్శకం చేసారన్నారు. ప్రపంచ ప్రసిద్ధి చెందిన మూడీ రేటింగ్స్ ప్రకారం రాబోయే కాలంలో భారతదేశ ఆర్థిక వ్యవస్థకు ప్రపంచంలోనే ముడవ స్థానానికి చేరుకుంటుందన్నారు. కుటుంబ వ్యవస్థకు ప్రపంచంలోనే ఇండియా ప్రసిద్ధి చెందిందన్నారు. యువత ముఖ్యంగా 5 విషయాలైన అమ్మ, జన్మ భూమి, మాతృభాష, మదర్‌ల్యాండ్గ, గురువును మర్చిపోవద్దన్నారు. ముందుగా ఉపరాష్ట్రపతి చేతుల మీదుగా రెవ.ఫాదర్ తియో మత్తయాస్ పోస్టల్ కవర్‌ను అవిష్కరించి, రెవ.ఫాదర్ తియో మత్తయాస్ పై రచించిన పుస్తకాన్ని అవిష్కరించారు. ఆంధ్రా లయోలా కాలేజీ 65వ వార్షికోత్సవం మరియు కాలేజి ప్రధమ ప్రిన్సిపల్ రెవ.ఫా తియో మత్తయాస్ ఎస్‌జె శత జయంతి కార్యక్రమానికి ఎ.ఎల్.సి సొసైటి ప్రెసిడెంట్ అమల్‌రాజ్, ప్రిన్సిపల్ జి.ఎ.పి.కిషోర్, రెక్టార్ బాలశౌరి, కరస్పాండెంట్ సహాయరాజ్,ఆధ్యాపకులు, విద్యార్ధిని విద్యార్థులు పాల్గొన్నారు.

7కు ముందే జరిగిన
ఏకగ్రీవాలు చెల్లవు : నాగిరెడ్డి



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధిః పంచాయతీ ఎన్నికలపై కలెక్టర్లు, ఎస్పీలతో సీఎస్ ఎస్‌కే జోషి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. 7న ఎన్నికల నిర్వహణ ప్రారంభమవుతుందని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నాగిరెడ్డి తెలిపారు. ఈ నెల 7కు ముందే జరిగిన ఏకగ్రీవాలు చెల్లవన్నారు. పంచాయతీల ఏకగ్రీవం అనేది ప్రభుత్వ పరంగా ఉన్నదేనని, ప్రోత్సాహకాలు ఇస్తాం కానీ బలవంతంగా ఏకగ్రీవం చేస్తే చర్యలు తప్పవని ఆయన చెప్పారు. మంత్రివర్గ విస్తరణ, అసెంబ్లీ సమావేశాలు నిర్వహించుకోవచ్చని, ఎన్నికల నిర్వహణకు అవసరమైతే అదనపు భద్రతా బలగాలు ఏర్పాటు చేస్తామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీజీపీ మహేందర్ రెడ్డి, రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నాగిరెడ్డి పాల్గొన్నారు.

అక్కడ అమలవుతుంది కానీ కేరళలో కాదా



న్యూఢిల్లీ, మేజర్‌న్యూస్: శబరిమల ఆలయం విషయంలో కేంద్రం, బీజేపీ ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తోందని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ విమర్శించారు. శని సింగ్నాపూర్ విషయంలో కోర్టు తీర్పును అమలు చేస్తున్న బీజేపీ ప్రభుత్వం, కేరళలో శబరిమల అంశాన్ని వ్యతిరేకిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ దేశంలోని అన్ని వ్యవస్థలను ధ్వంసం చేస్తున్నారని, ఆయన కంటే కూడా దావూద్ ఇబ్రహీం నయమంటూ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. కేరళలో ఆరెస్సెస్, బీజేపీ, విశ్వహిందూ పరిషత్ కలిసి అరాచకం, అల్లర్లు సృష్టిస్తున్నాయని, దేశంలో బీజేపీ వ్యతిరేక శక్తులన్నీ ఏకం కావాలని నారాయణ పిలుపునిచ్చారు. ఏపీలో చంద్రబాబును వ్యతిరేకిస్తాం కాంగ్రెస్‌ది రీటైల్ అవినీతి అయితే, బీజేపీది హోల్‌సేల్ అవినీతి అని నారాయణ దుయ్యబట్టారు. రాష్ట్రాల్లో పరిస్థితులు ఎలా ఉన్నా జాతీయ స్థాయిలో అందరూ కలిసి బీజేపీకి వ్యతిరేకంగా పోరాడాల్సిన అవస రం ఉందన్నారు. ఏపీలో చంద్రబాబును వ్యతిరేకిస్తున్నా, తెలంగాణలో మాత్రం టీడీపీతో కలిసి పోరాటం చేస్తామని తెలిపారు. ప్రధానమంత్రి అభ్యర్థి ఎవరన్నది అప్రస్తుతం అని పేర్కొన్నారు.

ఆయన ఆమ్ ఆద్మీ మ్యాన్ కాదు



విజయవాడ, మేజర్‌న్యూస్ః బోఫోర్స్ కుంభకోణం ఆరోపణ నాడు కాంగ్రెస్ పార్టీని, మిస్టర్ క్లీన్ లాంటి రాజీవ్ గాంధీ ప్రభుత్వాన్ని పడగొట్టేసిందని ఆ పార్టీ సీనియర్ నేత తులసిరెడ్డి అన్నారు. ఓ చర్చా కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ బోఫోర్స్ అనేది కేవలం ఓ ఆరోపణ, ఇది రూ.62 కోట్లకు సంబంధించిన ఆరోపణ అని నాడు ఢిల్లీ హైకోర్టు తేల్చి చెప్పిన విషయాన్ని గుర్తుచేసుకున్నారు. బోఫోర్స్‌కు ఎన్నో వందల రెట్లు ఎక్కువ కుంభకోణం రాఫెల్ అని, ఈ వ్యవహారంలో ప్రధాని ప్రమేయం డైరెక్టుగా ఉందన్న విషయం తెలిసిపోతోందని అన్నారు. గతంలో మోదీపై చాయ్ వాలా అనే అభిప్రాయం ఉండేదని, ఆ అభిప్రాయం పోయి బూట్ వాలా సూట్ వాలా అని, అలాగే, ఆమ్ ఆద్మీ మ్యాన్ కాస్తా పోయి అదాని, అంబానీ మ్యాన్ అన్న అభిప్రాయం వచ్చేసిందని విమర్శించారు. కచ్చితంగా, 2019లో బీజేపీ గ్రాఫ్ ఎక్కడికి పడిపోతుందో కూడా చెప్పలేమని అన్నారు. నాడు బోఫోర్స్ ఆరోపణ తమ ప్రభుత్వాన్ని కూల్చేందని, బోఫోర్స్‌కు ఎన్నో వందల రెట్లు ఎక్కువైన రాఫెల్‌తో బీజేపీకి ఓటమిపాలు తప్పదని అభిప్రాయపడ్డారు.

ఆ ముగ్గురికి ఎమ్మెల్సీ పదవులు దక్కేనా?



హైదరాబాద్, మేజర్‌న్యూస్: సీఎముఖ్యమంత్రి కేసీఆర్‌కు అత్యంత సన్నిహితులకు ఎమ్మెల్సీ పదవులు దక్కనున్నాయా? అంటే ఔననే టీఆర్ఎస్ వర్గాలు అంటున్నాయి. మార్చి నెలలో శాసనమండలిలో పలు స్థానాలు ఖాళీకానున్నాయి. త్వరలోనే ఖాళీకానున్న ఎమ్మెల్సీ స్థానాల్లో కేసీఆర్‌కు అత్యంత సన్నిహితులుగా భావిస్తున్న శేరి సుభాష్‌రెడ్డి, దేశపతి శ్రీనివాస్, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డిలకు ఎమ్మెల్సీలుగా నియమించే అవకాశాలు లేకపోలేదన్న వాదనలు పార్టీ వర్గాల్లో వినిపిస్తున్నాయి. కేసీఆర్ రాజకీయ కార్యదర్శి, రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా సుభాష్‌రెడ్డి వ్యవహరిస్తున్నారు. కవి, గాయకుడు దేశపతి శ్రీనివాస్ ప్రస్తుతం సీఎంవో ప్రత్యేక అధికారిగా పనిచేస్తున్నారు. తెలంగాణ ఉద్యమసమయం నుంచి కేసీఆర్‌కు వెన్నంటి ఉంటున్న ఈ ఇద్దరి పేర్లను ఎమ్మెల్సీ పదవుల కోసం టీఆర్ఎస్ అధిష్టానం పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రికి అత్యంత సన్నిహితునిగా ఉన్న సుభాష్‌రెడ్డికి ఇంతవరకు రాజకీయంగా పెద్ద అవకాశాలు లభించలేదని, ఈసారి ఎమ్మెల్సీ పదవి వరించవచ్చునని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేసి సీఎం వద్ద ప్రత్యేక అధికారిగా సేవలందిస్తున్న దేశపతికి కూడా ఎమ్మెల్సీ ఛాన్స్ దక్కే అవకాశం ఉందని అంటున్నారు. టీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌కు అత్యంత సన్నిహితుడైన పోచంపల్లిశ్రీనివాస్‌రెడ్డి పేరు కూడా ఎమ్మెల్సీ రేసులో ప్రముఖంగా వినిపిస్తోంది.

చంద్రబాబు పాలనపై ప్రజలు సంతృప్తి

'జన్మభూమి-మా ఊరు' సభలో రాష్ట్ర మంత్రి శిద్ధా రాఘవరావు

- చంద్రబాబు పాలనపై ప్రజలు సంతృప్తి
- ఆర్థిక లోటులోనూ ఆగని నవ్యాంధ్ర అభివృద్ధి
- సంక్షేమ ఫలాలతో అన్నీ వర్గాల ప్రజలకు సమన్యాయం
- విద్యా, వైద్య, వ్యవసాయ రంగాలకు పెద్ద పీట
- దళిత గ్రామాల్లో మౌలిక సదుపాయాలు, వసతులు
- దర్శి నియోజకవర్గంలో ఎన్నడూ చూడని అభివృద్ధి
- నీటి ప్రాజెక్టుల నిర్మాణాలకు అధిక ప్రాధాన్యత


తాళ్ళూరు, మేజర్‌న్యూస్ : ఆర్థిక లోటులోను సమర్థవంత పాలన అందిస్తూ రాష్ట్రాన్ని ప్రగతి పదాన నడిపిస్తున్న చంద్రన్న సర్కార్‌పై ప్రజలు సంతృప్తిగా ఉన్నారని రాష్ట్ర మంత్రి శిద్ధా రాఘవరావు అన్నారు. ప్రజా శ్రేయస్సుకు పాటుపడే చంద్రబాబుకు ప్రజలు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. మండల పరిధిలోని నగంబోట్లపాలెం గ్రామంలో జన్మ భూమి మాఊరు కార్యక్రమంలో శిద్ధా రాఘవరావు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని ముందుంచాలన్న ఉద్దేశంతో స్వామినాధన్ సలహాలు సూచనలు పాటిస్తూ ఇరిగేషన్ ప్రాజెక్టులు పూర్తి చేసి 19 కోట్ల ఎకరాలకు సాగునీరు అందించాలన్న ఈ ప్రభుత్వం పని చేస్తుందని మంత్రి తెలిపారు. మండల పరిధిలోని నాగం బొట్లపాలెం గ్రామంలో జరిగిన జన్మభూమి మా ఊరు కార్యక్రమం పాల్గొని మాట్లాడారు. ముందుగా పలు శాఖ అధికారులు పెట్టిన స్టాల్ సంక్రాంతి ముగ్గులుని పరిశీలించారు. ప్రతి గ్రామంలో ఈ ప్రభుత్వము సిమెంట్ రోడ్లు వేయించడం జరిగింది, అలాగే నాగం బొట్లవారిపాలెం గ్రామానికి కోటి 90 లక్షల రూపాయలు విలువగల నిధులు మంజూరు చేయడం జరిగిందని అన్నారు. అలాగే జిల్లా పరిషత్ హై స్కూల్ త్వరలోనే 20 లక్షల రూపాయలు నిధులు మంజూరు చేస్తానని ఆయన అన్నారు. అలాగే ప్రభుత్వం చంద్రన్న పెళ్లి కానుక కింద నిరుపేద కుటుంబాలకు పిల్లలకు ఆడపిల్లలకు పెళ్లి చేయడానికి తల్లిదండ్రులకు భారంగా ఉందని ఉద్దేశంతోనే నారా చంద్రబాబునాయుడు చంద్రన్న పెళ్లి కానుక పథకం తీసుకురావడం జరిగిందని ఆయన అన్నారు. అలాగే చంద్రన్న బీమా కుటుంబంలో పెద్ద చనిపోయినప్పుడు ఆ కుటుంబం ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందనే ఉద్దేశంతోనే మీ ఇంటికి నేను పెద్ద కొడుకుని అనినారా చంద్రబాబునాయుడు చంద్రన్న బీమా పథకం తేచ్చారని ఆయన అన్నారు. అలాగే చంద్రన్న బీమా కింద ఎంతో మంది లబ్ధి పొందారని కుటుంబానికి 5 లక్షల రూపాయలు సహకారము ఈ ప్రభుత్వం ఇస్తుందని ఆయన చెప్పారు. అలాగే గత ప్రభుత్వాలు 200 500 చేస్తే ఈ ప్రభుత్వం రూ 1500 పెన్షన్ ఇచ్చింది ఆఘ నత చంద్రబాబు నాయుడు దక్కుతుందని ఆయన తెలిపారు అలాగే మండలానికి సంబంధించి త్వరలోనే మోగిలాగుండాల రిజర్వాయర్ శంకుస్థాపన చేస్తాను అని ఈసందర్భంగా మండల ప్రజలకు తెలియజేశారు ఈ కార్యక్రమంలో దర్శి నియోజకవర్గ పరిధిలో మొత్తం మూడు వేల కోట్ల రూపాయలతో అభివద్ధి పనులు చేయడం జరిగిందని అలాగే దర్శి టు చీమకుర్తి డబుల్రోడ్డు నిర్మాణం చేయడం జరిగిందని బ్రిడ్జి నిర్మాణం చేయడం జరిగిందని, తాళ్లూరు టు వేల్లంపల్లి రెండు లైన్ల రహదారి నిర్మాణం చేపట్టడం జరుగుతుందని అన్నారు. ఇప్పుడు గత ప్రభుత్వాలు ఎప్పుడు చేయనంత అభివద్ధి నాలుగున్నర సంవత్సరాలలో చేసాము అభివద్ధికి పట్టం కట్టాలని మళ్లీ బాబురావాలని అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో సుబ్బారావు ప్రత్యేక అధికారి హరిప్రసాద్ రావు, ఏపిడి భవాని, ఎం ఈ ఓ పి సుబ్బయ్య, వైద్యాధికారి రత్నం, పశువైద్యాధికారి ప్రియాంక, ప్రకాష్,



సుబ్బయ్య, సుధాకర్, సుబ్బారావు, ఆర్‌డి గంగాధర్, ఆర్టికల్ విజయ, పోలీస్ శాఖ అధికారులు, స్థానిక ఎస్ఐ రంగనాథ్ తన సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. ట్రాఫిక్ ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా గట్టి బందోబస్తు నిర్వహించారు. జన్మభూమిలో సాంస్క తిక కార్యక్రమాలుఅలాగే తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు శాగం కొండరెడ్డి మానం రమేష్ బాబు పిన్నిక రమేష్ పాశం సూరిబాబు ఎడికొల యాలమంద రెడ్డి శ్రీనివాస్ రెడ్డి వైఅంజి బాబుతదితరులు పాల్గొన్నారు.

పేద ఉల్లగల్లు లో జన్మ భూమి : రాష్ట్రంలో ప్రజా సమస్యల పరిష్కరించడానికి ప్రభుత్వం జన్మ భూమి - మా ఊరు కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని రాష్ట్ర అటవీశాఖ మంత్రి శిద్దా రాఘవరావు అన్నారు. శుక్రవారం ముండ్లమూరు మండలము పేద ఉల్లగల్లు గ్రామంలో జన్మ భూమి కార్యక్రమంలో ముఖ్య అతిధిగా రాష్ట్ర అటవీశాఖ మంత్రి పాల్గొన్నారు. రాష్ట్రంలో పేదల సంక్షేమం కోసం చంద్రన్న భీమా కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన అన్నారు.


ఈసారైనా జాగ్రత్తపడదాం



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధిః అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థుల ప్రకటనలో జాప్యమే కొంప ముంచిందని, ప్రచారానికి కూడా సమయం దొరకలేదని పలువురు కాంగ్రెస్ అభ్యర్థులు అభిప్రాయపడ్డారు. నేడిక్కడ జరిగిన నల్గొండ,మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గాలలో పోటీ చేసిన అభ్యర్థులతో పార్టీ ఇంచార్జి కుంతియా, పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌తోపాటు పార్లమెంట్ నియోజకవర్గాల ఏఐసీసీ ఇంచార్జీలు కుసుమకుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో పలువురు అభ్యర్థులు మాట్లాడుతూ ముందుగానే అభ్యర్థులను ప్రకటించి ఉంటే.. ఫలితం వేరేలా ఉండేదని పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఆ తప్పును పునరావృఎతం కానివ్వవద్దని, ముందుగానే అభ్యర్థులను ప్రకటించేసి ప్రచారానికి దిగాలని అన్నారు. రెండో రోజు మహబూబ్‌నగర్, భువనగిరి, నల్గొండ, చేవేళ్ల పార్లమెంటరీ నియోజకవర్గాల సమీక్ష జరిగింది. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి ఆర్‌సీ ఖుంటియా, ఏఐసీసీ కార్యదర్శి శ్రీనివాసకృష్ణన్, టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్, వర్కింగ్ ప్రెసిడెంట్లు పొన్నం ప్రభాకర్, కుసుమ్‌కుమార్, ఆయా పార్లమెంటు స్థానాల పరిధిలోని శాసనసభ స్థానాల నుంచి పోటీ చేసిన అభ్యర్థులు, డీసీసీ అధ్యక్షులు ఈ సమీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అభ్యర్థుల ప్రకటన ఆలస్యం కావడం విజయావకాశాలపై తీవ్రంగా ప్రభావం చూపిందని పలువురు పేర్కొన్నారు. దీంతో లోక్‌సభకు అభ్యర్థుల ప్రకటన ముందుగానే ఉంటుందని ఖుంటియా, ఉత్తమ్ చెప్పినట్లు తెలిసింది. కాగా మొత్తం 33 జిల్లాలకు డీసీసీలు, అధ్యక్షుల నియామకాన్ని పది రోజుల్లోపే పూర్తి చేస్తామని ఉత్తమ్ తెలిపారు. అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోటీ చేసిన అభ్యర్థులు.. తగిన పేర్లను నాలుగు రోజుల్లోగా సూచించాలని కోరారు.

బీసీ నాయకులు ఎదగకుండా చేసే కుట్ర

- టీజేఎస్ ఆధ్వర్యంలో ఇందిరా పార్కు వద్ద ధర్నా
- పాల్గొన్న విపక్షల పార్టీల నేతలు



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధిః బీసీ నాయకులను ఎదగకుండా చేసే కుట్రలో భాగంగానే పంచాయతీ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు తగ్గించారని తెలంగాణ జనసమితి (టీజేఎస్) అధ్యక్షుడు కోదండరాం ఆరోపించారు. పంచాయతీ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ తగ్గింపునకు నిరసనగా తెలంగాణ జనసమితి ఇందిపార్కు ధర్మాచౌక వద్ద ఒక రోజు నిరసన కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ కార్యక్రమానికి టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాంతో పాటు బీసీ నేత మాజీ ఎమ్మెల్యే ఆర్ కృష్ణయ్య, మాజీ ఎమ్మెల్సీ దిలీప్ కుమార్,ఏఐసీసీ అధికాం ప్రతినిధి దాసోజు శ్రావన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ.. ప్రస్తుత రిజర్వేషన్లే.. ఎంపిటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో కూడా కొనసాగుతాయన్నారు. రాజకీయాల్లో ప్రజల భాగస్వామ్యం పెరిగితేనే రాజకీయ వ్యవస్థ బలపడుతుందన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం రిజర్వేషన్లు ఉండాలని, బీసీలకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన ఆర్డినెన్స్‌ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. బీసీలపై ఉన్న కసితోనే కేసీఆర్.. రిజర్వేషన్లు తగ్గించారని ఆర్ కృష్ణయ్య మండిపడ్డారు. పంచాయతీ ఎన్నికల్లో బీసీలకు 34 శాతం నుంచి 22 శాతం తగ్గించడం అన్యాయమన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం 34 శాతం రిజర్వేషన్లతో పంచాయతీ ఎన్నికలు జరిపించిందని గుర్తు చేశారు. జాతిని అమ్ముకుని టీఆర్ఎస్ బీసీ నేతలు రిజర్వేషన్లపై మాట్లాడుతున్నారని మండిపడ్డారు. బీసీ రిజర్వేషన్‌లపై సుప్రీం కోర్టులో రిట్ పిటిషన్ వేయాలన్నారు. ఆత్మగౌరవ భవనాలు నిర్మించడం కాదని, బడి పిల్లలకు బడిలు కట్టివ్వాలని సూచించారు. రిజర్వేషన్లు తగ్గించడం వలన 1500 మంది బీసీలు సర్పంచ్ అయ్యే అవకాశం కోల్పోయారన్నారు. అన్ని పార్టీలు బీసీల రిజర్వేషన్ల ఉద్యమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. అన్ని కుల సంఘాల నాయకులు ఉద్యమించాలని, ప్రపంచంలో చాలా మంది నేతలను చూసామని, కేసీఆర్ అంత కన్నా గొప్పవాడేమి కాదన్నారు. రాష్ట్రంలోనూ బీసీలకు 34శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నారని కృఎష్ణయ్య అన్నారు. కేసీఆర్ ప్రమాణస్వీకారం చేయగానే ఆర్డినెన్స్ తేవాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. ప్రభుత్వ కుట్రలో భాగంగానే పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. ఆత్మగౌరవ భవనాలు కాదని... అధికారం కావాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ పట్ల వ్యతిరేకత తీవ్రస్థాయిలో ఉందని, కేసీఆర్ పద్ధతి మార్చుకోకపోతే ప్రజలు తిరగబడతారని ఆర్.కృష్ణయ్య తెలిపారు. జస్టిస్ ఈశ్వరయ్య మాట్లాడుతూ పంచాయతీరాజ్ చట్టం ప్రకారం బీసీలకు 34శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. విద్య, ఉద్యోగాల విషయంలో మాత్రమే బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు మించొద్దని సుప్రీంకోర్టు చెప్పిందని గుర్తుచేశారు. అన్నిరంగాల్లో అగ్రకులాల ఆధిపత్యం ఉన్నందువల్లే బీసీలకు న్యాయం జరగడంలేదని జస్టిస్ ఈశ్వరయ్య అన్నారు. రాజకీయాలకు అతీతంగా బీసీలకు జరిగిన అన్యాయంపై ఉద్యమించాలని ఏఐసీసీ అధికారప్రతినిధి దాసోజు శ్రవన్ పిలుపునిచ్చారు. పార్లమెంట్, అసెంబ్లీలలో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలంటూ ఓ పక్క ఆందోళన చేస్తుంటే రాష్ట్రంలో టీఆర్ఎస్ సర్కార్ బీసీలకు ఉన్న రిజర్వేషన్లు తగ్గించడం శోచనీయమన్నారు. టీఆర్ఎస్ సర్కార్ బీసీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నదని, బీసీను ఐక్యమత్యం చేసి పోరాటం చేయాలని, ఇందుకు కాంగ్రెస్‌పార్టీ ముందుంటుందన్నారు.

చంద్రబాబును
తక్కువ అంచనా వేయొద్దు



అమరావతి,సూర్యబ్యూరో: తెలంగాణలో మహాకూటమి పేరుతో టీడీపీ-కాంగ్రెస్ కూటమి చేతులు కాల్చుకున్న సంగతి తెలిసిందే. దీంతో తాజాగా ఆంధ్రప్రదేశ్ లో కాంగ్రెస్ తో కలిసి ఎన్నికలకు వెళ్లే అంశంపై టీడీపీలో భిన్న స్వరాలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్-టీడీపీ పొత్తుపై పార్లమెంటు మాజీ సభ్యుడు ఉండవల్లి అరుణ్ కుమార్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఏపీలో కాంగ్రెస్ పార్టీతో పొత్తు పెట్టుకుంటే టీడీపీ నష్టపోతుందని ఉండవల్లి స్పష్టం చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ఒంటరిగా పోటీ చేసుంటే కనీసం 50 స్థానాలు దక్కేవని వ్యాఖ్యానించారు. కానీ తెలంగాణలో కాంగ్రెస్-టీడీపీ పొత్తు వికటించిందని అభిప్రాయపడ్డారు. కేంద్రం ఇచ్చిన నిధులను ఎవరూ డైరెక్టుగా జేబులోకి వేసుకోలేరనీ, దుర్వినియోగం చేసే అవకాశం మాత్రం ఉంటుందని తెలిపారు. జగన్ పాదయాత్రకు అనూహ్య స్పందన వస్తోందనీ, వైసీపీ శ్రేణులు దీన్ని క్యాష్ చేసుకోవాలని సూచించారు. తెలంగాణలో ఓటమి పాలైనా చంద్రబాబును తక్కువ అంచనా వేయడానికి లేదని ఉండవల్లి హెచ్చరించారు. చంద్రబాబు ఓ పోరాట యోధుడనీ, ఇటీవల పవన్ కల్యాణ్ పై ఆయన చేసిన వ్యాఖ్యలు మైండ్ గేమ్ లో భాగమని వ్యాఖ్యానించారు.



కేటీఆర్‌పై మండిపడ్డ వీహెచ్, పొన్నం

హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి : టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీరును కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు, కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పొన్నం ప్రభాకర్ తప్పుపట్టారు. కేటీఆర్ ఎక్కువ మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్‌ను విమర్శించడం సరికాదన్నారు. ప్రజాస్వామ్యంలో గెలుపోటములు సహజమని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజల్లోకి వెళ్లి ప్రచారం చేస్తామని చెప్పారు. బోఫోర్స్ స్కామ్‌పై మాట్లాడే అర్హత బీజేపీకి లేదని తెలిపారు. ప్రధాని మోదీ రాఫెల్‌పై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కేటీఆర్ నోరు, ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలని మాజీ ఎంపీ, కాంగ్రెస్ నేత పొన్నం హెచ్చరించారు. విదేశాల్లో చదువుకుని అజ్ఞానిలా మాట్లాడొద్దని హితవు పలికారు. కేటీఆర్ అహంకారాన్ని సమాజం గమనిస్తోందన్నారు. టీఆర్ఎస్ ఉందో లేదో గానీ ప్రతీ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఉందని చెప్పారు.

అధికారం శాశ్వతం కాదన్నారు. పంచాయతీలు ఏకగ్రీవం చేసుకుంటే.. 10లక్షలు గ్రాంట్ ఇస్తామని కేటీఆర్ అంటున్నారని గుర్తుచేశారు. దీనిపై ఎన్నికల అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అహంకారం వీడి పక్క రాష్ట్రంలో మాదిరిగా వరి ధర 2500 పెంచాలని కోరారు.

నేరాల చిట్టా విప్పాల్సిందే..!

- పోటీ చేసే అందరూ ఆస్తులు, నేరాల వివరాలు చెప్పాలి
- పంచాయతీ ఎన్నికల్లో నిబంధనలు కఠినం : ఎస్ఇసీ ఆదేశం

హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధిః పంచాయితీ ఎన్నికలో ఎన్నికల కమిషన్ నిబంధనలను కఠినతరం చేసింది. పంచాయితీ ఎన్నికల్లో పోటీ చేసే సర్పంచ్ అభ్యర్ధులతో పాటు వార్డ్ మెంబర్స్ కూడా తమ ఆస్తులతో పాటు నేర చరిత్ర గురించి కూడా చెప్పాల్సిందేనని రాష్ట్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. తెలంగాణ సీఎం కేసీఆర్ నాయకత్వంలో నూతన పంచాయతీ రాజ్ చట్టం -2018 రూపొందించారు. 2003లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం పంచాయతీ రాజ్ సంస్థల్లో పోటీ చేసే అభ్యర్ధులు నేర చరిత్ర, ఇన్ కమ్, ఖర్చులు.. ఉమ్మడి ఆస్తులు, విద్యార్హతలతో కూడిన సమాచారాన్ని నామినేషన్ పత్రాలతో సమర్పించి బహిరంగ పర్చాలనే నిబంధన పెట్టింది. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు పూర్తి వివరాల తో నామినేషన్లు దాఖలు చేయాల్సి వుంటుంది. నామినేషన్ పేపర్స్ పై సర్పంచ్, వార్డు సభ్యుడిగా పోటీ చేసే అభ్యర్థి సంతకంతో పాటు మరో ఇద్దరు సాక్షులతో సంతకం చేయించి డిక్లరేషన్ పత్రాలను ఎన్నికల అధికారులకు సబ్మిట్ చేయాలి.

పోటీ చేసే అభ్యర్థితో పాటు జీవిత భాగస్వామి అంటే భర్త లేక భార్య, పిల్లలకు సంబంధించి ఆస్తుల వివరాలు అంటే కుటుంబ సభ్యుల పాన్ కార్డు, అకౌంట్ నెంబర్, లాస్ట్ ఫైనాన్స్ ఇయర్ ట్యాక్స్ శాఖ ఇచ్చిన రిటర్న్‌లకు సంబంధించిన ఇన్ కమ్ ఇన్ఫర్మేషన్ మొత్తం ఇవ్వాలి. జాయింట్ ఫ్యామిలీ అయితే వారి ప్రాపర్టీలో వారికి వచ్చే వాటా కూడా తెలియజేయాలి. వారి హ్యాండోవర్లో వున్న క్యాష్..షేర్ మార్కెట్స్..బ్యాక్ ఎకౌంట్స్, డిపాజిట్లు, ఫైనాన్సియల్ సంస్థల్లో డిపాజిట్స్..షేర్ మార్కెట్ షేర్స్..పోస్టాఫీస్, ఇన్సూరెన్స్ పాలసీలు, వెహికల్స్, ప్లాట్స్..అప్పులు, ఇలా ప్రతీ ఇన్ఫర్మేషన్ ఆయా అభ్యర్థులు ఇవ్వాల్సిందే.

తప్పనిసరిగా నేర చరిత్ర వివరాలు : అభ్యర్థుల ఆస్తులతో పాటు వారిపై వున్న నేరాలకు సంబంధించిన వివరాలను తప్పనిసరిగా తెలియజేయాల్సివుంది. చిన్నా పెద్దా కేసుల వివరాలు..కేసుల సెక్షన్స్..ఏ పోలీస్ స్టేషన్, ఏ కోర్టులో కేసులు నడుస్తున్నాయి..శిక్ష పడిందా..పడితే ఎంత కాలం..ఇలా ప్రతీ వివరాలతో కూడిన నేర చరిత్రను తప్పని సరిగా నామినేషన్ పత్రాలతో ఆయా పోటీ అభ్యర్థులు ఇవ్వాల్సి వుంటుంది. అంతేకాదు పూర్తిస్థాయిగా వారి వారి ఎడ్యుకేషన్ క్వాలిఫికేషన్..వారి రిమార్కులు కూడా కచ్చితంగా తెలపాల్సిందేనని ఎన్నికల కమిషన్ స్పష్టంచేసింది. తెలంగాణలో పంచాయితీ ఎన్నికలకు సంబంధించి హైకోర్టు గ్రీన్ సిగ్నల్‌తో రాష్ట్రంలో త్వరలోనే పంచాయితీ ఎన్నికలు జరగనున్న క్రమంలో ఈ నిబంధల విషయంలో ఈసీ అమలు చేయనుంది. దీంతో పోటీ అభ్యర్థులు వారికి సంబంధించిన అన్ని వివరాలను ఈసీకి సబ్మిట్ చేయాల్సివుంది.



ఉత్తమ్‌కు ఉద్వాసన !

- త్వరలో టీసీసీసీకి కొత్త కార్యవర్గం
- పార్లమెంట్ ఎన్నికల కోసం ఐదు కమిటీలు
- ఐదుగురితో ఎన్నిలకలకు మేనేజిమెంట్ టీమ్



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధిః శాసనసభ ఎన్నికల్లో ఘోర పరాభవాన్ని మూటకట్టుకున్న కాంగ్రెస్‌పార్టీ టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ఉద్వాసన పలుకబోతుందన్న ప్రచారం జోరుగా సాగుతున్నది. అభ్యర్థుల ప్రకటనలో...ప్రజాకూటమి పొత్తులపై ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నాన్చుడుధోరణితోనే రాష్ట్రంలో పార్టీ ఘోరంగా ఓడిపోయిందన్న ఆరోపణనలు వ్యక్తమవుతున్నాయి. పార్టీ ఓటమిపై ఇప్పటికే ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీకి సైతం కొంతమంది ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఎన్నికల్లో ప్రచార నిర్వహణతో పాటు పార్టీ అందజేసే నిధులు సైతం కొంతమంది అభ్యర్థులకు చేరలేదని, మరికొంత మందికి పోలింగ్ మరుసటి రోజున అందజేశారన్న ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో టీపీసీసీకి బలమైన నేతలతో కూర్పు చేయాలని, అలాగే పీసీసీ కమిటీలను సైతం త్వరగా పూర్తిచేసేందుకు అధిష్టానవర్గం భారీ కసరత్తు ప్రారంభించినట్లు సమాచారం.

మరో పక్క...

రాబోయే పార్లమెంట్ ఎన్నికల కోసం అన్ని రాష్ట్రాలలో పీసీసీలను పునఃవ్యవస్థీకరరించడంతో పాటు కొత్త కమిటీలను ఏర్పాటు చేసి ముందస్తుగా సర్వం సిద్ధం చేసే పనిలో అధిష్టానవర్గం కసరత్తు చేస్తున్నది. ఇందులో భాగంగా ఈనెల 3వ తేదీన డిల్లీలో జరిగిన ఎఐసిసి కార్యదర్శులు, ప్రధాన కార్యదర్శులు, ఇంచార్జ సమావేశంలో ఎఐసిసి తీసుకున్న నిర్ణయాలను ఆర్గనైజేషన్ కమిటీ అన్ని పిసిసిలకు ఆదేశాలు జారీ చేసింది. ప్రధానంగా అన్ని పిసిసి తిరిగి నియమించాలని, వాటితోపాటు ఎన్నికల కోసం కొత్తగా ఐదు కమిటీలను ఏర్పాటు చేసుకోవాలని ఇచ్చిన ఆదేశాలతో తిగిరి ఎన్నికల కమిటీల నియామకం తప్పనిసరి అయింది. ఇందుకుగాను ఏఐసీసీ షెడ్యుల్‌ను ప్రకటించింది. ప్రదానంగా జనవరి 8వ తేదీలోగా ఎన్నికల కోసం పిసిసి స్థాయిలో 5 కమిటీలను ఏర్పాటు చేయాలి. అందులో కో ఆర్డినేషన్ కమిటీ, ప్రదేశ్ ఎన్నికల కమిటీ, ప్రచార (కాంపెయిన్) కమిటీ, పబ్లిసిటీ కమిటీ మరియు మీడియా కో ఆర్డినేషన్ కమిటీ నియమించి ఈ కమిటీలు 15వ తేదీ నుంచి కమిటీలు పనులు ప్రారంబించాలని ఆదేశించింది.

అలాగే ప్రధానంగా సంస్థాగతంగా పిసిసి, డిసిసి, సిటీ కమిటీలు, బ్లాక్ మరియు వార్డు కమిటీలను జనవరి 15వ తేదీ లోగా నియమించాలని, బూత్ కమిటీలు అన్ని జనవరి 30వ వరకు పూర్తి చేయాలని, ఫిబ్రవరి నెలాఖరు నాటికి కొత్తగా నియామకమైన బూత్, బ్లాక్, అసెంబ్లీ స్థాయి కమిటీలకు శిక్షణ పూర్తి చేయాలని ఎఐసిసి ఆదేశించింది.

నేడు కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు డీకే విందు




హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధిః ఇటీవల జరిగిన ఎన్నికల్లో గెలుపొందిన కాంగ్రెస్‌పార్టీ ఎమ్మెల్యేలకు, ఓడిపోయిన అభ్యర్థులు, సీనియర్ నేతలకు కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి డీకె అరుణ విందు ఇస్తున్నారు. గండిపేటలోని డీకే అరుణ ఫామ్‌హౌస్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, పోటీ చేసిన అభ్యర్థులు సమావేశంకానున్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో కూటమి వద్దు



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధిః పార్లమెంట్ ఎన్నికల్లో కూటమి వద్దని కాంగ్రెస్ నేత కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తేల్చిచెప్పారు. నేతల తప్పుల వల్లే కాంగ్రెస్ ఘోరంగా ఓడిపోయిందన్నారు. కూటమి వద్దని ఆ రోజు చెప్పాం.. ఇప్పుడూ చెబుతున్నామన్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్, సీఎం చంద్ర బాబు కలిసి ప్రచారం చేయడం వల్ల చాలా నష్టం జరిగిందని విమర్శించారు. తెలంగాణలో మళ్ళీ చంద్రబాబు పెత్తనం ఉంటుందన్న ప్రచారాన్ని ప్రజలు నమ్మారని, పొత్తుల వల్ల రెండు నెలల సమయం వృథా అయిందని ఆయన చెప్పారు. తొందరగా అభ్యర్థులను ప్రకటిస్తే 8 ఎంపీ స్థానాలు గెలుస్తామని, నల్గొండ ఎంపీగా పోటీ చేస్తా. .గెలుస్తా అని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. నేడు గాంధీభవన్‌లో జరిగిన సమీక్షా సమావేశంలో పాల్గొన్న వెంక ట్‌రెడ్డి అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఈ విషయం స్పష్టం చేశారు.

సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపిన అసద్



హైదరాబాద్, మేజర్‌న్యూస్: ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన సీనియర్ ఎంఐఎం ఎమ్మెల్యే ముంతాజ్ అహ్మద్ ఖాన్‌ను తెలంగాణ అసెంబ్లీ ప్రొటెం స్పీకర్‌గా ఎన్నిక చేయడం పట్ల ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ ధన్యవాదాలు తెలిపారు. నూతనంగా ఎన్నికైన శాసనసభ్యులతో ప్రొటెం స్పీకర్‌గా ముంతాజ్ అహ్మద్ ఖాన్ ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. అంతేకాకుండా కొత్త స్పీకర్ ఎన్నికయ్యేవరకు ప్రొటెం స్పీకర్ సభను నిర్వహిస్తారు. సాధారణంగా సభలో సీనియర్ ఎమ్మెల్యేను ప్రొటెం స్పీకర్‌గా నియమించడం ఆనవాయితీ. ఆ సంప్రదాయాన్ని పాటిస్తూ, ఆరుసార్లు ఎమ్మెల్యే అయిన ముంతాజ్ అహ్మద్ ఖాన్‌ను సీఎం కేసీఆర్ ప్రొటెం స్పీకర్‌గా ప్రతిపాదించారు. ఈ విషయాన్ని అసదుద్దీన్ ఒవైసీ ట్విటర్ ద్వారా ధ్రువీకరించారు. ఎంఐఎం సీనియర్ ఎమ్మెల్యే ముంతాజ్ అహ్మద్ ఖాన్ తెలంగాణ అసెంబ్లీ ప్రొటెం స్పీకర్‌గా వ్యవహరించనున్నారని, ఇందుకుగాను ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కృతజ్ఞుడినై ఉంటానని ఆయన ట్విట్ చేశారు.

గీత కార్మికుల సంక్షేమానికి నర్సయ్య ఎంతో కృషి



టీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్

హైదరాబాద్, మేజర్‌న్యూస్ : తెలంగాణ భవన్ లో బూర లక్ష్మయ్య రాజమ్మ(బీఎల్ఆర్) ఫౌండేషన్ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెక్కుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ గీత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఎంపీ బూర నర్సయ్యగౌడ్ ఎంతో కృషి చేశారని తెలిపారు. బీఎల్ఆర్ ఫౌండేషన్ ద్వారా 60 వేల మందికి నేరుగా సహాయం అందుతుందన్నారు. ఈ సందర్భంగా బీఎల్ఆర్ ఫౌండేషన్ నిర్వాహకులను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నట్లు కేటీఆర్ తెలిపారు. ఎంపీ బూర స్ఫూర్తితో మరింత మంది టీఆర్ఎస్ నాయకులు ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. కులవృత్తులకు చేయూతనిచ్చే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. సమాజంలోని పేదలను కుల, మతాలకతీతంగా ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

ఒకవైపు ప్రభుత్వపరంగా ఈ కార్యక్రమాన్ని చేపడుతూనే, వ్యక్తులుగా ప్రతి ఒక్కరూ తమ వంతు చేయూతనందించాల్సిన అవసరముందని పేర్కొన్నారు. తాను పరిశ్రమల శాఖ మంత్రిగా ఉన్నప్పుడు నీరా డ్రింక్ ను ప్రోత్సహించాలని బూర నర్సయ్య గౌడ్ తనను కోరారని కేటీఆర్ గుర్తు చేశారు.

ప్రజలే బుద్ధి చెప్తారు : వై.వీ.సుబ్బారెడ్డి



తూర్పుగోదావరి, మేజర్‌న్యూస్: జన్మభూమి కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రవర్తించిన తీరు విచారకరమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మాజీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. రాష్ట్రంలో పాలన అస్తవ్యస్తంగా ఉందని, జనాలు సమస్యలతో అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జన్మభూమి సభలు జనాలు లేక వెలవెలబోతున్నాయని, చంద్రబాబు హామీలు శిలాఫలకాలకు పరిమితమయ్యాయే తప్ప అమలుకు నోచుకోలేదని ఎద్దేవా చేశారు. ప్రభుత్వ ఉద్యోగులను మరోసారి మభ్యపెట్టేందుకు చంద్రబాబు సిద్ధమవుతున్నారని విమర్శించారు. ఎవరెన్ని విధాలుగా ప్రయత్నించినా వెన్నుపోటు పొడిచేవాళ్లకు బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని సుబ్బారెడ్డి వ్యాఖ్యానించారు.

హైదరాబాద్ ఎంజీబీఎస్‌లో ట్రాఫిక్ సమస్యకు చెక్ !

- పండుగ రోజుల్లో శివార్ల నుంచి ప్రత్యేక బస్సులు
- ఉత్తమ అవార్డు అందుకున్న అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ సుధా



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి : పండగలొచ్చాయంటే చాలు మహాత్మాగాంధీ బస్టాండ్ ప్రయాణికులతో కిక్కిరిసిపోతుంది. తెలుగు రాష్ట్రాల నుంచి ప్రతిరోజు ఎంజీబీఎస్ మీదుగా 60-70 వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. పండగరోజుల్లో ప్రయాణికుల సంఖ్య 1.5 నుంచి 2లక్షల వరకు ఉంటుంది. సంవత్సర కాలంగా దసరా, సంక్రాంతి పండగల నేపథ్యంలో శివారు ప్రాంతాల నుంచి జిల్లాలకు ప్రత్యేక బస్సులు నడపడంతో పాటు ఎంజీబీఎస్ ఆవరణలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవడంతో పాటు ప్రయాణికులకు మెరుగైన సేవలందిస్తున్నందుకు ఎంజీబీఎస్ అసిస్టెంట్(ట్రాఫిక్) మేనేజర్ సుధాకు ఉత్తమ అవార్డును టీఎస్ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కొమురయ్య, రంగారెడ్డి ఆర్ఎం యాదగిరి అందజేశారు.

ఈ సందర్భంగా సుధా మాట్లాడుతూ ఉన్నతాధికారుల ప్రోత్సాహంతో బస్సుల్లో రెవెన్యూ పెంచడంతో పాటు, మహాత్మాగాంధీబస్టాండ్ ఆవరణలో వెయ్యికిపైగా మొక్కలు నాటినట్లు తెలిపారు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ఎప్పటికప్పుడు ప్రత్యేక చర్యలు తీసుకోవడంతో 24 గంటలు ఆర్టీసీ సిబ్బంది ప్రయాణికులకు అందుబాటులో ఉండేలా చూస్తున్నట్లు తెలిపారు. ఎంజీబీఎస్‌కు మెట్రోరైళ్లలో వస్తున్న ప్రయాణికుల సంఖ్య క్రమంగా పెరుగుతుందన్నారు. బస్సుల్లో జిల్లాల నుంచి వస్తున్న ప్రయాణికులు మెట్రోరైళ్లలో గమ్యస్థానాలకు వెళ్లేలా సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు.


శివాజీ వెనుక టీడీపీ ఉంది

సినీనటుడు పృథ్వీరాజ్



విజయవాడ, మేజర్‌న్యూస్ః ఆపరేషన్ గరుడ అంటూ నటుడు శివాజీ చేసిన వ్యాఖ్యలను సినీ నటుడు పృథ్వీ తప్పుపట్టారు. జగన్‌పై కోడికత్తితో దాడి జరిగినప్పుడు ప్రభుత్వ పెద్దలు చాలా అవహేళన చేశారని ఆయన విమర్శించారు. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీకి, వైసీపీకి ఓట్లలో తేడా కేవలం 1.9 శాతం మాత్రమే ఉందని గుర్తుచేశారు. ఆ ఎన్నికల్లో టీడీపీకి పెద్దగా ఊపేసే మెజారిటీ ఏమీ రాలేదని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. ఓ యూట్యూబ్ ఛానల్ కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పృథ్వీ మాట్లాడారు. ఒక జంతువుకు దెబ్బ తగిలితేనే నాలుగు జంతువులు చుట్టూ చేరుతాయనీ, ఆపాటి ఇంగిత జ్ఞానం కూడా కొందరికి లేదని దుయ్యబట్టారు. జగన్‌పై దాడి జరగ్గానే అమెరికాకు వెళ్లిపోయిన శివాజీ మళ్లీ తిరిగి వచ్చి నన్ను ఏం చేస్తారు అంటూ మీసాలు మెలేస్తున్నారనీ, సమయం వచ్చినప్పుడు ఏం చేస్తారో తెలుస్తుందని వ్యాఖ్యానించారు. అప్పుడే తొందరపడితే ఎలా అని ప్రశ్నించారు. తాతలను, తండ్రులను అడ్డుపెట్టుకుని బిజినెస్ చేస్తున్నారు అంటూ శివాజీ జగన్‌ను టార్గెట్ చేస్తున్నారని స్పష్టం చేశారు. రాజారెడ్డి కాలం నుంచి వైఎస్ కుటుంబం మైనింగ్ బిజినెస్‌లో ఉందని గుర్తుచేశారు. ప్రజలకు రూ.2కే వైద్యం చేస్తూ దివంగత సీఎం రాజశేఖరరెడ్డి వందలాది ఎకరాల భూమిని అమ్ముకున్నారని తెలిపారు. ఈ విషయంలో రాజారెడ్డి చాలాసార్లు వైఎస్‌ను హెచ్చరించారని, అయినా కూడా ఆయన తనపని తాను చేశారని చెప్పారు. తెలుగుదేశం వేదికలపై ఉండే శివాజీ తన వెనుక ఎవరూ లేరని చెప్పడం హాస్యాస్పదమని వ్యాఖ్యానించారు. శివాజీ వెనుక టీడీపీ ఉందని స్పష్టం చేశారు. తాను టీడీపీ నేతను అని ప్రకటించుకోవడానికి శివాజీ సిగ్గు పడుతున్నారేమో అని వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

ఓటమికి సమిష్టి బాధ్యత



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధిః అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ ఓటమికి సమిష్టి బాధ్యత అని ప్రచార కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే భట్టివిక్రమార్క మల్లు పేర్కొన్నారు. నేడిక్కడ గాంధీభవన్‌లో మీడియా ప్రతినిధులతో చిట్‌ఛాట్‌లో పాల్గొన్నారు. రాష్ట్రంలో ప్రజాకూటమి ఓటమికి రాష్ట్రంలోని కాంగ్రెస్‌పార్టీ బాధ్యులందరిది సమిష్టి బాధ్యత అన్నారు. రాష్ట్రంలో గతంలో ఎన్నడు లేని విధంగా అధికారపార్టీ భారీ ఎత్తున డబ్బు, అధికార దుర్వినియోగానికి పాల్పడిందని ఆయన ఆరోపించారు. కేసీఆర్ ఎన్నికలను డబ్బుచుట్టూ తిప్పారని ఆర్పించారు. రాష్ట్రంలో అన్ని వ్యవస్థలను కేసీఆర్ కలుషితం చేశారని ఆరోపించారు. ఆరు నెలల ముందు నుండే..ముఖ్య నాయకుల నియోజక వర్గాలపై సీఎం దృష్టి పెట్టారన్నారు. మండల, గ్రామ స్థాయిలో ఇతర పార్టీ ముఖ్యనాయకులు..కుల సంఘాల నాయకులను పార్టీలో చేర్చుకున్నారు. అసెంబ్లీ ఎన్నికలను..కేసీఆర్ వర్సెస్..చంద్రబాబులా మార్చారని తెలిపారు. చంద్రబాబునాయుడుతో చంద్రబాబుతో కొన్నిచోట్ల లాభం జరిగింది. కమ్యూనిజాన్ని ఇష్టపడతానని, సోషలిజం తెచ్చిందే నెహ్రూ అని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల వరకే..ప్రచార కమిటీ అన్నారు. పార్లమెంట్ ఎన్నికలకు మళ్ళీ కమిటీ వేస్తారని తెలిపారు. సీఎల్పీ నేతగా మీరేనన్న ప్రచారం జరుగుతుందని ప్రశ్నించగా.. పార్టీ ఏ బాధ్యతలు అప్పగించినా నిర్వహిస్తానని ఆయన చెప్పారు.

తెలంగాణ ప్రవేశపరీక్షల షెడ్యూల్ విడుదల



హైదరాబాద్, మేజర్‌న్యూస్: తెలంగాణలో 2019 విద్యా సంవత్సరంలో నిర్వహించే ప్రవేశ పరీక్షల షెడ్యూల్ విడుదల చేశారు. శనివారం రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ఆచార్య పాపిరెడ్డి పరీక్షల వివరాలను ఓ ప్రకటనలో వెల్లడించారు. ఈ ఏడాది ప్రవేశ పరీక్షలు నిర్వహించే యూనివర్సిటీ విరాలతో పాటు, పరీక్ష తేదీలు ఈ కిందివిధంగా ఉన్నాయి.

పరీక్షల షెడ్యూల్ ..

★ టీఎస్ ఎంసెట్ (జేఎన్‌టీయూహెచ్)- మే 3, 4, 6 తేదీల్లో (ఇంజినీరింగ్), 8, 9 తేదీల్లో (అగ్రికల్చర్)
★ టీఎస్ ఈసెట్ (జేఎన్‌టీయూహెచ్) - మే 11
★ టీఎస్ పీఈసెట్ (మహాత్మాగాంధీ యూనివర్సిటీ) - మే 20
★ టీఎస్ ఐసెట్ (కేయూ) మే 23, 24
★ టీఎస్ లాసెట్ (ఓయూ) - మే 26
★ టీఎస్ పీజీఎల్‌సెట్ (ఓయూ) - మే 26
★ టీఎస్ పీజీఈసెట్ (ఓయూ) - మే 27, 29
★టీఎస్ ఎడ్‌సెట్ (ఓయూ) మే 30, 31

సంక్రాంతికి 5,252 ప్రత్యేక బస్సులు

హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధిః సంక్రాంతి పండుగ సమీపిస్తోంది. పట్టణాల్లో ఉన్నవారంతా పల్లెబాట పట్టనున్నారు. అయితే ఇప్పటికే రైళ్లు, బస్సు టికెట్లు అయిపోయాయి. దీంతో పండుగ రద్దీని దృష్టిలో పెట్టుకుని తెలంగాణ ఆర్టీసీ 5,252 ప్రత్యేక బస్సులను వేసింది. ఈ నెల 10 నుంచి 14 వరకు ఈ ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటామని రంగారెడ్డి రీజనల్ మేనేజర్ యాదగిరి తెలిపారు. దూర ప్రాంతాలకు వెళ్లే ప్రత్యేక బస్సుల్లో 50 శాతం మేర అదనపు ఛార్జీలు ఉంటాయని స్పష్టం చేశారు. ఆంధ్రప్రాంతం వైపు వెళ్లే ప్రత్యేక బస్సుల టికెట్లను ఆన్‌లైన్‌లో పెట్టినట్లు పేర్కొన్నారు.

రాష్ట్ర ఎంపీటీసీల ఫోరం క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఈటల

హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధిః రాష్ట్ర ఎంపీటీసీల ఫోరం క్యాలెండర్‌ను ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ఆవిష్కరించారు. ఈటల నివాసంలో ఈ కార్యక్రమంజరిగింది. ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు బోళ్ల కరుణాకర్, ప్రధాన కార్యదర్శులు ఉమ్మన్నగారి మనోహర్‌రెడ్డి, సూరారం యాదగిరితో పాటు పెద్ద ఎత్తున ఎంపీటీసీలు పాల్గొన్నారు

సంపాదకీయం

editpage@suryaa.com

రూ.2 2 కోట్లు పలికిన బ్లూఫిన్ టూనా జాతి చేప

టోక్యో : చేప ఖరీదు వింటే షాక్ అవుతారు. వందలో వేలో అనుకుంటే తప్పులో కాలేసినట్టే. ఆ చేప ఖరీదు అక్షరాలా రూ. 22 కోట్లు. ఏదో రూ. 3-4 కోట్లు పలుకుతుందని భావించానని చేపను వేలంలో సొంతం చేసుకున్న వ్యక్తి తెలిపారు. జపాన్‌లో దాదాపు 278 కేజీల బరువు ఉన్న బ్లూఫిన్ టూనా జాతికి చెందిన చేపను వేలం వేశారు. ఈ వేలంలో ఆ చేపను టోకియోలోని జపనీస్ సుషీ రెస్టారెంట్ ఓనర్ కిషోషీ కిమురా రూ. 22 కోట్లకు సొంతం చేసుకున్నారు. టోకియోలోని కొత్త ఫిష్ మార్కెట్‌లో ఇంత భారీ ధర పలకడం ఇదే మొదటిసారట. తాను అనుకున్న దాని కంటే ఐదు రెట్లు ఎక్కువ ధర పలికిందని, అంత రేటు పలకడంతో ఆశ్చర్యపోయానని కిషోషి తెలిపారు. ఆ చేపను కిషోషి సుకిజీ ప్రాంతంలోని బ్రాంచికి తరలించారు. అయితే, ఈ చేప ఒక్కొక్క ముక్క ధరను ఇంకా నిర్ణయించలేదు.



అయోమయంలో ఏపీ రాజకీయం



సూటిగా సుతిమెత్తగా

భండారు శ్రీనివాసరావు
98491 30595


ఎవరి వెనక ఎవరు? ఎవరితో ఎవరు? ఎవరు ఎవరిచేత ఏమి పలికిస్తున్నారు? ఎవరు పలికిస్తే ఎవరు పలుకు తున్నారు. ఇంతకీ పలికెడు వాడెవ్వడు? పలికించెడు వాడెవ్వడు?

ఈ పార్టీకి ఆ పలానా పార్టీతో చాటుమాటు సంబంధాలు ఉన్నాయి. ఆ పలానా పార్టీకి ఈ పార్టీతో పైకి చెప్పుకోలేని అవగాహనలు ఉన్నాయి. ప్రతిరోజూ మీడియాలో, పత్రికల్లో ఇలాంటి పలుకులే. ఇలాంటి ప్రకటనలే. ఇవన్నీ జనాల్లో వినిపిస్తున్న మాటలు కాదు. గిట్టనివాళ్ళు పుట్టిస్తున్న వదంతులు కాదు. ఏకంగా ఆయా పార్టీల అగ్రనాయకులే ఇలాటి వ్యాఖ్యలు చేస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రజల్లో లేనిపోని అయోమయం నింపుతున్నారు. ఒకానొక కాలంలో రాజకీయ పార్టీలు తమదైన సిద్ధాంతాలతో, కార్యాచరణ ప్రణాళికలతో తీర్పు కోరుతూ ప్రజల ముందుకు వెళ్ళేవి. ఒక పార్టీని ఓడించడానికి మరి కొన్ని పార్టీలు జతకూడితే, ఆ పొత్తును అపవిత్ర కలయిక అని జనం ఏవగించుకునేవారు. సిద్ధాంతాలకు దూరం జరిగితే ఆ పార్టీని దూరం పెట్టేవారు.

ఆ శకం ఏనాడో ముగిసిపోయింది. సంకీర్ణ ప్రభుత్వాల యుగం వచ్చాక ఈ కలయికలు, విలీనాలు, పొత్తులు ఇలాంటి మాటలన్నీ రాజకీయ నిఘంటువుల్లో మర్యాదస్తులు ఉపయోగించే పదాలుగా రూపాంతరం చెందాయి. ఇప్పుడాకాలానికి కూడా కాలం చెల్లిందేమో అనిపిస్తోంది. ఒక పార్టీకి మరో పార్టీతో సంబంధం అంటగట్టి అదేదో బయట పెట్టాల్సిన బాధ్యత ఆ పార్టీలదే అనే కొత్త వాదాలు పుట్టుకొస్తున్నాయి. రావణవధ అనంతరం అగ్నిప్రవేశం చేయడం ద్వారా తన సచ్ఛీలతను నిరూపించుకునే బాధ్యతను సీతమ్మ వారిపైనే శ్రీరాముడు ఉంచిన విధంగా వర్తమాన కాలంలో రాజకీయ పార్టీలు వ్యవహరిస్తున్నాయి. తాము చేసే ఆరోపణలనుంచి అగ్నిపునీతలుగా బయటకు రావాలని ప్రత్యర్థి పార్టీలను పట్టుబడుతున్నాయి.

కంటికి కనబడేదంతా నిజం కాదంటారు. అలాగని కంటికి కనబడేదంతా అబద్ధమూ కాదు. ఈ రీతిలో సాగుతున్నాయి ఏపీ రాజకీయాలు. ప్రజల్ని అయోమయంలో ముంచెత్తుతున్నాయి. ఇది మాత్రం వాస్తవం. బీజేపీ, వైసీపీ, టీఆర్ఎస్ ఒకే పార్టీకి మూడు ముఖాలు అంటుంది టీడీపీ. కొంతకాలం క్రితం వరకు ఇదే పార్టీ, జగన్ పార్టీ వైసీపీ, పవన్ పార్టీ జనసేన ఒకటే అని వాదించింది. ఇంకా కొంచెం వెనక్కి పోతే అంటే 2014 ఎన్నికలకు ముందు తల్లి కాంగ్రెస్, పిల్ల కాంగ్రెస్ అంటూ కాంగ్రెస్, వైసీపీలను ఎద్దేవా చేసింది. వైసీపీకి ఓటేస్తే కాంగ్రెస్ పార్టీకి ఓటేసినట్టే అని ప్రచారం చేసింది. ఎందుకంటే రాష్ట్రాన్ని అన్యాయంగా విభజించిన దుర్మార్గపు పార్టీ అనే నిందను కాంగ్రెస్ ఆ రోజుల్లో మోస్తోంది. ఇప్పుడు బీజేపీతో సంబంధాలు చెడిన తర్వాత ఆ పార్టీకి జగన్ పార్టీతో సంబంధం అంటగడుతోంది. ప్రస్తుతం ఏపీలో బీజేపీకి జనంలో మంచి పేరు లేకపోవడం వల్ల ఆ పార్టీతో వైసీపీకి ముడి పెడితే రాజకీయ ప్రయోజనం ఉండొచ్చనేది టీడీపీ వ్యూహంగా కనిపిస్తోంది. అదే సమయంలో బీజేపీతో తమకు ఎలాటి పొత్తూ ఎన్నికలకు ముందు వుండే చాన్స్ లేనే లేదని వైసీపీ కరాఖండీగా చెబుతోంది. అవన్నీ పైకి చెప్పే మాటలు, లోలోపల ఆ రెండు పార్టీలకి పొత్తు ఒదనేది బహిరంగ రహస్యం అంటుంది టీడీపీ. ఒకప్పుడు జనసేన, టీడీపీ కలిసేవున్నాయి. 2014 ఎన్నికలకు ముందు, ఆతర్వాత కొంతకాలం ఆ రెండూ మిత్ర పక్షాలే. ఏ విమర్శ వచ్చినా దాన్ని ఎదుర్కోవడంలో ఒకదానికొకటి దన్నుగా నిలబడేవి. అప్పుడు రాష్ట్రంలో బీజేపీది ఇదే వరస. ఒక మిత్రపక్షంగా టీడీపీకి అన్ని విషయాల్లో మద్దతు ఇచ్చేది. తెలుగుదేశం పార్టీ కూడా కేంద్రంలో మోడీ ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా గుడ్డిగా సమర్థించిన రోజులు వున్నాయి. ఏం జరిగిందో ఏమో! కాలక్రమంలో ఈ మూడు పార్టీలదీ వేర్వేరు దారులయ్యాయి. వీటిమధ్య దూరం పెరిగింది. అగాధం ఏర్పడింది. టీడీపీ ప్రభుత్వంలో అవినీతి విచ్చల విడిగా పెరిగిపోతోందని జనసేనాని పవన్ అనేక సభల్లో ప్రసంగాలు చేయడం మొదలు పెట్టారు. ఈ ధోరణిని టీడీపీ హరాయించుకోలేక పోయింది. మిత్రపక్షంగా ఇచ్చే కొన్ని సలహాలు కాసింత కఠినంగా వున్నా ఓర్చుకోవచ్చు. కానీ, ప్రధాన ప్రతిపక్ష నాయకుడు జగన్ మోహనరెడ్డిని మించి విమర్శలు చేస్తుంటే విని తట్టుకోలేని పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో టీడీపీ ఎదురు దాడి మొదలుపెట్టక తప్పలేదు. అయినదానికీ, కానిదానికీ ఆరోపణలు చేస్తూ పోతుంటే ఎవరికి మాత్రం ఓపిక ఎన్నాళ్ళు వుంటుంది?

ఓరిమి కోల్పోయిన టీడీపీ జనసేన, వైసీపీలపై విమర్శనాస్త్రాలు ఎక్కుబెట్టడం మొదలు పెట్టింది. ఈ రెండూ మోడీ చేతిలో కీలుబొమ్మలు. బీజేపీ ఆడించినట్టు ఆడడమే వీరి పని అని ఘాటు విమర్శలకు దిగింది. ఇదంతా వట్టిదే. ఆ రెండు పార్టీలు, జనసేన, టీడీపీ ఎన్నికలనాటికి మళ్ళీ చెట్టాపట్టాలు వేసుకు తిరుగుతాయి, చూస్తూ ఉండండని వైసీపీ నాయకుల జోస్యం. ఈ మాట బయటకి రావడమే ఆలస్యం, మేము జనసేనకు దగ్గరయితే వైసీపీకి ఏమిటి బాధ అంటూ టీడీపీ అధినేత బహిరంగ వ్యాఖ్యానం. వైసీపీ, బీజేపీల నడుమ రహస్య పొత్తు ఉందా లేదా అనే విషయం వైసీపీ నాయకుడు ముందు స్పష్టం చేయాలని సవాలు. అసలు బీజేపీ , టీడీపీల నడుమ స్నేహ బంధం తెగిపోలేదని, తెగినట్టు నాటకం



ఆడుతున్నారని, ఎన్నికల ఘడియ దగ్గర పడే వేళకు 2014 నాటి ఆ మూడు పార్టీల పొత్తుల పునరుద్ధరణ ఖాయం అని వైసీపీ నాయకుల ఎద్దేవా. ఈ కారణం చేతనే రాష్ట్రంలో టీడీపీ అవినీతిని బీజేపీ బాహాటంగా ఖండించలేకపోతోందని, శ్వేత పత్రాల పేరుతో టీడీపీ సాగించిన బీజేపీ వ్యతిరేక ప్రచారాన్ని ఎదిరించలేకపోతోందని, అంచేతే ప్రధాని మోడీ ఏపీ పర్యటన వాయిదా వేసుకున్నారని వైసీపీ ఆరోపణ. అంతేకాదు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ప్రధాని మోడీని వీలు చిక్కిన ప్రతి సందర్భంలో ఎంతలేసి మాటలు అంటున్నా మోడీ కిమ్మనకుండా మిన్నకుండిపోవడాన్ని ఇందుకు ఉదాహరణగా వైసీపీ ఉదహరిస్తోంది. ఒక వార్తాసంస్థకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో కూడా బాబు గురించి మోడీ ప్రస్తావించక పోవడాన్ని ఆ పార్టీ పేర్కొంటోంది. తెలంగాణ ఎన్నికల్లో మహాకూటమి ఘోర పరాజయాన్ని గురించి మాట్లాడిన మోడీ ఆ కూటమి సూత్రధారి చంద్రబాబు ప్రస్తావన మాట మాత్రంగా కూడా తేకపోవడాన్ని వైసీపీ తప్పు పట్టింది. చంద్రబాబు పైకి చెప్పుకుంటున్నట్టు నిజంగా ఆయన మోడీపై హోరాహోరీ పోరాడుతూ ఉన్నట్టయితే, వైసీపీ నుంచి టీడీపీ లోకి ఫిరాయించిన ఎంపీలపై ఈపాటికే అనర్హత వేటు పడివుండాలి. చట్ట ప్రకారం జరగాల్సిన అంశంలోనే టీడీపీ పట్ల మోడీ ఇలాంటి మెతకవైఖరి అవలంబిస్తుంటే ఇక వారిద్దరూ ప్రత్యర్థులు అంటే నమ్మేదెవరు? అనే లా పాయింటు లాగుతోంది. కలసిపోదాం అంటూ టీడీపీ అధినేత బహిరంగంగా ఇచ్చిన ఆహ్వానం పట్ల జనసేన వైఖరి సానుకూలంగా లేదు. రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ స్థానాలకు తమ పార్టీ ఒంటరిగానే పోటీ చేస్తుందని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ట్వీట్ తో అందుకు బదులిచ్చారు. ఇలాంటి ప్రకటనలు, వ్యాఖ్యల ద్వారా జనసేన శ్రేణుల్లో అయోమయం సృష్టించే టీడీపీ వ్యూహాలకు తాము పడబోమని జనసేన ప్రతినిధులు స్పష్టం చేస్తున్నారు.

తెలంగాణా అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీతో పెట్టుకున్న పొత్తు ఏపీ ఎన్నికలవరకు కొనసాగుతుందా లేదా అని మరో జాతీయ పార్టీ కాంగ్రెస్ నేతల అనుమానం. అయినా ఎందుకయినా మంచిదని, టీవీ చర్చల్లో గతంలో టీడీపీని సమర్థిస్తూ బీజేపీ నేతలు సమర్థంగా పోషించిన పాత్రలోకి వాళ్ళు పరకాయ ప్రవేశం చేస్తున్నారు. ఇలా రాష్ట్రంలోని మెజారిటీ పార్టీలు ఎదుటిపక్షంపై జనాలకు అనుమానాలు కలిగేలా వ్యవహారాలు సాగిస్తున్నారు. గత అనుభవాల దృష్ట్యా ఏదైనా జరగవచ్చునీ, ఎవరు ఎవరితో అయినా కలవవచ్చని, ఇంతోటిదానికి తలలు పగలగొట్టుకోవడం ఎందుకనే నిర్లిప్త పరిస్థితిలోకి ప్రజలు జారుకుంటున్నారు. రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు అన్నింటికీ లక్ష్యశుద్ధి పుష్కలంగా వుంది. అధికార పీఠం అధిరోహించడం ఆ లక్ష్యం. ఆ గమ్యాన్ని చేరుకునే మార్గం విషయంలోనే చిత్తశుద్ధి కానరావడం లేదు. ఎలాగైనా సరే, ఏం చేసయినా సరే గమ్యాన్ని చేరుకోవడం ప్రధానం. ఎలా చేరామన్నది ముఖ్యం కాదు. చేరడం ఒక్కటే ప్రధానం. అందుకే ఇన్నిరకాల రాజకీయ విన్యాసాలు.

ఇవి గమనించిన తర్వాతే కాబోలు సాంఘిక మాధ్యమాల్లో రకరకాల వ్యాఖ్యానాలు వెలువడు తున్నాయి.

మచ్చుకు కొన్ని : మేము తీవ్రంగా ఖండిస్తున్నాం. మీరెందుకు ఖండించరు? మేము నిలదీస్తుంటే మీరెందుకు ఆ పార్టీని నిలదీయరు?

మీరు చేసేదే మేము చేస్తుంటే ఇక మా పార్టీ ఎందుకు?

స్క్రిప్ట్ పేపర్లు తారుమారయ్యాయా ఏమిటి! మన నాయకుడు ఆపార్టీ గురించి వేరే విధంగా మాట్లాడుతున్నాడు ప్రెస్ తో

మారింది పేపర్లు కాదు, పార్టీ విధానం సృష్టికర్త మాకు అప్పగించిన కర్తవ్యాన్ని రాజకీయ నేతలు తమ భుజానికెత్తుకున్నారు. ఈ లోకంలో మాకిక పనిలేకుండా పోయింది –ఊసరవెల్లుల సంఘం 2014లో ఆయా పార్టీలు అనేక వాగ్దానాలు చేశాయి. ప్రజలు నమ్మి గద్దె ఎక్కించారు. వాటిల్లో అధిక శాతం నెరవేర్చామని, అదనంగా అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశామని గద్దె ఎక్కిన పాలక పక్షం చెప్పుకుంటోంది. ప్రచారంలో చెప్పుకుంటున్న స్థాయిలో కాకపోయినా, అనేక రంగాల్లో మంచి అభివృద్ధి జరిగిన మాట వాస్తవం. కానీ రాజకీయ వికృత క్రీడల కారుమేఘాల్లో అది కనిపించకుండా పోతోంది. అది టీడీపీ దురదృష్టం. ఆంధ్రప్రదేశ్ ఎన్నికల నామసవత్సరంలో ప్రవేశించింది. మరో కొద్ది నెలల్లో అటు పార్లమెంటుకు, ఇటు ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీకి జమిలి ఎన్నికలు జరుగుతాయి. పార్ట్యప్రణాళిక పూర్తి కాకుండానే పార్టీలకి ప్రజాపరీక్షలు తోసుకు వస్తున్నాయి. ఇక చేసేదేమీ లేక రాజకీయ పార్టీలు, ప్రజా సక్షేమాన్ని పక్కనబెట్టి పైన చెప్పిన రాజకీయ వ్యూహ, ప్రతివ్యూహాలతో లక్ష్యసాధన పట్ల పూర్తిగా దృష్టి పెడుతున్నాయి. ప్రజల తీర్పు వెలువడేలోపల ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు మరెన్ని మలుపులు తిరుగుతాయో, ఎవరు ఎవరితో జత కడతారో, ఎవరు ఎవరినుంచి దూరం జరుగుతారో ఇప్పటికిప్పుడే చెప్పడం కష్టం. అవకాశవాదానికి అగ్రతాంబూలం లభిస్తున్న ఈ సంకీర్ణ రాజకీయ యుగంలో ఈ ప్రశ్నలకు జవాబులు చెప్పడం మరింత కష్టం.

నోట్ దిస్ పాయింట్ !



ప్రత్యేక హోదా కోసం ప్రధానిని నిలదీయడం తప్పా? మా సీఎంను తిడుతుంటే మోడీ నవ్వుతూ ఆస్వాదిస్తారా?
–ట్విటర్‌లో ఏపీ మంత్రి నారా లోకేశ్



రఫెల్‌పై నేను అడిగిన ప్రశ్నలను ప్రజలు కూడా ప్రధానికి సంధించాలి
–ట్విటర్‌లో కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ



నరేంద్రమోడీ బీజేపీ రాష్ట్రాలకే ప్రధాన మంత్రా? తెలంగాణలో బీజేపీ ఉనికి లేదని సవతి ప్రేమ చూపిస్తున్నారు. **హైదరాబాద్‌లో టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.ఆర్**




హాస్యాస్పదమైన వలస విధానాల వల్ల అమెరికా ప్రతిభావంతులను కోల్పోతోంది. విదేశీ విద్యార్థులూ ఇక్కడే ఉండాలి.
–అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్



ఆయన్ను యాక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్ అనలేం. పివి తరవాత ఆయనే విజయవంతమైన ప్రధాని.
–మన్మోహన్ సింగ్‌పై శివసేన నేత సంజయ్ రౌత్

చరిత్రలో ఈరోజు



1992లో ఇదే రోజున బాబ్రీ మసీదును కరసేవకులు కూల్చివేశారు. దీనిని 1528సంవత్సరంలో మొఘల్ చక్రవర్తి బాబర్ నిర్మించారు. కూల్చివేత సంఘటన దేశంలోని అనేక ప్రాంతాలలో మత కల్లోలాను రేపింది. ఆ ప్రాంతంలోనే రాముని ఆలయం ఉండేదనీ, అదే శ్రీరాముని జన్మస్థలమనీ హిందువుల నమ్మిక. ఈ ప్రాంతంలో రామాలయం నిర్మించాలనే డిమాండ్‌తో 1990లో అప్పటి బీజేపీ అధ్యక్షుడు ఎల్.కె. అద్వానీ రథయాత్రను ప్రారంభించారు.

మంచి మాట



జీవితంతో గడపడం ఎలాగో తెలుసుకోగలగడమే జీవిత పరమార్థం
–హెలెన్ మిర్రెన్

వేగాన్ని అదుపు చేయాలి

పైసా పైసా కూడబెట్టి, ఆశలన్నీ పోగుచేసి ఉన్నత చదువుల కోసమో, ఉన్నత ఉద్యోగం కోసమో, దేశం కాని దేశానికో, ఊరుకాని ఊరికో పిల్లలను పంపిస్తాం. ఎన్నాళ్లనుంచో గూడుకట్టుకున్న ఎదురుచూపుల వర్షం ఆనాడు కురవడానికి సిద్ధమౌతోంది. ఆ క్షణం కోసం తల్లిదండ్రుల చూపులో, పిల్లల చూపులో, భార్య చూపులో వారి రాక కోసం పడిగాపులు గాస్తుంటాయి. సముద్రాలు దాటి, పొలిమేర దాటి, తీరా ఐదో, పదో నిమిషాలకు ఇంటికి చేరుకునే సమయంలోపే ప్రమాదంలో చిక్కుకున్న వార్త గుండెలను పిండి చేస్తుంది. దానికి ఒకే ఒక్క కారణం అతి వేగం. తొందరగా చేరుతామన్న ఆత్రుతో, అవతలి వారి నిర్లక్ష్యమో కొన్ని జీవితాలను అకస్మాత్తుగా బలి తీసుకుంటుంది. వేగ నియంత్రణ లేక రహదారులు చావుకు మార్గాలై కడుపుకోత మిగులుస్తున్నాయి. సీటు బెల్టు, హెల్మెట్, గీత దాటితే రుసుము, నెంబర్ ప్లేటు లాంటి నిబంధనలకన్నా అతి ముఖ్యమైనది అతివేగం. అందుకే వాహనాలకు వేగం 80 నుండి 100 కి.మీ. మధ్య హద్దు నియమించాలి. వేగంగా వెళ్తే, పరలోక ప్రయాణమనే వాస్తవాన్ని గ్రహించాలి. మనల్ని మనం కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది.

– **పుట్టి గిరిధర్** మహబూబ్ నగర్
9491493170

దేవుళ్లెంత మంది?



వ్యంగల్పిక

జి.ఎస్. దేవి
బోథెల్, వాషింగ్టన్

మనకి ముక్కోటి దేవతలున్నట్లు ఎక్కడో ఓ లెక్క చూసా. ఆ లెక్కన ఒక్కో ఆపద్బాంధవుడికీ రెండొందల ముప్ఫై ముగ్గురు దాకా భక్తులను ఆదుకొనే బాధ్యత ఉన్నట్లే కదా! ఇంత కటికిక్కరువు రోజుల్లో ఎంత భగవంతుడికైనా అదెంత బరువో ప్రభుత్వాలకు బోధపట్టంలేదు. దేవుడి పాలన పేరు చెప్పి కుర్చీలెక్కి కూర్చుంటున్నారే గానీ ధర్మరక్షణ డ్యూటీలో ఆ దేవుళ్లెదుర్కొంటున్న కష్ట నష్టాలేంటో.. ప్రతిపక్షాలూ పట్టించుకోడంలేదు. ఆపదలను ఆదుకొనే డ్యూటీలో ఆ ఆపద్బాంధవులకు ఎదురయ్యే ఇబ్బందులేవో క్షేత్రస్థాయి దాకా దిగెళ్లి విచారిస్తేనే గదా దేవుళ్లనూ సర్కారులు ఆదుకోవాలనే డిమాండుతో ఎవరైనా ముందుకెళ్లేదీ? ఎలాగూ మళ్లీ వచ్చే ఎన్నికలో బిజీ అయే దాకా మనకంతా ఖాళీనే గదా అందుకని ఇంట్లో గోళ్ళు గిల్లుకుంటూ కూర్చోడమెందుకని ఇట్లా దేవుళ్ల గణ సేకరణకని బైలుదేరావన్న మాట! బాగుందిరా బాబీ! పరిచయాలు పెరుగుతాయ్. కొత్త అనుభవాలు కలుగుతాయ్! పోయి రా! ఆల్ ది బెస్ట్! అబ్బాయి ముందుగా బ్రహ్మలోకంలోకి ప్రవేశించాడు. తామరతూడులో తామరాసనుడు లేడు! అక్కడే మానససరోవరం మడుగులో కునికిపాట్లు పడే హంస కనిపించింది. వాకబు చేసిన మీదటా పక్షివాహనం అందీ.. మా బ్రహ్మ లోకం లెక్కల ప్రకారం మీ లోకానికి సెకనుకి నాలుగు శాల్తీలయ్యా సరఫరా అవ్వాలి! అన్ని శాల్తీలు సక్రమంగా తిరిగొస్తేనే సృష్టి చక్రం సజావుగా తిరిగే వీలు. కానీ ఇక్కడికి తిరిగొస్తున్నవి మాత్రం కేవలం ముచ్చటగా రెండంటే రెండే! ఈ లెక్కన మనుషుల్నిచేసే ముడిసరుక్కి ఎంత గిరాకీ వచ్చి పడిందో తెలుసా మీ పాలకులకు! పనిభారమూ ఎక్కవపోతోంది రోజు రోజుకీ పాపం మా పెద్దాయనకి. బ్రహ్మ రాసిన నుదుటి రాతల్ని కూడా మీరు అవేవో జెనెటిక్స్..


పాడో.. వాటి సాయంతో తిరగ రాసేసుకుంటున్నారంట గదా! బోలెడన్ని ఫిర్యాదులు బాబూ చిత్రగుప్తున్ని నుంచీ ! అన్ని సమస్యలకీ చెక్ పెట్టేసే కొత్త సాఫ్ట్‌వేరేమన్నా దొరుకుతేమోనని వాకబు చేసేందుకు వెళ్లారబ్బాయ్ విశ్వకర్మ దగ్గరకు మా విధాతగారు. విధాత సంగతి సరే హంసా .. మరి వాణీమాత కూడా కనిపించడం లేదే! బ్రహ్మ కష్టాలు బ్రహ్మవి. అమ్మ కష్టాలు అమ్మవి. మీ మానవుల బుర్రల్లో బుద్ధి ఎక్కువ కూరడం బుద్ధితక్కువ పనయిందని మొత్తుకుంటున్నారయ్యా ఇక్కడి దేవుళ్లంతా! అంత కష్టపడి ఎన్నో భాషలు కనిపెట్టి ఇంచక్కా ఎవరి పుట్టుక భాష వాళ్ళు మాట్లాడు కోండర్రా అంటూ అన్ని ఏర్పాట్లు చేసినా.. తమరం తా అక్కడ ఏ చేస్తున్నార్రా సన్నాసులూ! అన్నింటినీ కలగలిపేసేసి ఓ కొత్త రకం సంకర భాష నేసి వాడేస్తు న్నారు! నా భాష భేషంటే నా భాష భేషని దుర్భాషలాడుకుంటున్నారు! మైకుల ముందు మీ నేతల కూసే కూతలు.. పత్రికల్లో మీరు రాసే రాతలు భాషామతల్లికి ఎంత అపచారంగా ఉన్నాయో మీకు అర్థమవడంలేదు! అసలు మీ ఘోష, యాసలే ఓ పట్టాన మా శారదమ్మ బుర్రకు ఎక్కడం లేదు! మానవా! కారుకూతలు మానవా! అని మీకు అర్థమయేలా అర్థించాలన్నా చదువులమ్మకి సంకర భాషే గతయిపోయిందిరా ఇప్పుడు! ఎవరో టీ.వీ యాంకరమ్మంట! ఆ పిల్ల దగ్గర ఈ సంకర భాషకు ట్యూషను పెట్టించుకొంది మధ్య మా తల్లి. పలుకంజలి అక్కడిగ్గానీ వెళ్ళిందేమో! సారీ! అమ్మను కలవలంటే మరో సారెప్పుడన్నా రావాల్సిందే మరి అబ్బాయి అటునుంచి అటే విష్ణులోకానికని పయనమయ్యాడు. పాలకడలి మీది పాముపడకా బోసిగా ఉంది. పరమాత్ముడేమన్నా కొత్త అవతారం ఎత్తేందుకని వెళ్లాడేమో! ఆ మాటే అడిగితే ఇంతెత్తున తోక మీద లేచాడు ఆదిశేషుడు!

అదొక్కటేరా తక్కువ ఇప్పుడు మా అవతారమూర్తికి! మీ లోకంలో ఎవరో గాలి సోదరులంటగా! నలభై మూడు కోట్లు తగలేసి వజ్రవైఢూర్యాలు పొదిగిన స్వర్ణకిరీటమేదో చేసి స్వామివారి నెత్తికి తగిలించారుగా ఒకానొకప్పుడు! అప్పుడొచ్చిన మాడు పోటు.. ఇప్పటికీ తగ్గడం లేదు శ్రీవారికి. మా ధన్వంతరిగారి దగ్గరి మందులేవీ పనిచేయడం లేదిప్పుడు. మంచి వైద్యుడేమన్నా దొరుకుతాడేమోనని మీ లోకానికే దయచేసార్రా మా నారాయణుడు! వైద్యం వికటించిందో.. బిల్లింకా సెటిలవలేదో.. ఇంకా స్వామి వారు వైకుంఠానికి తిరిగి రాలేదు. హరి సంగతి సరే! మరి సిరి? అమ్మగారూ అయ్యగారి వెంటనే వేంచేశారా? అమ్మో! మీ లోకానికే! స్త్రీలు ఒంటరిగానే! సిరి కాకలో పడి కొట్టుమిట్టాడుతున్నారంటగా అక్కడ మీ నడమంత్రపు సిరిగాళ్లు! ఎక్కడే కీచకుడు కట్టిపారేస్తాడోనని స్వామివారే లక్ష్మమ్మ తల్లిని వెంట రావద్దని ఆదేశించారు.

అయినా.. మీ మానవాధవుల మీదనే మా అమ్మ కెందుకో అంత జాలి? బీదాబిక్కిని ఆదుకుందామని వెళ్లినా వెళ్లుంటుందీ తల్లి! ఆదిలక్ష్మమ్మన్న ఆదరమైనా లేకుండా ఏంచేస్తున్నార్రా మీరెన్నుకున్న పెద్దమనుషులంతా? ముఖం మొత్తానికి కాటుక రంగు పులిమి నేల మాళిగల్లోనట్రా తల్లిని దాచేసేది! అహ్వ..! అంటూ జిహ్వనిండా నిప్పులు గుమ్మరించాడు ఆదిశేషుడు. ఇంకొక్క క్షణం అక్కడుంటే మాడి మసవడం ఖాయం. అబ్బాయి అమాంతం కైలాసానికి జంప్! కైలాసగిరిదీ డిటో కేసే. హిమాలయాగ్రం మొత్తం ఖాళీ సచివాలయాన్ని తలపిస్తోంది. తెల్లకార్డోళ్లందరికీ పోటీలు పడి మరీ రూపాయికిలో బియ్యం పంచేస్తున్నార్ట కదా కిందున్న లోకంలో! దారిద్ర్య రేఖకు ఎల్లప్పుడూ దిగువనే ఉండే సదాశివుడాయ ఆదిభిక్షువు! చౌకబియ్యం కోసం ఆదిదేవుడు గానీ అటు వైపు గానీ వెళ్లాడేమో! ఆ మాటే అడిగితే కాదయ్యా! అంది నంది ఆ నాసిరకం ముక్కసరుక్కి కొండలెక్కి దిగాలా మా కైలాసవాసి! మింగి హరాయించుకోడానికి మీ ప్రభుత్వాలిచ్చే

> మా బ్రహ్మ లోకం లెక్కల ప్రకారం మీ లోకానికి సెకనుకి నాలుగు శాల్తీలయ్యా సరఫరా అవ్వాలి! అన్ని శాల్తీలు సక్రమంగా తిరిగొస్తేనే సృష్టి చక్రం సజావుగా తిరిగే వీలు. కానీ ఇక్కడికి తిరిగొస్తున్నవి మాత్రం కేవలం ముచ్చటగా రెండంటే రెండే! ఈ లెక్కన మనుషుల్నిచేసే ముడిసరుక్కి ఎంత గిరాకీ వచ్చి పడిందో తెలుసా మీ పాలకులకు! పనిభారమూ ఎక్కవయిపోతోంది రోజు రోజుకీ పాపం మా పెద్దాయనకి. బ్రహ్మ రాసిన నుదుటి రాతల్ని కూడా మీరు అవేవో జెనెటిక్స్.. పాడో.. వాటి సాయంతో తిరగ రాసేసుకుంటున్నారంట గదా! బోలెడన్ని ఫిర్యాదులు బాబూ చిత్రగుప్తున్ని నుంచీ !

నూకలేమన్నా అలనాటి క్షీరసాగరం బ్రాండు హాలాహలమా పండూ! వ్యాహ్యాళికని వెళ్లిన అమ్మవారు వెండికొండకు ఇంకా చేరుకోలేదు. పదే పదే మూడో కన్ను అదురుతోందని మీ లోకానికే వురకలెత్తుకూంటూ వెళ్లారు బాబూ మా విలయ మహాదేవుడు! ఆ కంగారులో తనకో వాహనం ఉందన్న సంగతీ మర్చిపోయారు స్వామి అంది నంది. దేవుళ్ళంటే ఒక్క త్రిమూర్తులే కాదు గదా!



ఆ మధ్య ఏదో చిన్నగాలి తెమ్మెర వీచి ఓ గుడి గాలిగోపురం కూలింది. తిరిగి కట్టించుకుంటున్నప్పుడు ఏదో తిరకాసైందని వినికిడి. ఆ వివరాల కోసమని ఇప్పుడొచ్చి పడ్డాయిట ఈ.డి మూకలు! తిక్కశాఖలడిగే సవాలక్ష ప్రశ్నలకే గుక్క తిరక్కుండా ఉందక్కడి పరిస్థితి. అబ్బాయడిగే దేవుళ్ల లెక్కలకి జవాబులిచ్చే నాథుడు ఇంకెక్కడుంటక్కడ? రోజుల్తతరబడి రద్దీ క్యూలల్లో నిలబడి గుద్దులాడుకున్నా ఓ పట్టాన దర్శనమీయని పెద్ద దేవుళ్ళు కొందరున్నారు. వారి గుడులకేమో బంగారపు తొడుగులా? చిల్లర దేవుళ్ల చిల్లర ఖర్చుల మీదేమో ఇంత అల్లరీ ఆగమా? ఇంక ఆగం. చిన్న దేవుళ్లనేనా ఇంత చిన్నచూపు? ఈ అసమానతలని సహించేది లేదంటూ కొట్లాడేందుకంట చిల్లర దేవుళ్లంతా కొత్తగా ఓ కూటమి కట్టే పనిలో ఉన్నారంట! బిజీలో పడ్డ ఆ దేవుళ్ల నుంచి ఇహ సమాచారం రాబట్టడం కల్ల. తిరిగొచ్చే దారిలో మాత్రం లక్కీగా ఓ మర్రి చెట్టు నీడన కునికిపాట్లు పడే గ్రామ దేవత తగిలింది అబ్బాయికి. దేవుళ్ల లెక్కా? దర్శనాలు దొరక్క చిక్కా? కరువు కాటకాలతో అల్లాడే చిన్నా చితకలకు ఏదో చీరె.. సారె లంటూ.. ఏడాదికో సారొచ్చె పండగలకు కానుకలిప్పించడం దేవుళ్ల కేమంత పెద్ద లీలలు కాదబ్బాయ్! ఆమ్ ఆద్మీలతో ఆపద్బాంధవుల కెప్పుడూ అసలు సమస్యలే రావు. చావల్లా మీ రాజకీయ నాయకుల యావల వల్లే! ఐదేళ్లకోసారి జరుపుకొనే ఎన్నికల వ్యవస్థోటి ఏర్పాటు చేసి మళ్లీ మా జోలికి రాకండర్రా అంటూ భూమ్మీదకు తోలేసినా మీ పెద్దమనుషులకింకా మంచి బుద్ధులబ్బడం లేదు.

జనాలను సేవించుకొనే పనీ పాటా మానేసి పద్దస్తమానం ఏవేవో ఎన్నికలంటూ ఆపసోపాలు పడిపోతున్నారు. ఓ ముఖ్యనేత బుర్రలో ఎప్పుడూ ఏవో ఎన్నికల పురుగులే! ఏదో ఒహ ముడుపుల వంకతో కాళ్ల మీద పడిపోయి ఎంత లావు దేవుణ్ణయినా ఇరకాటంలో పెట్టే బుద్ధా పెద్దాయనది. ఎప్పుడు ఏ ఎన్నికలొచ్చి పెద్దపులిలా మీద పడతాయోనని ఇంకో ముఖ్యనేతకు పద్దస్తమానం ఓ అనుమానం. హారతులూ.. ధర్మదీక్షల వంకతో తెల్లార్లూ కాన్ఫరెన్సులు పెట్టడమా పెద్దమనిషి వీక్ నెస్. తాను నిద్ర పోడు.. దేవుళ్లనూ నిద్ర పోనీడు! అసలు ఎన్నికలనేవే లేకుండా ఎత్తి కుదేస్తే పోలా అని మరో ఇద్దరు పెద్దల సాకుల వేట! కాశీ నుంచి కన్యాకుమారి దాకా ఏ దేవుణ్ని వాళ్లు విశ్రాంతిగా తమ డ్యూటీలు చేసుకోనివ్వరు. మరో తల్లిచాటు బుల్లినేతకు వంశపరంగా వచ్చే పల్లకీ ఇంకా అందలేదని బెంగ, ఆ పిల్లనేత పర్యటనలకొచ్చిందాకా ఈ దేశంలో ఇన్ని గుళ్లూ గోపురాలున్నాయన్న వివరాలు దేవుళ్లకే తెలీదు! పార్టీల కొక్కటికే కాదబ్బీ.. పై నుండే దేవుళ్లకీ పెద్ద తలబొప్పే ఈ పీడాకారం ప్రజాస్వామ్యం! పవరున్నంత కాలం కావరాలతో చెలరేగిపోయి. ఎన్నికలొచ్చే వేళకి దేవుళ్ల ముందు చెవులు పట్టుకోటమేంటి? చిన్నా చితకల్తో కలిపి మీ దేశంలోని పార్టీల సంఖ్య సుమారు రెండు వందలకు తక్కువ రెండువేలు అటో ఇటో. ఒక్క నేత ఉన్న బుడ్డి పార్టీకి కూడా.. జనం నడ్డి మీదెక్కి ఊరేగాలమొ పిచ్చ కుతి. యజ్ఞ యాగాదులంటేనే దేవుళ్లకు బెంగ పట్టుకునే పరిస్థితి. ఎన్నికల్లో పంచే మందూ మాకూ సైతం ముందు దేవుళ్ల ముందే పెట్టి ఊహకందని వరాలేవేవో డిమాండు చేసేస్తున్నారు నేతలు. ఎంత దేవుళ్లకైనా దడుపు జ్వరాలు పట్టుకుంటాయా.. లేదా? దేవుళ్లకి మహిమలున్నదే అమాయకులని తమలా ముంచేందుకేనని నమ్మే నాయకులు ఎక్కువైపోతున్నార్రా నాయనా ఇప్పుడు! ఆ పైన ఇహ మాటలు పెగలగ కన్నీళ్లు పెట్టుకునేసింది ఆ పిచ్చి తల్లి. అమ్మ తల్లడిల్లే రేంజీ చూసి అనుమానంగా అడిగాడబ్బాయి ఆఖరికి. జవాబుగా చెప్పిందా చెట్టు కింద చీర చెరుగేసుకొని పడుకున్న అమ్మ గుడిని పేల్చేసి మీ గనుల గలీజు మనుషులు నిలవ నీడైనా లేకుండా చేసిన సుంకాలమ్మను నేనేరా నాయనా !

శబరిమలైలో గోల గోలగా ఉండింది, ట్రిపుల్ తలాక్ వ్యవహారం మళ్లీ మొదటికొచ్చింది. అయోధ్య గుడి వివాదం గుదిబండలా దేశం మెడకింకా వేలాడుతోనే ఉంది. ఎన్నికల్లో ఓడినా అభ్యర్థులింకా మళ్లీ న్యాయం కావాలని దేవుళ్ళ వంకే దురాశగా చూస్తుంటిరి! అన్నింటి కన్నా అతి పెద్ద విషమ సమస్య రేపొచ్చి పడబోయే పెద్ద ఎన్నికల దెబ్బర అబ్బీ! ఇన్ని ఇష్యూలు పట్టి పీడిస్తున్నా ప్రధాన మంత్రంతటి పెద్దమనిషే ఎక్కడున్నాడో విలాసం తెలీనివ్వడం లేదెవ్వరికీ! భక్తుల దీప ధూప నైవేద్యాల మీదనే ఉనికి లాగించే దేవుళ్లు నీక్కనపడి అడిగిన వివరాలన్నీ అంత ధైర్యంగా చెప్పేస్తారనేనా పిచ్చి సన్నాసీ! నిజానికి నీ ప్రశ్న మరీ అంత చిక్కుముడీ కూడా ఏం కాదు! అన్యాయం బాబాయ్! కాళ్లరిగేలా ముల్లోకాలు చెడతిరిగొచ్చాను. ముందే ఆ ముక్క నా చెవిలో వేయచ్చుగా.. నాకీ కాళ్ల తిప్పట్లన్నా తప్పుండేవి! అబ్బాయి గద్దింపులు. ముందే చెబితే నీ రాజకీయ బుద్ధి నిన్ను నన్ను నమ్మనివ్వదురాబ్బీ! నీకై నువ్వుగా దైవలోకాలక్కూడా వెళ్ళొస్తేనే అక్కడి వ్యవహారాలూ ఎంత డొల్లవో అర్థమవుతాయి. అప్పటిగ్గానీ రేపటి ఎన్నికల్లో నీకు నిఖార్సైన హామీలు మనస్ఫూర్తిగా ఇచ్చేవేవో నిక్కచ్చిగా తేలవు.

ఆ హామీలు ఏమిటో మరిప్పుడైనా తెలుస్తున్నాయా ? బాబాయి ప్రశ్న. స్వతంత్రం వచ్చినప్పటి బట్టి ఎందరో నేతలు మీకు దేవుడి పాలన రుచి చూపిస్తూనే వస్తున్నారు. ఈ సారికి నాకూ ఓ అవకాశం ఇచ్చి చూడండి. మనిషి పాలన ఎట్లా ఉంటుందో నేను రుచి చూపిస్తా! నా మీద నమ్మకముంటేనే గెలిపించుకోవచ్చు మీరు! నో అన్నా నో ప్రాబ్లం! ప్రతిపక్షంలో కూర్చునో, బైట ప్రజాన నిలబడో అనుక్షణం మీ సమస్యలు కోసం సామరస్య ధోరణితో సమన్వయంతో పనిచేస్తా ఇదే కదా బాబాయ్ నువ్వనే ఆ నిక్కచ్చి హామీ! శభాష్ రా అబ్బీ! ఈ సారి ఎట్లా గెలవ్వో చూద్దాం.. పద! దేవుళ్ల దగ్గరికి ఆనక! ముందు నీకు ఓట్లేసి గెలిపించాల్సిన ఓటరు దేవుళ్ల దగ్గరికి నడు! మొదట్లో నువ్వు దేవతల లెక్కొకటి అడిగావు గుర్తుందా! ఎంత మందో ఇప్పుడు నీకూ తలకెక్కుతోందా ముక్కోటి కాదు.. మనకు! నూట ఇరవై పై చిలుకు కోట్ల దేవతలు.. తాజా జనగణన సమాచారం ప్రకారం దేశ జనాభా కూడా అంతే కదా బాబాయ్ మరి దాదాపు.



జీఎస్టీ అమలులో ఉన్నా ఆగని జీరో వ్యాపార దందా

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో జీరో వ్యాపార దందాను నిలువరించేందుకు వాణిజ్య పన్నుల శాఖ సరికొత్త విధానానికి నాంది పలకనున్నది. రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ (ఆర్ఎఫ్ఐడి) సిస్టమ్‌ను అందుబాటులోకి తీసుకువచ్చి సరకు రవాణా వాహనాలపై ఆ శాఖ నిఘా పెంచనున్నది. వస్తు సేవల పన్ను (జీఎస్టీ) అమలులోకి వచ్చినప్పటికీ రాష్ట్రంలో జీరో వ్యాపార దందా యథేచ్ఛగా సాగుతున్నది. దేశవ్యాప్తంగా ఒకే పన్ను విధానం అమలులోకి వచ్చినప్పటికీ కొందరు వ్యాపారులు పన్ను ఎగవేతకు పాల్పడుతున్నారని వాణిజ్య పన్నుల శాఖ అధికారులు గుర్తించారు. జీఎస్టీ అమలులోకి వచ్చిన తరువాత రాష్ట్రాల సరిహద్దుల్లోని తనిఖీ కేంద్రాలను పూర్తిగా ఎత్తేశారు. అంతర్ రాష్ట్ర వాహన రాకపోకలపై నిఘా కరవైంది. వాహనాల కదలికలపై నియంత్రణ లేకుండా పోయింది. వస్తువుల వినియోగం జరిగిన చోటే జీఎస్టీ చెల్లింపులు జరపవలసి ఉన్నా కొందరు వ్యాపారులు స్వార్థంతో సరకులు బయటకు పంపకుండానే పంపినట్లు ఆన్‌లైన్‌లో చూపుతున్నారు. వారు సరకు అక్కడే అమ్ముకుని పన్ను ఎగవేతకు పాల్పడి జీరో వ్యాపారానికి తెర తీస్తున్నారు. ఉత్తర్ ప్రదేశ్ ఇప్పటికే ఆర్ఎఫ్ఐడి విధానం అమలు చేసి మంచి ఫలితాలు రాబట్టింది. ఈ తరహా విధానాన్ని రాష్ట్రంలోనూ ప్రవేశపెట్టేందుకు వాణిజ్య శాఖ నిర్ణయానికి వచ్చింది. ఆర్ఎఫ్ఐడి విధానం పూర్తి స్థాయిలో అమలు కావడానికి క్షేత్ర స్థాయిలో అక్కడక్కడ యాంటినాలు ఏర్పాటు చేయవలసి ఉండడంతో కింది స్థాయి అధికారులు నివేదికలు ఇవ్వాలని వాణిజ్య పన్నుల శాఖ అధికారి అనిల్ కుమార్ ఆదేశించారు. వైర్‌లెస్ విధానంలో రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ ద్వారా వాహనం రాకపోకలపై నిఘా పెరగనున్నది.



అతి పెద్ద స్క్రీన్‌తో షావోమి స్మార్ట్ టీవీ



ముంబయి : చైనాకు చెందిన ఎలక్ట్రానిక్స్ దిగ్గజం షావోమి పెద్ద స్క్రీన్ గల ఎంఐ టీవీ4 65 అంగుళాల వేరియంట్ స్మార్ట్ టీవీని త్వరలో భారత మార్కెట్‌లో ప్రవేశపెట్టేందుకు కసరత్తు చేస్తోంది. ఈ విషయాన్ని ఇండియా బ్రాంచ్ షావోమి కంపెనీ చీఫ్ మనుకుమార్ జైన్ తెలియజేశారు. ఎంఐ టీవీ4 65 అంగుళాల టీవీ ధర రూ. 60 వేలు ఉంటుందని అంచనా. ప్రస్తుతం భారత మార్కెట్‌లో షావోమి ఎంఐ టీవీ4 55 అంగుళాల టీవీ అందుబాటు ఉంది. ఎంఐ టీవీ4 55 రూ. 44,999, 55 అంగుళాల ఎంఐ టీవీ4 ప్రో రూ. 49,999 లభించనున్నది. షావోమి 32 అంగుళాల వేరియంట్ టీవీల ప్రారంభ ధర రూ. 12,499 నుంచి మొదలవుతుందని కంపెనీ తెలిపింది. 4కే డిస్‌ప్లే ఉండే 65 అంగుళాల షావోమి ఎంఐ టీవీ4 చైనా మార్కెట్‌లో రూ. 63 వేల ధరకు లభించనున్నది.

రిలయన్స్ జియో ఫోన్‌కు ప్రతిష్ఠాత్మక అవార్డు



న్యూఢిల్లీ : రిలయన్స్ జియో 4జీ ఫీచర్ ఫోన్ ప్రతిష్ఠాత్మక 'నిక్కీ సుపీరియర్ ప్రొడక్ట్స్ అండ్ సర్వీసెస్ అవార్డ్స్ ఫర్ 2018'ని సొంతం చేసుకున్నది. అతి తక్కువ ఆదాయం కలిగిన ప్రజలు కూడా ఇంటర్నెట్‌ను ఉపయోగించుకునే అవకాశాన్ని జియో ఫోన్ కల్పించిందని అవార్డు ప్రకటించిన జపాన్ పబ్లిషింగ్ సంస్థ ప్రశంసించింది. మెరుగైన వినూత్న ఉత్పత్తులు, సేవలతో పాటు భవిష్యత్ తరాలకు అవసరమైన సాంకేతికతను అందిం చేందుకు చేసిన కృషికి ఈ అవార్డు లభించినట్లు నిక్కీ తెలియజేసింది. కేవలం 49 రూపాయల నెలవారీ రీచార్జ్‌తో అపరిమిత కాల్స్, డేటా లభించే జియో ఫోన్‌కు అనతికాలంలోనే విశేష ఆదరణ లభించింది. 1982 నుంచి ప్రతి ఏడా ది నాణ్యమైన ఉత్పత్తులు, సేవలకు నిక్కీ ఈ అవార్డును అందజేస్తూ వస్తోంది. నిక్కీ ప్రచురణల్లో వచ్చిన 20 వేల ఉత్పత్తులు, సేవల నుంచి అత్యుత్త మమైనదానిని ఎంచుకుని అవార్డు ప్రకటిస్తారు. అయితే, ఇందు కోసం దరఖా౯స్తులేమీ ఆహ్వానించరు.

సాంకేతికత అభివృద్ధిలో అత్యున్నత ప్రమాణాలు, ధర ప్రభావం, వ్యాపారంలో వాటా, వృద్ధి సామర్థ్యం, ప్రత్యేకత, వాణిజ్య, సామాజిక ప్రభావం తదితర ఆరు అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ అవార్డును ప్రకటిస్తారు.

రూ. 2 వేల నోట్ల ముద్రణను నిలిపివేశాం
అధికారికంగా ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం



న్యూఢిల్లీ : పెద్ద నోట్ల చలామణీ రద్దు తరువాత చలామణిలోకి వచ్చిన రూ. 2 వేల నోట్ల ముద్రణ నిలిచిపోయింది. ఈ మేరకు కేంద్ర ఆర్థిక వ్యవహారాల శాఖ కార్యదర్శి సుభాష్ చంద్ర గార్గ్ అధికారికంగా ప్రకటించారు. ఆర్థిక వ్యవస్థలో రూ. 2 వేల నోట్లు తగిన స్థాయిలో ఉన్నాయని, అందువల్ల వాటి ముద్రణను నిలిపివేశామని ఆయన ట్విట్టర్ ద్వారా తెలిపారు. మన మొత్తం కరెన్సీలో 35 శాతానికి పైగా రూ. 2 వేల నోట్లు ఉన్నాయని ఆయన తెలియజేశారు. భవిష్యత్తు అవసరాలను అంచనా వేసి, కరెన్సీ నోట్ల ముద్రణకు ప్రణాళిక రచిస్తామని గార్గ్ తెలిపారు.

మ్యాగీ నూడుల్స్‌లో సీసం నిజమే
సుప్రీం కోర్టులో అంగీకరించిన నెస్లే



న్యూఢిల్లీ: పిల్లలు, పెద్దలు ఇష్టంగా తినే మ్యాగీ నూడుల్స్‌లో ప్రాణాంతక సీసం ఉన్నమాట నిజమేనని దాని తయారీ సంస్థ నెస్లే ఇండియా అంగీకరించింది. ఈ విషయాన్ని స్వయంగా సుప్రీంకోర్టుకు తెలిపింది. మ్యాగీ నూడుల్స్‌లో అత్యంత ప్రమాదకరమైన సీసం అవశేషాలు ఉన్నట్టు కేంద్ర ఆహార సాంకేతిక పరిశోధన సంస్థ (సీఎఫ్‌టీఆర్ఐ) గతంలోనే తేల్చింది. ప్రజల ప్రాణాలతో ఆడుకుంటున్నందుకుగాను నెస్లే ఇండియాకు రూ.640 కోట్ల జరిమానా విధించాలంటూ 2015లో కేంద్ర వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ.. జాతీయ వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ (ఎన్‌సీడీఆర్‌సీ)లో కేసు వేసింది. అయితే, కేసు విచారణపై స్టే విధించిన సుప్రీంకోర్టు నూడుల్స్‌ను పరీక్షించాలంటూ సీఎఫ్‌టీఆర్ఐని ఆదేశించింది. అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలతో నూడుల్స్‌ను పరీక్షించిన సీఎఫ్‌టీర్ఐ అందులో ప్రాణాంతక సీసం ఉన్నమాట నిజమేనని పేర్కొంది. తాజాగా, ఈ కేసు విచారణకు సంబంధించిన వాదనలు ప్రారంభం కాగా, సీసం ఉన్న నూడుల్స్‌ను ఎందుకు తినాలంటూ నెస్లే తరవు న్యాయవాది అభిషేక్ మను సింఘ్విని కోర్టు ప్రశ్నించింది. సింఘ్వి బదులిస్తూ.. ప్రభుత్వం చెబుతున్నట్టు నూడుల్స్‌లో సీసం ఉన్నప్పటికీ అది అనుమతించిన మోతాదులోనే ఉందని పేర్కొన్నారు. అయితే, అది ప్రాణాంతక మోనోసోడియం గ్లుటమేట్ (ఎంఎస్‌జీ) కాదని కోర్టుకు తెలిపారు. దీంతో ఎన్‌సీడీఆర్‌సీలో కేంద్రం వేసిన కేసును విచారించేందుకు జస్టిస్ డీవీ చంద్రచూడ్, హేమంత్ గుప్తాలతో కూడిన ధర్మాసనం అనుమతించింది.


హువావే నుండి మరో స్మార్ట్ ఫోన్



న్యూఢిల్లీ: చైనా మొబైల్ దిగ్గజ సంస్థ హువావే త్వరలో 'వై9 2019' ను భారత మార్కెట్లో విడుదల చేయనుంది. అమెజాన్ వెబ్ సైట్లో దీనిని ప్రత్యేకంగా విక్రయించనున్నారు. భారీ బ్యాటరీ, భారీ డిస్ప్లేతో పాటు ఈ ఫోన్ కి ముందు, వెనక భాగాలలో రెండు కెమెరాలని ఏర్పాటు చేశారు. ఆండ్రాయిడ్ ఓరియో 8.1 ఆపరేటింగ్ సిస్టంపై నడిచే ఈ ఫోన్ ధర మన దేశంలో పదిహేను వేలలోపు ఉండే అవకాశాలున్నాయి. ఈ ఫోన్‌లో 6.5 ఫుల్ హెచ్.డీ ప్లస్ డిస్ప్లే, ఆక్టాకోర్ కీరిన్ 710 ప్రాసెసర్, 4/6 జీబీ ర్యామ్, 64/128 జీబీ ఇంటర్నల్ స్టోరేజ్, ఆండ్రాయిడ్ 8.1 ఓరియో ఆపరేటింగ్ సిస్టం, 16/2 మెగాపిక్సల్ డ్యుయ్ల్ బ్యాక్ కెమెరాలు, 13/2 మెగాపిక్సల్ డ్యుయ్ల్ సెల్ఫీ కెమెరాలు, 4000 ఎంఏహెచ్ బ్యాటరీ (ఫాస్ట్ చార్జింగ్) తదితర సదుపాయాలుంటాయి.

సైబర్ క్రైమ్ పోలీసుల హెచ్చరికలతో
ఓఎల్ఎక్స్ దిద్దుబాటు చర్యలు

- తప్పుడు ప్రకటనలు తక్షణం తొలగించనున్నట్లు ప్రకటన
- వెబ్‌సైట్ ఆధారంగా 14 రాష్ట్రాల్లో మోసాలు
- సంస్థ దృష్టికి వీటిని తీసుకువెళ్లిన పోలీసులు



హైదరాబాద్ : సైబర్ క్రైమ్ పోలీసుల హెచ్చరికల నేపథ్యంలో ప్రముఖ ఆన్‌లైన్ వ్యాపార సంస్థ ఓఎల్ఎక్స్ దిద్దుబాటు చర్యలకు దిగింది. మీ వెబ్‌సైట్‌ను ఆధారంగా చేసుకుని దేశవ్యాప్తంగా 14 రాష్ట్రాల్లో పలువురు మోసాలకు పాల్పడ్డారని, ఇందుకు కారణం మీ సంస్థే అని ఇటీవల పోలీసులు తెలియజేయడంతో సంస్థ ప్రతినిధులు అప్రమత్తమయ్యారు. వెబ్‌సైట్ ఆధారంగా జరుగుతున్న వ్యవహారాలపై నిశితంగా దృష్టి సారించి తప్పుడు ప్రకటనలను తక్షణం తొలగించనున్నట్లు ఆ సంస్థ ప్రతినిధి ఎల్. చందన్ తెలిపారు. తప్పుడు ప్రకటనలను గుర్తించే బాధ్యతను ఇప్పటికే తమ ఐటీ ప్రతినిధులకు అప్పగించామని, చర్యలు మొదలుపెట్టామని తమకు ఫోన్ చేసిన పోలీసు అధికారులకు ఆయన వెల్లడించారు. వారం రోజుల క్రితమే ఈ ప్రక్రియ ప్రారంభమైందని, సంబంధిత ప్రకటనదారుల వివరాలను రాబడుతున్నారని, అనుమానాస్పదంగా ఉన్న వాటిని తొలగిస్తున్నారని సంస్థ తెలిపింది. అసలు ఏమి జరిగిందంటే... సెకండ్ హ్యాండ్ వస్తువుల అమ్మకాలు, కొనుగోళ్లకు ఓఎల్ఎక్స్ సంస్థ ప్రాచుర్యం పొందింది. ఓఎల్ఎక్స్ వెబ్‌సైట్‌లో ప్రకటనలు జారీ చేయడం ద్వారా కోట్లు కొల్లగొట్టవచ్చునని గుర్తించిన రాజస్థాన్ రాష్ట్రంలోని భరత్‌పూర్‌కు చెందిన కున్వర్ అనే యువకుడు తన స్నేహితులు మహవీర్, నవీన్‌లతో ముఠాగా ఏర్పడ్డాడు. వీరు సైన్యంలో విధులు నిర్వహిస్తున్న కిషన్, తోమర్ అనే సైనికుల ఫోటోలు వినియోగించుకుని ఈ ఏడాది మార్చి నుంచి మోసాలకు తెర లేపారు. తొలుత ఐ-ఫోన్, శ్యామ్‌సంగ్ ఫోన్లు విక్రయించారు. అనంతరం ప్రముఖ కంపెనీల ల్యాప్‌టాప్‌లు, రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్‌లు, వివిధ కంపెనీల కార్లు విక్రయించనున్నట్లు ప్రకటనలు జారీ చేశారు. ఆసక్తి ఉన్న వారు ముందుగా సగం డబ్బు పంపిస్తే వస్తువులు పంపిస్తామని నమ్మబలికి ఒక్కొక్కరి నుంచి రూ. 50 వేల నుంచి రూ. లక్ష వరకు వసూలు చేశారు. ఆ తరువాత ఫోన్‌లు స్విచ్ఛాఫ్ చేశారు. భరత్‌పూర్‌లో వీరి వలెనే మరికొందరు తయారు కావడంతో ఆరు నెలల్లో 50 ముఠాలు పుట్టుకొచ్చాయి. తెలుగు రాష్ట్రాల్లోనే ఐదు వేల కేసులు నమోదయ్యాయి. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనరేట్ల పరిధిలోనే 900 కేసులు ఉన్నాయి. ఈ ఆరు నెలల్లో వీరు దాదాపు రూ. 25 కోట్లు కొల్లగొట్టినట్లు పోలీసులు అంచనాకు వచ్చారు.

దీనితో భరత్‌పూర్‌లో వీరిని పట్టుకునేందుకు వెళ్లగా కున్వర్, మహవీర్ దొరికారు. తీగ దొరకడంతో సైబర్ పోలీసులు డొంక కదిలిస్తున్నారు. కాగా, ఓఎల్ఎక్స్‌లో మోసపూరిత సమాచారం కనిపిస్తే తమకు సమాచారం ఇవ్వాలని హైదరాబాద్ సైబర్ క్రైమ్స్ అదనపు డీసీపీ కె.సి.ఎన్. రఘువీర్ కోరారు.

మాల్యాను ఆర్థిక నేరస్థుడుగా ప్రకటించిన కోర్టు



- గతంలో ఈడీ పిటిషన్ దాఖలు
- తాజాగా విచారణ జరిపిన పీఎంఎల్ఏ ప్రత్యేక కోర్టు
- మాల్యాను పారిపోయిన ఆర్థిక నేరస్థుడిగా ప్రకటన

ముంబయి : భారత్‌లో బ్యాంకుల వద్ద తీసుకున్న రుణాలు ఎగవేసి లండన్‌లో తలదాచుకుంటున్న ప్రముఖ వ్యాపారవేత్త విజయ్ మాల్యాను పారిపోయిన ఆర్థిక నేరస్థుడుగా ప్రకటించారు. ఈ మేరకు ముంబయిలోని పీఎంఎల్ఏ ప్రత్యేక న్యాయస్థానం తీర్పు వెలువరించింది. ఎలాయనంలో ఉన్న ఆర్థిక నేరగాళ్ల చట్టం 2018 ప్రకారం మాల్యాకు పారిపోయిన ఆర్థిక నేరస్థుడు అనే ట్యాగ్ ఇవ్వాలని కోరుతూ పీఎంఎల్ ఏ న్యాయస్థానంలో ఈడీ గతంలో ఓ పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై శనివారం విచారణ జరిపిన కోర్టు మాల్యాకు ఈ ట్యాగ్‌ను ఇస్తూ ప్రకటించింది. కాగా, పారిపోయిన ఆర్థిక నేరస్థుడిగా మాల్యాను ప్రకటించాలన్న విచారణ ప్రక్రియపై స్టే విధించాలని సుప్రీం కోర్టులో మాల్యా గత నెలలో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారించిన న్యాయస్థానం అందుకు నిరాకరించింది. తాజాగా కోర్టు తీర్పుతో మాల్యాకు సంబంధించిన ఆస్తులన్నీ ఇక ప్రభుత్వం జప్తు చేసుకోవచ్చు. ఈ చట్టం కింద న్యాయస్థానం ప్రకటించిన తొలి పారిపోయిన ఆర్థిక నేరగాడు మాల్యానే కావడం గమనార్హం.బ్యాంకులకు రుణాలు ఎగవేసిన మాల్యాను భారత్‌కు అప్పగించవలసిందిగా లండన్‌లోని వెస్ట్‌మినిస్టర్ న్యాయస్థానం గత నెల తీర్పు వెలువరించిన విషయం విదితమే. మాల్యాపై తప్పుడు కేసులు పెట్టినట్లు ఎలాంటి ఆధారాలూ కనిపించలేదని, అందువల్ల భారత్‌లోని కోర్టులకు మాల్యా సమాధానం చెప్పాలని లండన్ వెస్ట్‌మినిస్టర్ కోర్టు చీఫ్ మేజిస్ట్రేట్ జడ్జి ఎమ్మా ఆర్బత్‌నాట్ వ్యాఖ్యానించారు. మాల్యా కోసం ముంబయిలోని ఆర్థర్ రోడ్ జైలును సిద్ధం చేశారు. బ్రిటన్ నుంచి తీసుకువచ్చిన అనంతరం మాల్యాను ఇక్కడే ఉంచనున్నారు. ఇది ఇలా ఉంటే భారతీయ బ్యాంకులకు రుణాలను చెల్లిస్తానని మాల్యా ఇటీవల ప్రకటించారు. ఈ డబ్బును తీసుకోవాలని బ్యాంకులను, ప్రభుత్వాన్ని మాల్యా కోరారు.

భద్రతపరమైన కారణాలతోనే భారత్‌కు తిరిగి రాలేకపోతున్నాను: నీరవ్ మోడీ



న్యూఢిల్లీ : పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్బీ) కుంభకోణంలో నిందితుడు, విదేశాలకు పారిపోయిన ప్రముఖ వ్యాపారవేత్త నీరవ్ మోడీకి ఆర్థిక నేరగాడి ట్యాగ్ ఇవ్వాలని కోరుతూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) పీఎంఎల్ఏ కోర్టులో వేసిన పిటిషన్‌పై శనివారం విచారణ చేపట్టారు. తనకు ఆర్థిక నేరగాడి ట్యాగ్ ఇవ్వాలన్న విషయమై నీరవ్ మోడీ స్పందిస్తూ, తాను ఏ తప్పూ చేయలేదని, పీఎన్బీ కుంభకోణం ఓ సివిల్ ట్రాన్సాక్షన్ అని, అది ఓ తప్పుల తడక అని అభివర్ణించారు. భద్రతపరమైన కారణాలతోనే తాను తిరిగి భారత్‌కు రాలేకపోతున్నానని నీరవ్ స్పష్టం చేశారు. కాగా, ఆర్థిక నేరస్థుడు నీరవ్‌పై ఇప్పటికే రెడ్ కార్నర్ నోటీసులు జారీ అయ్యాయి. ఈ కుంభకోణంలో నిందితులైన నీరవ్ సహా మెహుల్ ఛోక్సీని భారత్‌కు రప్పించేందుకు అధికారులు యత్నిస్తున్నారు. నీరవ్ బ్రిటన్‌లోనే తలదాచుకుంటున్నట్లు ఆ దేశ వర్గాలు ఇటీవల భారత్ ప్రభుత్వ అధికారులకు తెలియజేశాయి. ఈ కేసుకు సంబంధించిన ఈడీ అధికారులు ఛోక్సీ గీతాంజలి గ్రూప్‌కు చెందిన ఓ ఫ్యాక్టరీని జప్తు చేశారు. రూ. 13 కోట్లకు పైగా విలువ చేసే ఈ కర్మాగారం థాయిలాండ్‌లో ఉంది. ఈ కేసులో ఇప్పటి వరకూ రూ. 4,765 కోట్లు విలువ చేసే ఆస్తులను ఈడీ జప్తు చేసింది.

8, 9 తేదీల్లో బ్యాంకు ఉద్యోగుల సమ్మె

- ఉద్యోగ విధానాలపై కేంద్రం తీరుపై నిరసన
- సమ్మెకు పిలుపు ఇచ్చిన పది ట్రేడ్ యూనియన్లు
- భారత బ్యాంకుల సంఘానికి చేరిన సమాచారం



న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగ బ్యాంకు ఉద్యోగులు మరోసారి దేశ వ్యాప్తంగా సమ్మె చేపట్టనున్నారు. ఈ నెల 8, 9 తేదీల్లో దేశవ్యాప్త సమ్మెకు అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సంఘం (ఏఐబీఈఏ), భారత బ్యాంకు ఉద్యోగుల సమాఖ్య (బీఈఎఫ్ఐ) పిలుపు ఇచ్చాయి. ఉద్యోగ విధానాలపై కేంద్ర ప్రభుత్వం తీరును నిరసిస్తూ 10 ట్రేడ్ యూనియన్లు ఈ సమ్మెకు పిలుపు ఇచ్చాయి. ఈ విష యాన్ని బ్యాంకు సంఘాలు వెల్లడించాయి. దేశ వ్యాప్తంగా తలపెట్టనున్న సమ్మె సమాచారాన్ని భారత బ్యాంకుల సంఘానికి (ఐబీఏ) అందజేసినట్లు సమా చారం. '2019 జనవరి 8, 9 తేదీల్లో దేశవ్యాప్త సమ్మెకు అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సంఘం (ఏఐబీఈఏ), భారత బ్యాంకు ఉద్యోగుల సమాఖ్య (బీఈఎఫ్ఐ) పిలుపు ఇచ్చాయి. ఈ సమాచారాన్ని సదరు యూనియన్లు భారత బ్యాంకుల సంఘానికి (ఐబీఏ)కు అందించాయి' అని బీఎస్ఈ ఫైలింగ్ సందర్భంగా ఐడీబీఐ బ్యాంక్ తెలియజేసింది. బ్యాంక్ ఆఫ్ బరోడా కూడా ఇదే విషయాన్ని వెల్లడించింది. గత ఏడాది డిసెంబర్‌లోనూ బ్యాంకు ఉద్యోగులు సమ్మె చేసిన విషయం తెలిసిందే. వేతన సవరణ, పెన్షన్‌తో పాటు ఇతర సమస్యల పరిష్కారానికై అఖిల భారత బ్యాంక్ అధికారుల సంఘం (ఏఐబీఓసీ) ఇచ్చిన పిలుపు మేరకు డిసెంబర్ 21న బ్యాంకుల అధికారులు విధులను బహిష్కరించి సమ్మెలో పాల్గొన్నారు. ఆ తరువాత బ్యాంక్ ఆఫ్ బరోడాలో విజయా బ్యాంక్, దేనా బ్యాంక్‌ల విలీనానికి వ్యతిరేకంగా బ్యాంకు ఉద్యోగులు, అధికారులు, సిబ్బంది డిసెంబర్ 26న సమ్మె జరిపిన విషయం విదితమే.

వివో స్మార్ట్ ఫోన్లపై భారీ తగ్గింపు



న్యూఢిల్లీ : తమ కస్టమర్లకు చైనాకు చెందిన ప్రముఖ మొబైల్ తయారీ సంస్థ వివో శుభవార్త అందించింది. వివో నెక్స్ స్మార్ట్ ఫోన్లపై భారీగా ధరలను తగ్గిస్తున్నట్లు కంపెనీ తెలియజేసింది. రూ. 5 వేల వరకు తగ్గించి ప్రస్తుతం వివో నెక్స్ స్మార్ట్ ఫోన్‌ను రూ. 39,990 విక్రయిస్తున్నట్లు కంపెనీ ప్రకటించింది. ఇండియా మార్కెట్‌లో గత జూలై నెలలో వివో నెక్స్ స్మార్ట్ ఫోన్‌ను విడుదల చేసినప్పుడు రూ. 44,990 లభించేది. పరిమిత కాలంలోనే ఈ ఆఫర్ అందుబాటులో ఉంటుందని సంస్థ తెలిపింది. ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ ద్వారా వివో నెక్స్ స్మార్ట్ ఫోన్‌ను కొనుగోలు చేయవచ్చని సంస్థ సూచించింది. వివో కార్నివాల్ సేల్, అమెజాన్ ద్వారా కొనుగోలు చేసే కస్టమర్లకు 12 నెలల వరకు ఈఎంఐ చార్జీలు ఉండవని, ఫోన్ల ఎక్స్‌చేంజ్ ఆఫర్ రూ. 21 వేల వరకు ఉంటుందని కంపెనీ తెలిపింది. ఎస్‌బీఐ క్రెడిట్ కార్డుతో ఈఎంఐ చెల్లిస్తే 5 శాతం క్యాష్‌బాక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ క్రెడిట్ కార్డు ద్వారా ఈఎంఐ చెల్లింపులు చేస్తే 5 శాతం క్యాష్‌బాక్ లభించనున్నాయి.


3 నెలల్లో విమానాల్లో మొబైల్ సేవలు
కమిటీ ఏర్పాటు చేసిన కేంద్రం



న్యూఢిల్లీ : విమానాల్లో మొబైల్ సేవలను అందుబాటులోకి తీసుకు వచ్చేందుకు కేంద్రం సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో కార్యాచరణ కోసం మంత్రిత్వ కమిటీని నియ మించాలని మోడీ ప్రభుత్వం నిర్ణయిం చింది. రాబోయే 3 నెలల్లో విమానా లు, నౌకల్లో ఐఎఫ్ఎమ్‌సీ సౌకర్యా న్ని అందుబాటులోకి తీసుకువచ్చేం దుకు గైకొనవలసిన చర్యలను ఈ కమిటీ సూచిస్తుంది.

ఈ విషయమై కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారి ఒకరు మాట్లాడుతూ, ఈ ప్రక్రియను వేగవంతం చేయడానికి 15 రోజులకు ఓసారి కమిటీ సమావేశం అవుతుందని తెలిపారు. ఈ సేవలను అందించే విషయమై విమానయాన సంస్థలు, షిప్పింగ్ కంపెనీలు, టెలికమ్ ఆపరేటర్లు, ప్రభుత్వ శాఖలతో భేటీ అయ్యాయని ఆయన వెల్లడించారు. టెలికమ్ శాఖ అదనపు కార్యదర్శి అన్షు ప్రకాశ్ అధ్యక్షతన రెండు గంటల పాటు సమావేశం సాగిందని ఆయన తెలియజేశారు. భారత భూభాగంలో ఈ సేవలు అందించడానికి ప్రభుత్వం నిబంధనలను నోటిఫై చేసిందని ఆ అధికారి తెలిపారు.

మూగబోనున్న ఆకాశవాణి జాతీయ చానల్



- నిర్వహణ వ్యయం తగ్గింపులో భాగంగా మూసివేత
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రసార భారతి
- ఐదు నగరాల్లో శిక్షణ కేంద్రాలు సైతం క్లోజ్

న్యూఢిల్లీ : ప్రసారాల హేతుబద్ధీకరణ, నిర్వహణ వ్యయం తగ్గింపులో భాగంగా ప్రభుత్వ రంగ ఆలిండియా రేడియో (ఏఐఆర్) జాతీయ చానల్‌ను మూసివేయాలని ప్రసార భారతి నిర్ణయించింది. ఉన్నతాధికారులతో పలు మార్లు చర్చలు, సంప్రదింపులు జరిపిన అనంతరం ప్రసార భారతి ఈ నిర్ణయం తీసుకున్నది. ఈ నిర్ణయాన్ని గత నెల 24న ఎఐఆర్ డైరెక్టరేట్‌కు తెలియజేసింది. దీనితో ఆల్ ఇండియా రేడియో డైరెక్టర్ జనరల్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. వీటిని వెంటనే అమలు చేయాలని ఆలిండియా రేడియోను ఆదేశించారు. అదే విధంగా అకాడమీస్ ఆఫ్ బ్రాడ్‌కాస్టింగ్ అండ్ మల్టీ మీడియాను కూడా మూసివేయాలని ప్రసార భారతి నిర్ణయించింది. ఇదే కోవలో అహ్మదాబాద్, హైదరాబాద్, లక్నో, షిల్లాంగ్, తిరువనంతపురం నగరాల్లోని ప్రాంతీయ శిక్షణ అకాడమీలను సంస్థ రద్దు చేయనున్నది. ఇది తక్షణమే అమలులోకి రానుంది. తోడాపూర్, నాగపూర్ సహా ఇతర నగరాల్లోని సిబ్బందిని సంస్థ వేరే ప్రాంతాల్లోని ఆఫీసుల్లో సర్దుబాటు చేయనున్నది. ఈ విషయమై ఏఐఆర్ ఉన్నతాధికారి ఒకరు మాట్లాడుతూ, జాతీయ చానల్‌కు సంబంధించిన ట్రాన్స్‌మీటర్లు బలహీనంగా ఉండడం వల్లే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. చానల్‌కు అందుబాటులో ఉన్న ట్రాన్స్‌మీటర్లలో నాగపూర్‌లోని ట్రాన్స్‌మీటర్ మాత్రమే ఒక్క మెగావాట్ సామర్థ్యాన్ని కలిగి ఉందనీ, ప్రస్తుత డిజిటల్ రేడియో యుగంలో ఇది సరిపోదని ఆయన వ్యాఖ్యానించారు. ప్రస్తుతం కొన్ని ఏఐఆర్ కార్యక్రమాలను అవుట్‌సోర్స్ ద్వారా నిర్వహిస్తున్నామని, ముఖ్యంగా ఏఐఆర్ వెబ్‌సైట్‌ను ప్రైవేట్ వ్యక్తుల ద్వారా నిర్వహిస్తున్నామని ఆయన వెల్లడించారు. 1987లో ప్రారంభమైన ఎయిర్ ఇండియా జాతీయ చానల్ రోజూ ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిరంతరాయంగా పని చేసింది.



జోలో నుండి రూ. 4,444 ధరకే కొత్త స్మార్ట్ ఫోన్

న్యూఢిల్లీ : ప్రముఖ మొబైల్ సంస్థ జోలో తాజాగా రూ. 4,444 ధరకే కొత్త స్మార్ట్ ఫోన్‌ను భారత మార్కెట్‌లో విడుదల చేసింది. 'జోలో ఎరా 4ఎక్స్' పేరిట విడుదలైన ఈ ఫోన్ అమెజాన్ వెబ్ సైట్లో ఈ నెల 9 నుండి ప్రత్యేకంగా విక్రయించనున్నారు. 5.45 అంగుళాల డిస్‌ప్లే, ఆండ్రాయిడ్ ఓరియో 8.1 ఆపరేటింగ్ సిస్టమ్‌పై నడిచే ఈ ఫోన్ ముందు, వెనుక భాగాలలో ఉన్న కెమెరాలకు ఫ్లాష్ సదుపాయాన్ని కల్పించారు.

జోలో ఎరా 4ఎక్స్ ఫీచర్లు :
5.45 అంగుళాల హెచ్‌డీ ప్లస్ డిస్‌ప్లే
ఆండ్రాయిడ్ 8.1 ఓరియో ఆపరేటింగ్ సిస్టం 8 మెగాపిక్సల్ బ్యాక్ కెమెరా
5 మెగాపిక్సల్ సెల్ఫీ కెమెరా
ఫేస్ అన్‌లాక్, 3000 ఎంఏహెచ్ బ్యాటరీ.



కదం తొక్కుతున్న బీసీలు నేడు ఇందిరా పార్క్ వద్ద ధర్నా

హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి: గ్రామపంచాయితీ ఎన్నికలలో బి.సి రిజర్వేషన్లను 34 శాతంకు పునరుద్దరించాలని బీసీలు కదం తొక్కుతున్నారు. పంచాయితీ ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లు తగ్గించడంపై ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలకు పిలుపునిచ్చిన జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఈనెల6 న హైదరాబాద్ లోని ఇందిరా పార్క్ ఉదయం 11.00 గంటల నుంచి భారీ ధర్నా నిర్వహిస్తున్నట్లు జాతీయ బి.సి సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య తెలిపారు. ఇందుకుగాను శనివారంనాడు ఆయన ధర్నా గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ధర్నా కార్యక్రమానికి బి.సి లందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్దేశ్య పూర్వకంగా బి.సి రిజర్వేషన్లను తగ్గించి దన్నారు. నిజంగా ప్రభుత్వానికి చిత్త శుద్ధి ఉంటె 34 శాతం రిజర్వేషన్లు అమలు చేసే అవకాశం ఉండేదన్నారు. సుప్రీంకోర్టు తీర్పు కొత్తగా వచ్చింది కాదని ఇది 2010లోనే ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. సుప్రీం కోర్టు తీర్పు వచ్చిన తర్వాత 2013 లో గ్రామ పంచాయితీ ఎన్నికలు 2014 ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికలు బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేశారన్నారు. అప్పటి ప్రభుత్వం సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం బిసి రిజర్వేషన్లను 34 శాతం నుంచి 22 శాతం కు తగ్గించడానికి జీవో జారీ చేసింది, వెంటనే బీసీ సంఘాలు ఉద్యమాలు చేయగా అప్పటి ముఖ్యమంత్రి బీసీ సంఘాలతో చర్చలు జరిపి సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేసి, ప్రముఖులైన న్యాయవాదులను పెట్టి స్టే తీసుకువచ్చి 34 శాతం రిజర్వేషన్లతో ఎన్నికలు జరిపారు. ఈ ప్రభుత్వానికి చిత్త శుద్ధి ఉంటే ఇప్పుడు కూడా అదే పద్దతిలో ఎందుకు జరుపకూడదు? అని ప్రశ్నించారు.



ఎన్నికల్లో 60 శాతం కొత్త వారికి అవకాశం

• చిరంజీవి ప్రజారాజ్యం పార్టీ పెట్టాలని ప్రేరణ • పార్టీ ఆవిర్భావానికి కీలక పాత్ర పోషించిన వ్యక్తుల్లో నేనూ ఒకడినని • ఓపిక లేని నాయకులు పీఆర్పీలో చేరడం వల్ల ఆ అవకాశం చేజారిపోయింది • అలా వచ్చినోళ్లే అన్నయ్యను బలహీనపరచారు • తనతో కలిసిరావాలని ఇటీవల పవన్‌ను కోరిన చంద్రబాబు • అమరావతిలో ప్రకాశం పార్టీ నేతలతో భేటీ • జనసేన అధినేత పవన్ కల్యాణ్

అమరావతి,సూర్యబ్యూరో: రాజకీయాల్లో రాత్రికి రాత్రే ఎవరూ ఎదగలేరని, పాతికేళ్లు ఓపిక పట్టాలని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. అన్నయ్య చిరంజీవి ప్రజారాజ్యం పార్టీ పెట్టాలని ప్రేరణ కలిగించిన వారిలో, ఆ పార్టీ ఆవిర్భావానికి కీలక పాత్ర పోషించిన వ్యక్తుల్లో తానూ ఒకడినని చెప్పారు. శనివారం విజయవాడలోని జనసేన పార్టీ కార్యాలయంలో ప్రకాశం జిల్లా నేతలతో ఏర్పాటు చేసిన సమావేశంలో పవన్ ఈవ్యాఖ్యలు చేశారు. ప్రజారాజ్యం పార్టీ ఉండి ఉంటే సామాజిక న్యాయం జరిగేదని, ఓపిక లేని నాయకులు పీఆర్పీలో చేరడం వల్ల ఆ అవకాశం చేజారిపోయిందన్నారు. ఆ రోజు ప్రజారాజ్యంలోకి వచ్చినవారంతా పదవీ వ్యామోహంతో చిరంజీవి లాంటి బలమైన వ్యక్తిని బలహీనుడిగా మార్చేశారని, అందువల్లే తాను జనసేన పార్టీ నిర్మాణంలో ఆచితూచి ముందుకెళ్తున్నట్టు చెప్పారు. సినిమాల్లోకి రాక ముందు నుంచే తాను సమాజాన్ని క్షుణంగా అర్థం చేసుకోవడం ప్రారంభించానని పవన్ తెలిపారు. యూనివర్సిటీల నుంచి పట్టాలు తీసుకోక్పోయినా, రాజకీయ శాస్త్రం, ప్రభుత్వ విధానాలు, దేశంలో కులాలు– వాటి ప్రభావం, అంబేద్కరిజం వంటి వాటిని సంపూర్ణంగా అర్థం చేసుకున్నానని వివరించారు. జనసేన పార్టీ పెట్టినపుడుడు పెద్ద నాయుకులు ఎవరు లేరన్నారు. వారే జనసేనకు వెన్నెముక్గా పవన్ అభివర్ణించారు. దీర్ఘకాలిక ప్రయోజనం కోసం ఆచితూచి అడుగులు వేయాల్సిన అవసరం ఉందన్నారు. రాజకీయాలు సంపూర్ణంగా వ్యాపారం అయిపోయాయని పవన్ ఆవేదన వ్యక్తం చేశారు. పింఛన్లు, రేషన్ కార్డులు తదితర ప్రజా సమస్యలను పరిష్కరించే ఓపిక కూడా నేతల్లో కనిపించటం లేదన్నారు. ప్రస్తుతం ఎన్నికల్లో పోటీ చేయాలంటే రూ. 2 వేల కోట్లు అవసరమని చాలామంది తనతో అంటున్నారని, ఇప్పుడున్న రాజకీయాలు అందుకు సన్నద్ధంగా ఉన్నాయని చెబుతున్నారని పవన్ నేతలతో అన్నారు. అలాంటి పార్టీలో మీరెలా పోటీ పడగలరని తనను ప్రశ్నిస్తున్నారని చెప్పారు. అందుకే, రాజకీయాలకు డబ్బు అవసరం లేదని రుజువు చేసిన కాన్షీరాంను స్ఫూర్తిగా తీసుకుని ముందుకెళ్తానన్నారు. తనకు సినిమాల్లో ఎప్పుడూ సంపూర్ణంగా సంతృప్తి ఇవ్వలేదన్న పవన్.. ప్రజా సమస్యలు పరిష్కరించిన్పుడే సంపూర్ణ ఆనందం కలిగిందన్నారు. వచ్చే ఎన్నిక్లో 60 శాతం మంది కొత్త వ్యక్తుల్ని నిలుపుతానని, ముఖ్యంగా ప్రకాశం జిల్లాలో దీన్ని తప్పకుండా అమలు చేస్తానని



స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ కు ప్రత్యేకహోదా, విభజన హామీల అమలు కోసం జనసేన మొదటి నుంచి పోరాడుతూనే ఉందని ఆ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ తెలిపారు. కేంద్రం వ్యవహారశైలిని జనసేన ప్రశ్నిస్తూనే ఉందని అన్నారు. పవన్ కల్యాణ్ తనతో కలిసి రావాలని ఏపీ సీఎం చంద్రబాబు ఇటీవల చేసిన వ్యాఖ్యలపై కూడా ఆయన స్పందించారు. తనతో కలిసి రావాలని చంద్రబాబు కోరడంపై పవన్ సంచలన ఆరోపణలు చేశారు. ఇదంతా చంద్రబాబు నాయుడు పడుతున్న ట్రాప్ అని పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. జనసేన నేతలు, కార్యకర్తలను గందరగోళంలో పడేయడానికి చంద్రబాబు వేసిన వ్యూహాల్లో ఇది ఒకటి అని అన్నారు.

బీజేపీతో చంద్రబాబు లాలూచి




హైదరాబాద్, మేజర్‌న్యూస్ః ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు రాజ్యాంగాన్ని తుంగలో తొక్కడానికి నాలుగేళ్లలో ఎన్నిచేయాలో అన్ని చేశారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే ఆర్కే రోజా అన్నారు. హైకోర్టు ఇచ్చిన ఆర్డర్‌ను కూడా గౌరవించను అంటున్నారంటే చంద్రబాబును ఏమనాలని ప్రశ్నించారు. దొంగల్ని, ఆర్థిక నేరగాళ్లను కాపాడే అడ్డాగా ఆంధ్రప్రదేశ్‌ను చంద్రబాబు మార్చేశారని నిప్పులు చెరిగారు. 100 శాతం వైఎస్ జగన్‌పై హత్యాయత్నం చంద్రబాబే చేయించారనడానికి, ఆయన మాటలే నిదర్శనమన్నారు. ఇదంతా ఆపరేషన్ గరుడ అని సినిమాలు లేని శివాజీ అనే నటుడితో చెప్పించారని ఆరోపించారు. ఈ కేసులో ఇప్పటి వరకు అతన్ని ఎందుకు విచారించలేదని మండిపడ్డారు. వైసీపీ కేంద్ర కార్యాలయంలో రోజా మాట్లాడుతూ 'చంద్రబాబు హిట్లర్‌లా, నియంతలా వ్యవహరిస్తున్నారు. చంద్రబాబును ఎవరూ ప్రశ్నించకూడదు. మహిళను కాకినాడలో పట్టుకుని ఫినిష్ చేస్తానని గూండాలా బెదిరించారు. అసెంబ్లీలో కూడా చాలాసార్లు ప్రతిపక్షాన్ని లేకుండా చేస్తానని బెదిరించారు. కేంద్ర పరిధిలో ఉన్న ఎయిర్ పోర్టులో వైసీపీ అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని హత్య చేస్తే నేరం కేంద్రంపైకి పోతుందని చంద్రబాబు ప్లాన్ చేశారు. ఎన్ఐఏ విచారణకి నిందితుడు శ్రీనివాస్‌కు లేని బాధ చంద్రబాబు, లోకేష్‌కు ఎందుకు, మీకు బాధ లేనపుడు ఆ కేసును ఎన్ఐఏకి అప్పగించాలి. రెస్టారెంట్ ఓనర్ హర్షవర్ధన్ చౌదరి చంద్రబాబు బినామి. ఆ రెస్టారెంట్‌ను ప్రారంభించింది చంద్రబాబే. దాడికి ఉపయోగించిన కత్తి ఎంతో కాలంగా అక్కడ ఉంచారు. ఎన్ఐఏకి కేసు అప్పగించాలని ఆ అధికారులు కోరితే రాష్ట్ర పోలీసులు సహకరించడం లేదంట. హత్యాయత్నం వెనక ఉన్న వారు హర్షవర్ధన్ చౌదరిగాని, శివాజి చౌదరిగాని అందర్ని బయటకు లాగాలి. వైఎస్ జగన్, బీజేపీతో కలసి కుట్ర చేస్తున్నారంటారు.



ఏపీలో రెండు సీట్లతో టీడీపీ సంతోష పడబోతోంది

న్యూఢిల్లీ,సూర్యబ్యూరో: ఏపీ సీఎం చంద్రబాబు నాయుడుపై బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు మరోసారి విమర్శలు చేశారు. ఢిల్లీలోశనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, తెలంగాణలో ప్రజాకూటమి ఓటమి తర్వాత చంద్రబాబులో అసహనం పెరిగిపోయిందని అభిప్రాయపడ్డారు. తెలంగాణలో ఇటీవల జరిగిన ఎన్నికల్లో చంద్రబాబుని, ఆయన పార్టీని ప్రజలు ఛీ కొట్టారని, ఏపీలో కూడా అదే జరగబోతోందని, ఏపీలో వచ్చే ఎన్నికల్లో కూడా రెండు సీట్లతో టీడీపీ సంతోషపడబోతోందని సెటైర్లు విసిరారు. ఈ సందర్భంగా శుక్రవారం కాకినాడలో చంద్రబాబును బీజేపీ నాయకులు అడ్డుకున్న ఘటనపై వ్యాఖ్యానించారు. తమ పార్టీకి చెందిన మహిళా కార్యకర్తలపై చంద్రబాబు వ్యవహరించిన తీరు పూర్తిగా గర్హనీయమని అన్నారు. మహిళలు, ఇతర రాజకీయపార్టీల పట్ల చంద్రబాబుకు సహనం లేదని, వచ్చే ఎన్నికల్లో ఓటమి పాలవుతామన్న భయంతోనే ఆయన అసహనానికి గురవుతున్నారని వ్యాఖ్యానించారు. ఏపీలోని ప్రజలందరూ చంద్రబాబు వెంటే ఉన్నట్టగా ఆయన ఊహించుకోవడం తగదని, చిల్లర బిల్డప్స్ ఇవ్వొద్దని ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఉన్న చంద్రబాబుకు, మళ్లీ అదే భవిష్యత్ ఆయన రాబోతోందని జోస్యం చెప్పారు.

ఆర్నెలల్లో జిల్లాల టీఆర్ఎస్ కార్యాలయాల నిర్మాణం



హైదరాబాద్, మేజర్‌న్యూస్ః జిల్లా కార్యాలయాల ఆరు నెలల్లోనే అందుబాటులోకి రావాలని టీఆర్ఎస్ రాష్ట్ర కార్యనిర్వహక అధ్యక్షుడు కేటీఆర్, ఆ పార్టీ నేతలను ఆదేశించారు. త్వరగా స్థల సేకరణ చేసి కార్యాలయ నిర్మాణం చేపట్టాలని జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, పార్టీ నేతలకు సూచించారు. టీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా కేటీఆర్ ఎన్నికైన తర్వాత జిల్లా కార్యాలయాల నిర్మాణంపై ప్రత్యేక దృష్టిసారించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో కేటీఆర్ తొలిసారిగా పర్యటించడంతో, స్థానికంగా త్వరగా కార్యాలయం నిర్మాణం చేయాలనే ఆలోచనతో ఎమ్మెల్యేలు, టీఆర్ఎస్ నేతలు స్థల సేకరణపై దృషిపెట్టారు. జిల్లా కేంద్రంలో పార్టీ కార్యాలయం నిర్మాణం కోసం నాలుగు ప్రాంతాలను పరిశీలించారు. టీఆర్ఎస్ పార్టీ కార్యదర్శి, జిల్లా ఇన్‌చార్జి బాలమల్లుతో కలిసి జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాలను సందర్శించారు. హైదరాబాద్ రోడ్డులోని ప్రస్తుత వన నర్సరీ సమీపంలోని కుమ్మరికుంట, చంపక్‌హిల్స్‌లోని ఎంసీహెచ్ ఆస్పత్రి పక్కన, హన్మకొండ రోడ్డులోని దయ నిలయం సమీపంలోని ప్రభుత్వ స్థలం, సూర్యాపేట రోడ్డులోని ప్రస్తుత కలెక్టరేట్ నిర్మాణం జరుగుతున్న వెనుక ప్రాంతాన్ని పరిశీలించారు. పార్టీ కార్యాలయం నిర్మాణం కోసం 4750 గజాల స్థలం(ఎకరం) కావాల్సి ఉంది. అయితే చంపక్‌హిల్స్‌లో పార్టీ కార్యాలయం నిర్మిస్తే కేవలం జనగామ నియోజకవర్గానికి మాత్రమే అనువుగా ఉంటుందని, పాలకుర్తి, స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గాలకు దూరంగాఉంటుందనే పార్టీ నాయకులు పేర్కొంటున్నట్లు తెలుస్తోంది.

మొదటి పేజీ తరువాయి

రుణ మాఫీ పేరుతో రాజకీయాలు చేయలేం



ర్యాలీలో ప్రధాని మాట్లాడుతూ, రైతులను కాంగ్రెస్ కేవలం వోటు బ్యాంకుగానే చూస్తుందని, తమ పార్టీ మాత్రం ప్రజలకు తిండి పెట్టే అన్నదాతలుగా చూస్తుందని అన్నారు. కాంగ్రెస్‌కూ, భారతీయ జనతా పార్టీకి తేడా అదేనని ఆయన చెప్పారు. 'కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టులను పూర్తి చేసి ఉంటే రైతులు లబ్ది పొంది ఉండేవారు. రుణాలు తీసుకోవలసిన అవసరం వారికి ఉండేది కాదు. తొలుత రుణాలు తీసుకోవాలని రైతులను బలవంతం చేసి, ఇప్పుడు రుణ మాఫీ పేరుతో వారిని తప్పు దారి పట్టిస్తున్నారు' అని ప్రధాని అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం గత ఐదు సంవత్సరాలలో ప్రజలకు 1 కోటి 25 లక్షల ఇళ్లు ఇచ్చిందని ఆయన తెలియజేశారు.–లము జిల్లాలోని మండలం డ్యామ్ సహా ఆరు సాగునీటి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసిన మోడీ. ప్రధాన మంత్రి గృహ ఆవాస యోజన కింద ఐదుగురు లబ్ధిదారులకు ఇంటి తాళాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన మోడీ తాము ఇళ్ల నిర్మాణ పథకం పేరు మార్చడంపై కాంగ్రెస్ చేస్తున్న విమర్శలను తిప్పికొట్టారు. ప్రధాని పేరుతోనే తాము పథకం అమలు చేస్తున్నట్టు చెప్పారు. తదుపరి ప్రధాని ఈ పథకాన్ని ముందుకు తీసుకువెళ్లవచ్చని ఆయన సూచించారు. ప్రధాన మంత్రి సించాయ్ పరియోజన కింద 99 శాతం పనులు పూర్తి చేస్తున్నామని మోడీ తెలియజేశారు. తాను రాజకీయం చేయాలనుకుంటే లక్ష కోట్లు రుణ మాఫీ కింద రైతులకు ఇచ్చేసేవాడినని, కానీ, తాను రైతులను మోసం చేసే పాపానికి ఒడిగట్టనని ఆయన చెప్పారు. రుణ మాఫీ చేస్తే కేవలం ఒక ఏడాదే ఉపశమనం ఉంటుందని ఆయన అన్నారు. అదే లక్ష ఎకరాలకు నీరు వస్తే భవిష్యత్తులో ఎంతో మేలు చేకూరుతుందని ఆయన సూచించారు. అన్నదాతలు అప్పుల్లో కూరుకుపోకుండా తాము పని చేస్తున్నామని, వోటు బ్యాంకు రాజకీయాలు కాకుండా రైతుల సామర్థ్యాన్ని పెంచే విధానాలను అనుసరిస్తున్నట్టు ప్రధాని చెప్పారు. పొలాలకు నీరు అందిస్తే తరాలు బతుకుతాయని మోడీ అన్నారు. చౌకీదారే దొంగ అంటూ కొంత కాలంగా తనపై కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ చేస్తున్న విమర్శలను కూడా నరేంద్ర మోడీ తిప్పికొట్టారు. దొంగ ఎప్పుడూ కాపలాదారుని వెళ్లగొట్టాలనే చూస్తాడని మోడీ దుయ్యబట్టారు. ఒడిశాలోని బారిపడలో భారతీయ జనతా పార్టీఏర్పాటు చేసిన బహిరంగ సభలో మోడీ మాట్లాడుతూ, 'కాపలాదారు పోవాలని దొంగ ఎప్పుడూ కోరుకుంటాడు. సమాజంలో అవనివ్వండి, కర్మాగారంలో అవనివ్వండి, దొంగలు తమ పని సులువుగా చేసుకోవడం కోసం కాపలాదారును తొలగించాలని ఎప్పుడూ ప్రయత్నిస్తారు, కుట్ర చేస్తారు. కాపలాదారు ఉంటే, వారు తమ పని చేసుకోలేరు' అని అన్నారు. అగస్టా వెస్ట్‌లాండ్ వీవీఐపీ హెలికాప్టర్ల కుంభకోణం కేసును మోడీ ప్రస్తావిస్తూ, 2004, 2014 మధ్య కాలంలో (యూపీయే ప్రభుత్వ హయాంలో) మన దేశ సైన్యాన్ని బలహీనపరిచే కుట్ర జరిగిందని చెప్పారు. ప్రభుత్వాన్ని నడిపినది కాంగ్రెస్సా? లేదంటే మిషెల్ మామగారి దర్బారా? అన్నది అర్థం కావడం లేదని అన్నారు. చట్టం ఎవరినీ వదలిపెట్టదని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం ఈ పరిణామాలను దేశమంతా గమనిస్తోందని, అర్థం చేసుకుంటోందని మోడీ చెప్పారు. వలలో నుంచి బయటికి రావడానికి మన సైన్యానికి తన ప్రభుత్వం సహాయపడుతోందని ఆయన తెలిపారు. అగస్టా వెస్ట్‌లాండ్ హెలికాప్టర్ల ఒప్పందం మధ్యవర్తి క్రిస్టియన్ మిషెల్‌ను భారతదేశానికి తీసుకువచ్చి, విచారణ జరుపుతున్న సంగతి తెలిసిందే. మిషెల్‌కు కాంగ్రెస్ పార్టీలోని అత్యున్నత స్థాయి నేతలతోనూ, అప్పటి మంత్రులతోనూ సన్నిహిత సంబంధాలు ఉన్నాయని, బహుశా మధ్యవర్తికి ప్రధాని (మన్మోహన్ సింగ్)కి తెలిసినదాని కన్నా ఎక్కువ సమాచారం తెలిసినట్లు ఉందని మోడీ చెప్పారు. దేశ ప్రయోజనాలను పణంగా పెట్టి, మధ్యవర్తుల ప్రయోజనాలను కాపాడేందుకు ప్రయత్నిస్తున్న వ్యక్తుల పాత్రపై దర్యాప్తు సంస్థలు క్షుణ్ణంగా దర్యాప్తు జరుపుతాయని ఆయన స్పష్టం చేశారు. దేశ భద్రత కోసం తన ప్రభుత్వం ఎల్లప్పుడూ కఠిన నిర్ణయాలు తీసుకుంటుందని మోడీ చెప్పారు. ఈ సందర్భంగా రఫేల్ అంశంపై రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ శుక్రవారం లోక్‌సభలో చేసిన ప్రసంగాన్ని ప్రధాని మోడీ మరోసారి ప్రశంసించారు. దేశ ప్రజలను తెలివితక్కువవారిని చేసేందుకు ప్రయత్నిస్తున్న వారి గురించి నిర్మలా సీతారామన్ బయటపెట్టారు అని ఆయన అన్నారు. ఒడిశా పర్యటనలో భాగంగా మోడీ రూ. 4500 కోట్లు విలువ చేసే పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. మూడు భారీ హైవే ప్రాజెక్టులకు ఆయన శంకుస్థాపన చేశారు. బరిపడలోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు చెందిన బాలసోర్– హల్దియా–దుర్గాపూర్ ఎల్‌పీజీ పైప్‌లైన్‌ను మోడీ ప్రారంభించి జాతికి అంకితం ఇచ్చారు.

మొదటి పేజీ తరువాయి

పాదయాత్రలో తుదిఘట్టం



చెందిన మత్స్యకారులు జగన్మోహన్‌రెడ్డికి వివరించారు. కాసేపటికి పాదయాత్ర పాలవలస చేరుకోగా స్థానికులు ఘనస్వాగతం పలికారు. గ్రామంలో కిడ్నీ వ్యాదిగ్రస్తులు చాలా మంది ఉన్నారని వారికి తగిన వైద్య సదుపాయాలు అందడంలేదని వెల్లడించారు. ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని మామిడిపల్లితోపాటు పలాస నియోజకవర్గానికిచెందిన 500 మంది టీడీపీ నాయకులు వైఎస్సార్‌పార్టీలో సభ్యత్వం స్వీకరించారు. ఉపాధ్యాయ సంఘాల నేతలు యాత్రకు సంఘీబావం ప్రకటించారు. పార్టీ అధికారంచేపడితే కంట్రీబ్యూటరీ పెన్షన్ పథకం రద్దుచేస్తానని జననేత ప్రకటనపై హర్షం వ్యక్తంచేసారు. ఈ పాదయాత్రలో ఇచ్ఛాపురంకు చెందిన నాయకులు పెద్ద ఎత్తున పాదయాత్రలో జగన్మోహన్‌రెడ్డితో అడుగులువేసారు.

2 ప్రశ్నలు అడగండి



లేదా కాదు అని సమాధానం చెప్పాలని ప్రభుత్వాన్ని కోరారు.

1. అనిల్ అంబానీకి ఆఫ్‌సెట్ కాంట్రాక్ట్ ఎవరు ఇచ్చారు?
2. ప్రధాని నరేంద్ర మోడీ ఈ ఒప్పందానికి బైపాస్ సర్జరీ చేసినప్పుడు రక్షణ మంత్రిత్వశాఖ అధికారులు అభ్యంతరం లేవనెత్తారా?

ఈ ప్రశ్నలను మోడీని అడగాలని రాహుల్ గాంధీ కోరారు. రఫేల్ వివాదంపై లోక్‌సభలో శుక్రవారం వాడిగా వేడిగా చర్చ జరిగిన విషయం తెలిసిందే. రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలు వ్యహారంపై శుక్రవారం లోక్‌సభలో చర్చ జరిగింది. ఈ సందర్భంగా అధికార, ప్రతిపక్షాలు పరస్పరం విమర్శల దాడికి దిగాయి. రఫేల్ వ్యవహారానికి ప్రధాని మోదీదే బాధ్యత అని రాహుల్‌గాంధీ ఆరోపించారు. విపక్షాల విమర్శలకు రక్షణ మంత్రి నిర్మాలా సీతారామన్ దీటుగా స్పందించారు. దాదావు 2 గంటల సేపు అంశాల వారీగా వివరణ ఇచ్చారు. కుంభకోణం అనడానికి ఇదేమీ బోఫోర్స్ కాదని, దేశ ప్రయోజనాల దృష్ట్యా తీసుకున్న నిర్ణయమని ఆమె స్పష్టం చేశారు.

ఉపాధి నివేదికపై మోడీని మళ్లీ తప్పు పట్టిన రాహుల్ : ఇది ఇలా ఉండగా, గత సంవత్సరం 1.1 కోట్ల మంది భారతీయులు ఉద్యోగాలు కోల్పోయారంటూ వెలువడిన నివేదికను చూపుతూ కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ప్రధాని నరేంద్ర మోడీ మీద మాటల దాడికి దిగారు. ప్రతి సంవత్సరం రెండు కోట్ల మందికి ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చి, ఇప్పటికీ అదే పాట పాడుతున్నారని ఫేస్‌బుక్ వేదికగా శనివారం విమర్శలు చేశారు. సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ సమాచారం ఆధారంగా వెల్లడైన నివేదిక ప్రకారం..గత సంవత్సరం ఉపాధి కల్పన చాలా దారుణంగా ఉందని, దాదాపు 1.1 కోట్ల మంది భారతీయులు ఉద్యోగాలు కోల్పోయారని వివరించింది. 'బ్రేకింగ్! 2018లో కోటి 10 లక్షల మంది ఉద్యోగాలు ఊడిపోయాయి. ప్రధాని యువతకు ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికీ అదే పాట పాడుతున్నారు' అని రాహుల్ మండిపడ్డారు. అనిల్ అంబానీ కోసం కాకుండా మోడీజీ దేశం కోసం పని చేసి ఉంటే, యువత పరిస్థితి ఇలా ఉండేది కాదు అని ఆయన విరుచుకుపడ్డారు. కేంద్ర ప్రభుత్వం రఫేల్ ఒప్పందం విషయంలో అనిల్ అంబానీకి ప్రయోజనం చేకూర్చిందని కాంగ్రెస్ కొంత కాలంగా ఆరోపణలు చేస్తోంది. కేంద్రంతో పాటు, అనిల్ కూడా ఈ ఆరోపణలను ఖండిస్తూనే ఉన్నారు.

17న కొత్త సభ కొలువు

స్పీకర్‌ను ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు, ప్రతిపక్ష నాయకులు, ఇతర రాజకీయ శాసనసభా పక్ష నాయకులు స్పీకర్ స్థానానికి తోడ్కొని పోతారు. అనంతరం నూతనంగా ఎన్నికైన స్పీకర్ అధ్యక్షతన సభా కార్యక్రమాలు సాగుతాయి. ఆ తర్వాత స్పీకర్ బీఏసీ సమావేశాన్ని నిర్వహిస్తారు. 19వ తేదీన ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగం చేస్తారు. 20న గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానం ప్రవేశపెట్టడం, దానికి సభ ఆమోదం తెలపడం జరుగుతుంది.

ముహూర్తం పక్కా : పవిత్ర ఉత్తరాయణ పుణ్యకాలంలో, ఏకాదశి శుభ తిదినాడు, బుధవారం జనవరి 17, 2019 న ప్రారంభం కానున్న తొలి శాసనసభ సమావేశాలు. పూర్వరంగంలో, ఆ క్రితం రోజు, దశమి తిధి, జనవరి 16, 2019 న సాయంత్రం 5 గంటలకు ఎమ్మెల్యే ముంతాజ్ అహ్మద్ ఖాన్ రాజ భవన్ లో ప్రోటెం స్పీకర్ గాప్రమాణస్వీకారం చేసేందుకు ముహూర్తాన్ని ఖరారు చేశారు.

అసెంబ్లీ ప్రొటెం స్పీకర్‌గా మజ్లీస్ ఎమ్మెల్యే : తెలంగాణ శాసనసభ ప్రొటెం స్పీకర్‌గా మజ్లీస్ ఎమ్మెల్యే ముంతాజ్ అహ్మద్‌ఖాన్ నియమితులయ్యారు. శాసనసభ కార్యదర్శి, అధికారులతో సమావేశమైన సీఎం కేసీఆర్ అసెంబ్లీ సమావేశాల నిర్వహణపై చర్చించారు. అధికారులతో చర్చించి ప్రొటెం స్పీకర్ నియామకంపై నిర్ణయం తీసుకున్నారు. ముంతాజ్ అహ్మద్ ఖాన్ ఆరుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో చార్మినార్ నియోజకవర్గం నుంచి అహ్మద్‌ఖాన్ 32,586 ఓట్ల అధిక్యంతో గెలుపొందారు. 1994 నుంచి వరుసగా ఐదుసార్లు యాకుత్‌పురా నియోజకవర్గం నుంచి విజయం సాధించారు. పార్టీ ఆదేశాల మేరకు ఈ సారి చార్మినార్ నియోజకవర్గం నుంచి పోటీ చేశారు. పార్టీ మజ్లీస్ ఎమ్మెల్యేను ప్రొటెం స్పీకర్‌గా ఎంపిక చేయడం పట్ల ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ హర్షం వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్‌కు ఒవైసీ కృతజ్ఞతలు తెలిపారు.


కేంద్రం సవతితల్లి ప్రేమ

చేశారు. తెలంగాణపై కేంద్రం తీవ్ర వివక్షతో పాటు సవతి తల్లి ప్రేమ చూపుతోందని ఆయన మండిపడ్డారు.

మిషన్ భగీరథకు హడ్కో రెండు సార్లు అవార్డులిచ్చిందని, అలాగే స్కోచ్ కూడా అవార్డు ఇచ్చిందని తెలిపారు. గజ్వేల్ లో మిషన్ భగీరథను ప్రధాని మోదీ ప్రారంభించిన ప్రశంసలు కురిపించారని చెప్పారు. మిషన్‌భగీరథ అవార్డులు, రివార్డులు వస్తున్నా కేంద్రం నుంచి డబ్బులు రావడం లేదని మండిపడ్డారు. నీతి అయోగ్ రూ. 24 వేల కోట్లు సిఫారసు చేసినా దాన్ని తిరస్కరించినట్లు కేంద్ర జలవనరుల శాఖ సహాయ మంత్రి అర్జున్ మేఘవాల్ పార్లమెంట్ లో కుండబద్దలు కొట్టడం పట్ల కేటీఆర్ తీవ్ర అభ్యంతరాన్ని వ్యక్తం చేశారు. ఇది బీజేపీ నీచ రాజకీయానికి పరాకాష్ట అని పేర్కొన్నారు. తాము బలంగా లేని తెలంగాణకు ఎందుకు సాయం చేయాలన్నట్టుగా బీజేపీ వైఖరి ఉందంటూ నిప్పులు చెరిగారు. తెలంగాణ పట్ల బీజేపీది సవతి తల్లి ప్రేమంటూ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో బీజేపీ 103 స్థానాల్లో డిపాజిట్ కోల్పోయిందని, అందుకే తెలంగాణపై కేంద్రం సవతి తల్లి ప్రేమ ప్రదర్శిస్తోందన్నారు. ఇదే తీరుగా వ్యవహరిస్తే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ 17 సీట్లలో డిపాజిట్ కోల్పోవడం ఖాయమన్నారు. 2014లో బీజేపీ గెలిచిన సీటు కూడా ఈసారి దక్కదన్నారు. బీజేపీ వైఖరి పరిశీలిస్తే నోటితో పొగిడి నొసటితో వెక్కిరించినట్టు ఉందని విమర్శించారు. బీజేపీ పాలిత రాష్ట్రాలకు కేంద్రం సాయం చేస్తూ తెలంగాణను నిర్లక్ష్యం చేయడం ఏమిటని కేటీఆర్ ప్రశ్నించారు. మహారాష్ట్ర సాగునీటి పథకాలకు కేంద్రం ఇటీవలే రూ. 3883 కోట్లు సాయం చేసిన విషయాన్ని ఈసందర్భంగా కేటీఆర్ గుర్తు చేశారు. నరేంద్ర మోదీ బీజేపీ పాలిత రాష్ట్రాలకే ప్రధాని అన్నట్టుగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. ఏపీలో పోలవరానికి 95 శాతం నిధులిస్తున్న కేంద్రం కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా ఎందుకు ఇవ్వడం లేదంటూ నిలదీశారు. టీఆర్ఎస్ ఎంపీలు కేంద్రం వైఖరిని పార్లమెంట్ లో ఎండగడుతూ నిలదీస్తారని కేటీఆర్ చెప్పారు.

16 లోక్‌సభ స్థానాలను గెలుస్తాం : కేటీఆర్

ఏపీ రాజకీయాలపై టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఏపీలో రాజకీయాలు చేయాలంటే.. అక్కడికే వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. ఆ రాష్ట్ర సీఎం చంద్రబాబు రాకతోనే టీఆర్ఎస్ గెలిచిందనడాన్ని అపోహగా కొట్టిపడేశారు. బాబు రాకముందే ప్రజలు తమకు ఓటేయాలని డిసైడ్ అయ్యారని కేటీఆర్ తెలిపారు. ఈవీఎం ట్యాంపరింగ్ కంప్యూటర్లను కనిపెట్టిన చంద్రబాబుకే తెలియాలంటూ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. శనివారం తెలంగాణభవన్‌లో ఆయన మీడియాతో



ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లోనూ తమ ఓట్ల శాతం మరింతగా పెరుగుతుందని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. 16 పార్లమెంట్ స్థానాలు గెలుస్తామని తెలిపారు. మహబూబాబాద్, ఖమ్మం పరిధిలో అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్ల శాతం తగ్గినా, ఈసారి పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపు తమదేనన్నారు. కాంగ్రెస్ ఓటమి నుంచి తేరుకోలేదని, వారికి అభ్యర్థులే దొరకని పరిస్థితి నెలకొందన్నారు. మహాకూటమి ఇంకా ఉంటుందా? అని ప్రశ్నించిన ఆయన, టీడీపీ పార్లమెంట్ ఎన్నికల్లో పోటీచేస్తుందా? అంటూ అనుమానం వ్యక్తం చేశారు. కోదండరాంను ప్రజలు తిరస్కరించారని, రాజకీయాల్లో కొనసాగడంపై ఆయనే నిర్ణయించుకోవాలంటూ కేటీఆర్ వ్యాఖ్యానించారు.



కాళేశ్వరం ప్రాజెక్టు పనులు వేగంగా పూర్తి చేయాలి

ముఖ్యమంత్రి కార్యదర్శి స్మితా సబర్వాల్

సూర్యప్రధానప్రతినిధి-కరీంనగర్:వచ్చే ఖరీఫ్ సీజన్‌లో రైతులకు సాగు నీరు అందించేందుకు వీలుగా కాళేశ్వరం ప్రాజెక్టు పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి కార్యదర్శి స్మితా సబర్వాల్ అన్నారు. శనివారం రామడుగు మండలం లక్ష్మీపూర్‌లో కాళేశ్వరం ప్రాజెక్టు-8 పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా లక్ష్మీపూర్‌లో కాళేశ్వరం ప్రాజెక్టు పంపుహౌజ్ నిర్మాణ పనులు, అండర్ టర్నల్ పనుల ప్రగతిని ఇంజనీర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు రాష్ట్ర ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు కోటి ఎకరాలకు సాగు నీరును అందించే కార్యక్రమంలో భాగంగా నిర్మిస్తున్న కాళ్వేరం ప్రాజెక్టు పనులను ఇంజనీర్లు, ఏజెన్సిలు సమన్వయంతో పనులలో వేగం పెంచి, జూన్‌లోగాపూర్తి చేయాలని ఆదేశించారు. గత రెండు ప్రణాళికలు సిద్ధం చేసుకొని ప్రణాళిక బద్ధంగా పనులు జరిపించాలని అన్నారు. ప్రతి రోజు ఎంత పని జరిగింది సమీక్షించుకోవాలని సూచించారు. మూడు నెలలు చాలా కిష్టమైనవని ఎక్కువ లెబర్, అదనపు మిషన్‌లను ఏర్పాటు చేసుకొని 24 గంటలు పనులు నిర్వహించాలని సూచించారు. ప్రతి రోజు పరిష్కరిస్తామని సూచించారు. ప్రాజెక్టు పనులను హైద్రబాద్ నుండి సమీక్షిస్తామని, వారానికి ఒక రోజు ప్రత్యేక్షంగా పనుల ప్రగతిని తెలుసుకుంటామని అన్నారు. పనులు చేయుటలో సమస్యలు ఉంటే తెలుపాలని వెంటనే ఉన్న మీషనరి సరిపోతుందా లేదా సరి చూసుకోవాలని లేకుంటే వెంటనే అదనపు మిషనరీని తెప్పించుకోవాలని సూచించారు. ముందుగా కార్యదర్శి స్మితా సబర్వాల్ లక్ష్మీపూర్ నుండి ధర్మారం వరకు 15కి.లో మీటర్లకు పైగా అండర్ టర్నల్ సొరంగా పనులను ఇంజనీర్లు, ఏజెన్సిలతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి కార్యాలయం ఓఎస్‌డి దేశ్‌పాండే, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల కలెక్టర్లు సర్ఫరాజ్ ఆహ్మద్, దేవసేన, కాళేశ్వరం ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ వెంకటేశ్వర్లు, ఎస్‌సి సుధాకర్‌రెడ్డి, ఈఈ శ్రీధర్, కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ ఏజెన్సి మెగా కన్‌స్ట్రక్షన్స్ చైర్మేన్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గోన్నారు.

ఫిర్యాదుల సంఖ్య సగం తగ్గింది

- ప్రజల భాగస్వామ్యం రెట్టింపైంది
- ఉద్యోగుల నేస్తం మన ప్రభుత్వం
- సంక్రాంతి దినాల్లో జన్మభూమి పండుగలా జరపాలి
- చుక్కల భూమి సమస్యలు సత్వరమే పరిష్కరించాలి
- 4వ రోజు జన్మభూమిపై టెలికాన్ఫరెన్స్‌లో సీఎం

(అమరావతి సూర్య ప్రధాన ప్రతినిధి) :"ఈ జన్మభూమిలో ఫిర్యాదుల సంఖ్య సగం తగ్గింది. ప్రజల భాగస్వామ్యం రెట్టింపు అయ్యింది. వైద్య శిబిరాలకు, వెటర్నరీ క్యాంపులకు స్పందన బాగుంది. ఇది చాలా సానుకూల పరిణామం. నాలుగున్నరేళ్ల మన శ్రమ ఫలితం"గా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. శనివారం తన నివాసం నుంచి 4వ రోజు జన్మభూమి నిర్వహణపై టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. "ప్రతి గ్రామంలో, వార్డులో అభివద్ధి పనులు చేశాం. ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందుతున్నాయి. ఒకవైపు అభివద్ధి పనులు కళ్లముందే ఉన్నాయి. మరోవైపు అర్హులు అందరికీ సంక్షేమం ఇస్తున్నాం. ప్రజల్లో సంతప్తే ఫిర్యాదుల సంఖ్య తగ్గడానికి కారణం. జీవన ప్రమాణాలు పెంచేందుకే జన్మభూమి"గా ముఖ్యమంత్రి పేర్కొన్నారు. "రేషన్,పెన్షన్,ఇళ్ల కోసం వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి. అర్జీదారుల్లో అర్హులు అందరికీ న్యాయం చేయాలి" అని కోరారు.

ఉద్యోగుల నేస్తం మన ప్రభుత్వం...

"రాష్ట్ర ప్రగతికి రథాలు ప్రజలు,ఉద్యోగులే. ఇరువర్గాల సంక్షేమమే లక్ష్యంగా అనేకం చేశాం. ఉద్యోగుల నేస్తం మన రాష్ట్రప్రభుత్వం. సొంత ఇల్లులేని ప్రతి



ఉద్యోగికి గహ వసతి కల్పిస్తాం. ఉద్యోగుల సొంతఇల్లు కల నెరవేరుస్తాం. ప్రభుత్వ సేవల ద్వారా ప్రజా సేవచేసే ప్రతి ఉద్యోగికి సొంతఇల్లు ఉండాలి" అని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. "ముప్ఫై, నలభై ఏళ్లు హైదరాబాద్‌తో అనుబంధం వదులుకుని ఉద్యోగులు, లాయర్లు ఇక్కడికి వచ్చారు. వారు నిలదొక్కుకునేందుకు ప్రభుత్వం అండగా ఉంటుంది. ఉద్యోగుల ఇళ్ల నిర్మాణానికి భూములు గుర్తించాలి. అపార్ట్ మెంట్లు నిర్మించి ప్లాట్లు కేటాయించాలి" అని ఆదేశించారు.

సంక్రాంతి దినాల్లో జన్మభూమి పండుగలా జరపాలి...

"రైతుల పండుగ సంక్రాంతి. పంట దిగుబడులు ఇంటికొచ్చే పర్వదినం. సంక్రాంతి దినాల్లో జన్మభూమి పండుగలా జరపాలి. తీవ్ర ఆర్థికలోటులో కూడా రైతులకు రూ.24 వేల కోట్ల రుణమాఫీ చేశాం. ప్రతి రైతుకు రూ.లక్షా 50 వేల ప్రయోజనం కల్పించాం. రూ.4 వేల కోట్ల ఇన్ పుట్ సబ్సిడి ఇచ్చాం. మార్కెట్ ఇంటర్వెన్షన్ ద్వారా రూ.4 వేల కోట్ల విలువైన పంట ఉత్పత్తులు కొన్నాం. కౌలురైతులకు రూ.9,100 కోట్ల పంటరుణాలు ఇవ్వడం దేశంలోనే రికార్డు. క్రాప్ హాలిడేస్,పవర్ హాలిడేస్ లేకుండా చేశాం. గతంలో ఎరువులు అడిగితే లాఠీచార్జిలు,పోలీస్ స్టేషన్లలో విత్తనాల పంపిణీ జరిగేది. ఆ పరిస్థితులే లేకుండా చేశాం. రైతులను అన్నివిధాలా ఆదుకున్నాం. ఈ రోజు గ్రామసభలో రైతు సంక్షేమంపై చర్చ జరపాలి. పెట్టుబడి లేని వ్యవసాయంపై రైతుల్లో అవగాహన పెంచాలి" అని సూచించారు.

చుక్కల భూమి సమస్యలు సత్వరమే పరిష్కరించాలి...

"64 ఏళ్లుగా రైతులను సతమతం చేస్తున్న సమస్య. భూమిని బదిలీ చేసుకోలేక, అమ్ముకోలేక అనేక మంది రైతులు ఇబ్బందులు. ప్రభుత్వమే సుమోటాగా చుక్కల భూముల సమస్యలను 25వ తేదీలోగా పరిష్కరించాలి. ఫిర్యాదు దారులకు న్యాయం చేయాలి. రైతుల కళ్లల్లో ఆనందం చూడాలి" అని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

4వ రోజు జన్మభూమిలో అర్హులు అందరికీ సంక్షేమం అందుతోందా అని అడిగితే 78.20 శాతం బాగుందని చెప్పారని, గ్రామసభలో చర్చలు ఉపయోగకరంగా ఉన్నాయాఅంటే,72.46 శాతం అర్థంఅయినట్లు తెలిపారని అధికారులు వివరించారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్‌చంద్రపునేటా, వివిధ శాఖల అధికారులు అహ్మద్ బాబు, రామాంజనేయులు, ఆయా జిల్లాల కలెక్టర్లు, నోడల్ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

'నిరుద్యోగులను మోసగించవద్దు'



విజయవాడ, సూర్య బ్యూరో : ద కన్వెన్షన్ ఆఫ్ ది బాప్టిస్ట్ చర్చేస్ ఆఫ్ ది నార్థర్న్ సర్కార్స్ సంస్థకు చెందిన 7 జిల్లాల ఎడ్యుకేషన్ కన్వీనర్‌గా తనను కొనసాగిస్తూ జులై 2వ తేదీ 2018న స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆదిత్యానాథ్‌దాస్ ఉత్తర్వులు జారీచేశారని దాసరి.యాకోబు తెలిపారు. తాను 2022 వరకు కన్వీనర్‌గా కొనసాగుతానని చెప్పారు. సిబిసియన్‌సి 7జిల్లాల పరిధిలో 245 పాఠశాలలు, ఒక కళాశాల ఉందన్నారు. వాటి నిర్వహణ బాధ్యతలు తాను కన్వీనర్‌గా నిర్వహిస్తుంటానని తెలియజేసారు. అయితే కాకినాడకు చెందిన ముత్తాబత్తుల.రత్నకుమార్ అనే వ్యక్తి సిబిసియన్‌సి ప్రతినిధిని అని చెప్పుకుంటూ తమ పాఠశాలల్లో ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేయిస్తానని చెప్పి కొంతమంది నిరుద్యోగుల నుంచి కోట్లాదిరూపాయలు వసూలు చేసి మోసం చేశారన్నారు. రత్నకుమార్ మరోసారి నిరుద్యోగులను మోసం చేసేందుకు ఈనెల 5, 6, 7 తేదీల్లో సిబిసియన్‌సి జనరల్‌బాడీ సమావేశం నిర్వహించే ప్రయత్నంచేస్తున్నారన్నారు. నిరుద్యోగులను మోసాగిస్తే ఊరుకునే ప్రసక్తి లేదని ఆయన హెచ్చరించారు. సిబిసియన్‌సికి సంబంధించిన సంగస్థులు, దైవసేవకులు, చర్చ్ పెద్దలు ఈ సమావేశంలో పాల్గొనవద్దని ఆయన సూచించారు. రత్నకుమార్ మాయ మాటలు విని ఎవరు మోసపోవద్దని ఆయన కోరారు. సిబిసియన్‌సి ఆస్తుల్ని కాపాడే బాధ్యత తన పై ఉందన్నారు. ఈ సమావేశంలో సంస్థ సీనియర్ కరస్పాండెంట్ చ్రాగడ్డ.ప్రసాద్, దార్ల.అన్నాజీ, కాకర్ల.శివప్రసాద్, దాసరి.గ్లోరి తదితర ప్రతినిధులు పాల్గొన్నారు.

7న దేవాలయ కేశఖండన కార్మికుల ధర్నా



విజయవాడ, సూర్య బ్యూరో : రాష్ట్రంలోని వివిధ దేవాలయాల్లో కేశఖండన విధులు నిర్వహిస్తున్న కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని, కనీస వేతనాలను ఇవ్వాలని తదితర డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవదాయ ధర్మాదాయ ఆలయాల నాయీ బ్రాహ్మణ కేశఖండన కార్మిక సంఘాల సంయు క్త కార్యాచరణ కమిటీ (జె.ఎ.సి.) ఆధ్వర్యంలో 7వ తేదీ విజయవాడ ధర్నా చౌక్‌లో ధర్నా నిర్వహిస్తున్నట్టు జె.ఎ.సి. గౌరవాధ్యక్షులు అన్నవరపు బ్రహ్మయ్య, అధ్యక్షులు గుంటుపల్లి రామదాసు, రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షులు మల్కాపురం కనకారావు శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు

రాష్ట్రపతి వద్దకు అఖిల పక్షాన్ని తీసుకెళ్లండి

చలసాని శ్రీనివాస్

అమరావతి,సూర్యబ్యూరో: ఏపీకి ప్రత్యేక హోదా కోసం పోరాటం ఉధృతం చేయాలని చలసాని శ్రీనివాస్ అన్నారు. రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని వివరించేందుకు రాష్ట్రపతి వద్దకు అఖిలపక్షాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకెళ్లాలని కోరారు. వైసీపీ అధినేత జగన్, జనసేనాని పవన్ కల్యాణ్ లను తాము ఒప్పిస్తామని చెప్పారు. శనివారం కేంద్ర హోంమంత్రి రాజ్ నాథ్ సింగ్ తో చలసాని శ్రీనివాస్ తదితరులు సమావేశమయ్యారు.

అనంతరం మీడియాతో చలసాని మాట్లాడుతూ, ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని, విభజన హామీలను నెరవేర్చాలని, పోలవరం ప్రాజెక్టుకు నిధులను విడుదల చేయాలని రాజ్ నాథ్ ను కోరామని చెప్పారు. ప్రత్యేక హోదా విషయాన్ని ప్రధాని మోదీ దృష్టికి తీసుకెళతానని రాజ్ నాథ్ హామీ ఇచ్చారని తెలిపారు. రాష్ట్రానికి మోదీ తీరని అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. ఏపీకి ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

ఏపీట్రాన్స్‌కోకు ప్రతిష్ఠాత్మక సీబీఐపీ అవార్డు



- ఉత్తమ పనితీరుకు దక్కిన పురస్కారం
- కేంద్ర మంత్రి చేతుల మీదుగా విజయానంద్ తరపున అవార్డు అందుకున్న దినేశ్
- 2017-18కి అత్యల్ప సరఫరా నష్టాలు, 2.83 శాతంతో ట్రాన్స్‌కో రికార్డు
- విద్యుత్ సంస్థలకు సీఎం చంద్రబాబు, మంత్రి కళా వెంకట్రావు అభినందనలు



విజయవాడ, సూర్య బ్యూరో : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ సరఫరా సంస్థ (ఏపీ ట్రాన్స్ కో)కు మరో అవార్డు దక్కింది. అత్యల్ప నష్టాలు, అత్యధిక ట్రాన్స్‌మిషన్ నిర్వహణతో దేశంలోనే 'ఉత్తమ పనితీరు కనబర్చిన సరఫరా సంస్థ'గా గుర్తింపు దక్కించుకుంది. కేంద్ర ప్రభుత్వ సంస్థ 'సాగునీరు, విద్యుత్ కేంద్రీయ మండలి(సీబీఐపీ)' ఈ అవార్డును అందజేసింది. సీబీఐపీ 91వ వార్షికోత్సవాల సందర్భంగా ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి ఆర్కే సింగ్ చేతుల మీదుగా ట్రాన్స్‌కో సీఎండీ కె.విజయానంద్ తరపున జేఎండీ దినేశ్ పరుచూరి అవార్డును అందుకున్నారు. 1927 నుంచి దేశంలోని సాంకేతిక సంస్థలకు గొప్ప తోడ్పాటునందిస్తున్న సీబీఐపీ.. అధునాతన సాంకేతికత, నవకల్పనలను వినియోగించుకుంటూ విద్యుత్ సరఫరాలో అత్యున్నత ప్రమాణాలను సష్టించడంతో పాటు దేశంలోనే స్థిరమైన పనితీరును ప్రదర్శిస్తున్నందుకు గాను ఏపీ ట్రాన్స్‌కోకు తాజాగా అవార్డును అందజేసింది. సరఫరా, పంపిణీ నష్టాలను తగ్గించడం ద్వారా ఏపీ ట్రాన్స్‌కో, డిస్కంలు రూ.1000 కోట్ల వరకు ఆదా చేశాయని ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి, ఏపీ ట్రాన్స్‌కో సీఎండీ, జెన్కో ఎండీ కె.విజయానంద్ తెలిపారు. ట్రాన్స్‌కోకు అవార్డు దక్కడంపై స్పందించిన ఆయన.. రాబోయే రోజుల్లో సరఫరా, పంపిణీ నష్టాలను అంతర్జాతీయ స్థాయిలో 4-5 శాతానికి పరిమితం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. నాణ్యమైన విద్యుత్తును అందుబాటు ధరల్లో నిరంతరం అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారని, విద్యుత్ సంస్థలన్నీ ఆయన ఆదేశాలకు అనుగుణంగా పనిచేస్తున్నాయని వెల్లడించారు. ఇందులో భాగంగా ఏపీట్రాన్స్‌కో అనేక చర్యలు చేపడుతోందన్నారు. వ్యయ నియంత్రణకు, నష్టాలను తగ్గించుకునేందుకు అత్యాధునిక సాంకేతికతను వినియోగిస్తున్నట్లు వివరించారు. ఇంధన సామర్థ్య ట్రాన్స్‌ఫార్మర్లు, అత్యున్నత ప్రమాణాలు కలిగిన సరఫరా లైన్లు, హెవీ లోడ్ల, క్రిటికల్ లోడ్ల సెంటర్లలో రింగ్-మెయిన్ నెట్‌వర్కుల ఏర్పాటు, క్రమం తప్పకుండా లైన్ల నిర్వహణ, సబ్‌స్టేషన్లు, మరమ్మతు పనుల్లో అత్యాధునిక హాట్‌లైన్ టెక్నాలజీ వినియోగం వంటి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఫలితంగా సరఫరా నష్టాలు అత్యల్పంగా 2.83 శాతం, అత్యధిక ట్రాన్స్‌మిషన్ (99.892 శాతం) అందుబాటుతో దేశంలో అగ్రస్థానంలో నిలిచినట్లు విజయానంద్ వెల్లడించారు. విద్యుత్ సంస్థలు అద్భుత పనితీరుతో గడిచిన నాలుగేళ్లలో 137 జాతీయ, అంతర్జాతీయ అవార్డులు అందుకోవడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు, ఇంధన శాఖ మంత్రి కళావెంకట్రావు హదయపూర్వక అభినందనలు తెలిపినట్లు ఇంధనశాఖ, ఐఅండ్ఐ, ఏపీసీఆర్డీఏ ముఖ్య కార్యదర్శి అజయ్‌జైన్ వెల్లడించారు. ప్రస్తుతం 9.72శాతంగా ఉన్న సరఫరా, పంపిణీ నష్టాలను రాబోయే 2,3 ఏళ్లలో 5-6 శాతానికి తగ్గించడమే లక్ష్యంగా డిస్కంలు పనిచేస్తున్నాయని.. ఇందులో భాగంగా నెట్‌వర్క్ బలోపేతానికి రూ.10 వేల కోట్ల పెట్టుబడి పెట్టనున్నట్లు తెలిపారు. ఏపీట్రాన్స్‌కోకు అవార్డు ఇచ్చినందుకు సీబీఐపీకి ధన్యవాదాలు తెలిపిన దినేశ్ పరుచూరి, ఉద్యోగుల కషి, సీఎం చంద్రబాబు సంపూర్ణ మద్దతుతోనే తమ సంస్థకు అనేక పురస్కారాలు దక్కుతున్నాయని చెప్పారు. ట్రాన్స్‌కో ఇప్పటికే ఉత్తమ ఆర్థిక నిర్వహణకు గాను గోల్డెన్ పీకాక్ అవార్డు-2018, గోల్డెన్ పీకాక్ హెచ్‌ఆర్ ఎక్సలెన్స్ అవార్డు-2016, గోల్డెన్ పీకాక్ అవార్డ్స్ సెక్రటేరియట్, స్కోచ్ అవార్డు- 2018, ఐపీపీఏఐ 2016 అవార్డు, ఇలా అనేకఅవార్డులు ట్రాన్స్‌కో సొంతం చేసుకుందని వివరించారు. విద్యుత్‌శాఖ సలహాదారు రంగనాథం కూడా ట్రాన్స్‌కోకు అవార్డు దక్కడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. విద్యుత్ రంగంలో ఆంధ్రప్రదేశ్ అనుసరిస్తున్న ఉత్తమ విధానాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. ట్రాన్స్‌కోకు అవార్డు దక్కడం పట్ల జేఎండీ ఉమాపతి, డిస్కంల సీఎండీలు ఎం.ఎం.నాయక్, హెచ్.వై.దొర కూడా హర్షం వ్యక్తం చేశారు.



సీఎం అభినందనలు: ఆర్థిక లోటున్నా సమర్థతతో పని చేసి పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో సాధించిన ప్రగతికి గుర్తింపుగా సీబీఐపీ అవార్డు రావడం సంతోషంగా ఉందన్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. కేంద్ర మంత్రి నుంచి స్వీకరించిన సీబీఐపీ అవార్డును ముఖ్యమంత్రి చంద్రబాబుకు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు చూపించారు. ఆంధ్రప్రదేశ్ పనితనానికి అవార్డులు ఇస్తూనే, మరోపక్క, నిధుల విడుదలకు అడ్డంకులు, ఆలస్యం చేయడంలో కేంద్ర ప్రభుత్వ వైఖరిని సీఎం ఆక్షేపించారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుని ప్రతి సోమవారం పురోగతిపై సమీక్షల ఫలితం మూలంగానే అవార్డు ఎంపికకు ఆస్కారమిచ్చిందని అంటూనే కేంద్ర జ్యూరీకి కతజ్ఞతలు తెలియజేశారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్ర జల వనరుల శాఖ, కేంద్ర జల సంఘం, పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) మరింత సహకరించాల్సిన ఆవశ్యతను చెప్పారు. ఇప్పటి వరకు 29 సార్లు ప్రాజెక్టును సందర్శించి, 84 సార్లు సమీక్షించానని గుర్తు చేసుకున్నారు. పట్టుదల, రైతుల సంక్షేమం, కరవు రహిత రాష్ట్రంగా ఏపీని నిలబెట్టే లక్ష్యంతో పనిచేస్తుండటంతో 2019 డిసెంబరుకల్లా పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తామన్న విశ్వాసం వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు ప్రాజెక్టుపై రాష్ట్ర ప్రభుత్వం రూ.15380.97 కోట్లు ఖర్చు చేసిందని పేర్కొన్నారు. అయితే కేంద్రం పెంచిన అంచనా వ్యయాలను ఆమోదించేలా ప్రయత్నాలు చేయాలని జలవనరుల శాఖ అధికారులకు సూచించారు. పోలవరం ప్రాజెక్టుకు లభించిన ప్రతిష్ఠాత్మక సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇరిగేషన్ అండ్డ పవర్ (సీబీఐపీ) అవార్డు-2019 శుక్రవారం ఢిల్లీలో రాష్ట్ర జలవనరుల మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అందుకున్నారు. శుక్రవారం ఢిల్లీలో జరిగిన ప్రదానోత్సవంలో కేంద్ర విద్యుత్ మంత్రి ఆర్‌కే సింగ్ ఈ అవార్డును అందకున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబుకు మంత్రి ఉమమహేశ్వరరావు వివరించారు. ఉండవల్లిలోని నివాసంలో ముఖ్యమంత్రి చంద్రబాబును ఇంజనీర్-ఇన్-చీఫ్ వెంకటేశ్వరరావు, ఓఎస్డీ వరప్రసాద్‌లతో వచ్చి మంత్రి ఉమమహేశ్వరరావు కలిశారు.

రెవెన్యూ ఉద్యోగులు అంకిత భావంతో పని చేయాలి : జిల్లా కలెక్టర్

తెలంగాణ రెవెన్యూ ఉద్యోగు సర్వీసెస్ సంఘం డైరీని ఆవిష్కరణ



సూర్యాపేట(చివ్వెం),మేజర్‌న్యూస్: రెవెన్యూ ఉద్యోగు అంకిత భావంతో పని చేస్తూ జిల్లాను అగ్రపథంలో నిలిపేందుకు కృాఎషి చేయాని జిల్లా కలెక్టర్ డి. అమయ్‌కుమార్ అన్నారు. శనివారం తెంగాణ రెవెన్యూ ఉద్యోగు సర్వీసెస్ సంఘం (టిఆర్‌ఈఎస్‌ఎ) రూపొందించిన డెరీని జిల్లా సంయుక్త కలెక్టర్ డి. సంజీవరెడ్డితో కసి ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న పార్లమెంట్ ఎన్నికలో రెవెన్యూ సిబ్బంది సముషిటగా పనిచేసి విజయవంతంగా నిర్వహించుటకు కృాఎషి చేయాని కోరారు. ఈకార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పి. చంద్రయ్య, తెంగాణ రెవెన్యూ ఉద్యోగు సర్వీసెస్ సంఘం జిల్లా అధ్యక్షు ఎస్. మౌలానా, జిల్లా సెక్రటరీ ఎస్.కె జమిరుద్దిన్, స్టేట్‌సెక్రటరీ ఎల్. భద్రయ్య, జె. శ్రీనివాస్‌శర్మ, జి. చంద్రశే ఖర్, కె. వంశీరాజ్, రంజిత్‌రెడ్డి తదితరు పాల్గొన్నారు.

ఎపిఎస్ఎస్‌డిసి తొలివిడత శిక్షణ


విజయవాడ, సూర్య బ్యూరో : రాష్ట్రంలోని ఇంజనీరింగ్ విద్యార్థులకు రొబోటిక్స్, మెకట్రానిక్స్ విభాగంలో జనవరి రెండో వారం నుంచి తొలివిడత శిక్షణను ప్రారంభిస్తున్నట్టు ఎపిఎస్ఎస్‌డిసి ఎండిఅండ్‌సీఈవో డాక్టర్ కతికశుక్ల, ఐఎఎస్ తెలిపారు. మొత్తం 40 ఇంజనీరింగ్ కాలేజీల్లో విద్యార్థులకు శిక్షణఇవ్వాలని ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ (ఎపిఎస్ఎస్‌డిసి), జర్మనీకి చెందిన యూరోపియన్ సెంటర్ ఫర్ మెకట్రానిక్స్(ఈసీఎం) మధ్య ఒప్పందం కుదిరిందన్నారు. ఎంపిక చేసిన ఇంజనీరింగ్ కాలేజీల్లో మెకట్రానిక్స్, రొబోటిక్స్ విభాగంలో అడ్వాన్సుడ్డ అప్లైడ్డ రొబోటిక్ కంట్రోల్ 1.0, అడ్వాన్సుడ్డ అప్లైడ్డ రొబోటిక్ కంట్రోల్ 2.0, అడ్వాన్సుడ్డ అప్లైడ్డ రొబోటిక్ కంట్రోల్ 3.0 కోర్సుల్లో శిక్షణ ఇస్తారు. జర్మనీకి చెందిన రెండు ఐగూస్ రొబోలను ఒక్కో ల్యాబ్‌లో అందుబాటులో ఉంచి విద్యార్థులకు మూడు నెలలపాటు శిక్షణ ఇస్తామని కతికశుక్ల తెలిపారు. తొలివిడతగా యూరోపియన్ సెంటర్ ఫర్ మెకట్రానిక్స్ సంస్థ రాష్ట్రంలోని 11



ఇంజనీరింగ్ కాలేజీలకు చెందిన 24మంది ఫ్యాకల్టీలను జర్మనీకి తీసుకెళ్లి 10 రోజులపాటు రొబోటిక్స్ మరియు మెకట్రానిక్స్ విభాగాల్లో జర్మనీకి చెందిన నిపుణులతో శిక్షణ ఇప్పించారని కతిక శుక్ల తెలిపారు. శిక్షణలో భాగంగా ఆడీ కార్ల తయారీ పరిశ్రమను సందర్శించారు. మరోవైపు తొలివిడత శిక్షణ కోసం 5 వేల మంది ఇంజనీరింగ్ విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. వారిలో 2419 మందికి ప్రాథమిక పరీక్ష నిర్వహించి 900 మందిని శిక్షణ కోసం ఎంపిక చేసుకున్నారు. వీరందరికి 11 ఇంజనీరింగ్ కాలేజీల్లో జనవరి రెండో వారంలో శిక్షణను ప్రారంభిస్తున్నట్టు ఎపిఎస్ఎస్‌డిసి ఎండిఅండ్‌సీఈవో డాక్టర్ కతిక శుక్ల తెలిపారు. రెండో విడతలో ఎక్కువమంది విద్యార్థులకు ఈ శిక్షణను అందుబాటులోకి తీసుకురావాలన్న లక్ష్యంతో 29 ఇంజనీరింగ్ కాలేజీల్లో శిక్షణ ఇవ్వాలని ఎపిఎస్ఎస్‌డిసి నిర్ణయించిందని, ఆసక్తి గల ఇంజనీరింగ్ కాలేజీల యాజమాన్యాలు వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని ఎపిఎస్ఎస్‌డిసి ఎండి అండ్డ సీఈవో డాక్టర్ కతికాశుక్లా(ఐఎఎస్) చెప్పారు. మరోవైపు జనవరి నెలాఖరుకల్లా జర్మనీ నుంచి శిక్షణకు అవసరమైన రోబోలను తెప్పించి అందుబాటులో ఉంచుతామని యూరోపియన్ సెంటర్ ఫర్ మెకట్రానిక్స్ ప్రసిడెంట్ వంగపండు వెంకట నాగరాజు తెలిపారు.

మిషన్ భగీరథ నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేయాలి : జిల్లా కలెక్టర్

లీకేజి సమస్యు తలె త్తకుండా చర్యు చేపట్టాలి



సూర్యాపేట, మేజర్‌న్యూస్: తెంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్‌భగీరథ పథకం ద్వారా గ్రామాకు రక్షిత మంచి నీటి సరఫరా కొరకు ఎలాంటి ఆటంకాు లేకుండా నీటి సరఫరా చేయుటకు చర్యు చేట్టాని జిల్లా కలెక్టర్ డి. అమయ్‌కుమార్ మిషన్ భగీరథ ఇంజినీరింగ్ అధికారును ఆదేశించారు. శనివారం చివ్వెం మండం బండమీద చందుపట్లలోని మిషన్‌భరథ నీటిశుద్ది కేంద్రాన్ని జిల్లా సంయుక్త కలెక్టర్ డి. సంజీవరెడ్డి తోకసి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చందుపట్ల నీటిశుద్ది కేంద్రం ద్వారా 172 అవాసాకు గాను 167 అవాసాకు నీటిని సరఫరా చేయడం జరుగుతుందని, మిగిలిన గ్రామాకు సత్వరమే నీటి సరఫరా కొరకు చర్యు చేట్టాని అన్నారు. నీటి సరఫరా సమయంలో అధికారు గ్రామాలో పర్యవేక్షిస్తూ లీకేజి సమస్యు గుర్తించి తక్షనమే చర్యు చేపట్టి నీటి వృాఎదాని అరికట్టాని ఆదేశించారు. గ్రామాలో ఇంటెక్‌వెల్, ట్యాంక్‌నిర్మాణ పనును పూర్తిచేయాని, ప్రభుత్వం నిర్దేశించిన గడువులోవు నాణ్యతలో ఎక్కడ రాజీపడకుండా నిర్ణీత పనును పూర్తి చేయాని అన్నారు. అనంతరం మిషన్‌భగీరథ నీటి సరఫరా గురించి అధికారును అడిగి తొసుకున్నారు. ఈసందర్భనలో ఆయన వెంట మిషన్ భగీరథ ఎస్‌ఈు సుభాష్‌నందారెడ్డి, లిత, డిఈు వెంకటేశ్వర్లు, నరేశ్, చివ్వెం త హశీల్దార్ తదితరు పాల్గొన్నారు.

బీజేపీ కార్యాలయానికి టూ లెట్ బోర్డు పెట్టుకోవడం ఖాయం

నక్కా ఆనందబాబు

అమరావతి, సూర్య బ్యూరో : హత్యా రాజకీయాలు తెలుగుదేశం పార్టీ సంస్క తి కాదు. ఆ చరిత్ర కన్నా లక్ష్మీనారాయణ, అతని రహస్య స్నేహితులది. రాష్ట్రంలో శాంతిభద్రతలు సక్రమంగా ఉన్నందుకే దేశవిదేశాల నుంచి పరిశ్రమలు, పెట్టుబడులు వస్తున్నాయని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి నక్కా ఆనందబాబు అన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కన్నాలాంటి వారు ప్రజలలో తిరగగలుగుతున్నారన్నారు. కానీ అతని రహస్య మిత్రుల కోసం రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన తీసుకువచ్చేందుకు మరోమారు కన్నా లక్ష్మీనారాయణ యత్నిస్తున్నారన్నారు. రక్తపుటేర్లు పారిన చోట గలగలా నీళ్లు పారించి పచ్చని పంటపొలాలు ఉండేలా చేసిన ఘనత చంద్రబాబునాయుడిదేనన్న విషయాన్ని బీజేపీ నాయకులు గుర్తుంచుకోవాలన్నారు. టీడీపీ కార్యకర్తలపై దాడులు చేసి అభాండాలు వేయడం సరికాదన్నారు. అమిత్ షా తిరుమల పర్యటన సమయంలో ఆయన నుంచి సమాధానం రాబట్టడం కోసం ప్రయత్నించిన నిరసనకారులపై అనుచరులతో దాడి చేయించిన మీది హత్యా రాజకీయాల సంస్కతి కాదా. ఆ సమయంలో కనీసం కారు కూడా దిగకుండా అమిత్‌షా పారిపోయారన్నారు. ఇదేనా నాయకుడికి ఉండవలసిన లక్షణం. కాకినాడలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ధైర్యంగా బస్సు ఆపి కిందకు దిగి వచ్చి మరీ అందరికీ పేరుపేరున సమాధానమిచ్చారన్నారు. ప్రజానాయకుడికి ఉండవలసిన లక్షణాలు అవి అని అన్నారు. 5 కోట్ల ఆంధ్రులు బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కన్నా లక్ష్మీనారాయణను నిలదీసిన సందర్భాలలో ఏనాడైనా చంద్రబాబులా సమాధానమిచ్చారా? ముఖ్యమంత్రితో



మాట్లాడిన మహిళా కార్పొరేటర్ కూడా తెలుగుదేశం మద్దతుతోనే గెలిచారన్న విషయం గుర్తుంచుకోండన్నారు. స్మార్ట్ సిటీస్ విషయంలో ప్రశ్నించే ముందు, వాస్తవాలు తెలుసుకోండి. 2017-18లో జాతీయ స్థాయిలో స్మార్ట్ సిటీలకు రూ. 9,943 కోట్లు కేటాయిస్తే, ఇప్పటి వరకు కేంద్రం ఇచ్చిన నిధులు రూ.182 కోట్లు మ్రాత్రమేనన్నారు. నరేంద్ర మోదీ గొప్పగా చెప్పుకునే స్మార్ట్ సిటీస్ మిషన్ ఏవిధంగా ఫెయిల్ అయిందో ఇక్కడే అర్థమవుతోందన్నారు. అర్బన్ డెవలప్‌మెంట్‌పై ఈ లెక్కలు కావాలంటే 22వ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ రిపోర్టు చూస్తే బీజేపీ నాయకులకు తెలుస్తుందన్నారు. స్మార్ట్ సిటీస్ నిధులను కాగితాలకే పరిమితం చేసి దేశంలోని 29 రాష్ట్రాలను బీజేపీ మోసం చేసిందన్నారు. సానుభూతి కోసం బీజేపీ నాయకులు ఎన్ని వేషాలేసినా కానీ ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. త్వరలో బీజేపీ కార్యాలయానికి టూ లెట్ బోర్డు పెట్టుకోవడం ఖాయమన్నారు.

సూర్య
హైదరాబాద్
ఆదివారం
6 జనవరి 2019

సొంతఇంటి కల నెరవేరుస్తాం

- ప్రతి ఉద్యోగికీ గృహ వసతి
- ఇళ్ల నిర్మాణానికి భూములు గుర్తించాలని సీఎం ఆదేశం

(అమరావతి సూర్య ప్రత్యేక ప్రతినిధి) :సొంత ఇల్లు లేని ప్రతి ఉద్యోగికీ గహ వసతి కల్పించి వారి సొంతిటి కల నెరవేరుస్తా మని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రభుత్వ సేవల ద్వారా ప్రజా సేవచేసే ప్రతి ఉద్యోగికీ సొంత ఇల్లు ఉండాలని ఆయన తేల్చి చెప్పా రు. ఉద్యోగుల ఇళ్ల నిర్మాణానికి భూములు గుర్తించా లని అధికారులను ఆదేశించారు. అపార్ట్‌మెంట్లు నిర్మించి అందులో వారికి ప్లాట్లు కేటాయించాలని సూచించారు. జన్మభూమి కార్యక్రమంపై కలెక్టర్లు, నోడల్ అధికారు లు, ప్రజాప్రతినిధులతో ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్ర ప్రగతికి ప్రజలు, ఉద్యోగులే రథాలు అని ముఖ్యమంత్రి కొనియాడారు. ఇరువర్గాల సంక్షేమమే లక్ష్యంగా అనేకం చేశామని గుర్తుచేశారు. 30, 40 ఏళ్లు హైదరాబాద్‌తో అనుబంధం వదులుకుని ఉద్యోగులు, న్యాయవాదులు ఇక్కడికి వచ్చినందున వారు నిలదొక్కుకునేందుకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ జన్మభూమిలో ఫిర్యాదుల సంఖ్య సగం వరకు తగ్గిందని ముఖ్యమంత్రి సంతోషం వ్యక్తంచేశారు. రేషన్, పెన్షన్, ఇళ్ల కోస ం వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని అధికారులకు దిశా నిర్దేశం చేశా రు. చుక్కల భూమి సమస్యలు సత్వరమే పరిష్కరించాలని పునరుద్ఘాటించారు. ఏళ్లుగా రైతులను సతమతం చేస్తున్న ఈ సమస్యకు పరిష్కారం చూపాలని తేల్చి చెప్పారు. భూమిని బదిలీ చేసుకోలేక, అమ్ముకోలేక అనేక మంది రైతులు ఇబ్బందు లు పడుతున్నారని, ప్రభుత్వమే సుమోటాగా చుక్కల భూముల సమస్యలను పరిష్కరించాలని స్పష్టం చేశారు. ప్రతి రైతు కళ్లల్లో ఆనందం చూడాలని సీఎం అన్నారు.




కడప జిల్లా పర్యటనలో మంత్రి లోకేష్

- రాయచోటి నియోజకవర్గం కసిరెడ్డిగారిపల్లెలో మంత్రి నారా లోకేష్‌కి ప్రజలు
- తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, నాయకులు ఘన స్వాగతం
- 8 లక్షల వ్యయంతో నిర్మించిన చెత్త నుండి సంపద తయారీ కేంద్రం ప్రారంభం
- 2 కోట్ల వ్యయంతో విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన
- పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు



(కడప సూర్య ప్రత్యేక ప్రతినిధి) :కడప జిల్లా రాయచోటి నియోజికవర్గంలో మంత్రి నారా లోకేష్ పర్యటించారు. రాయచోటి నియోజకవర్గం కసిరెడ్డిగారిపల్లెలో మంత్రి నారా లోకేష్‌కి ప్రజలు, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, నాయకులు ఘన స్వాగతం పలికారు. 86 లక్షల వ్యయంతో నీలకంఠారావు పేట నుండి రామాపురం వరకూ నిర్మించిన బిటి రోడ్డుని ప్రారంభించారు. 8 లక్షల వ్యయంతో నిర్మించిన చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని ప్రారంభించారు. 2 కోట్ల వ్యయంతో విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. చిట్లూరు గ్రామంలో 85 లక్షల వ్యయంతో సికే రోడ్డు నుండి చెరువుముందర పల్లె వరకూ నిర్మించిన బిటి రోడ్డుని ప్రారంభించారు. బీసీ కాలనీలో 15 లక్షల వ్యయంతో సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 46 లక్షల వ్యయంతో ఏపీ మోడల్ స్కూల్ లో కాంపౌండ్ వాల్, అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతవరం గ్రామంలో 46 లక్షల వ్యయంతో చెరువుముందరపల్లె నుండి అనంతవరంపల్లె వరకూ నిర్మించిన బిటి రోడ్డుని ప్రారంభించారు. అనంతవరం గ్రామంలో 3.54 లక్షల వ్యయంతో నిర్మించిన చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని ప్రారంభించారు. 21 లక్షల వ్యయంతో నిర్మించిన మినీ గోకులంని ప్రారంభించారు. 7 లక్షల అంచనా వ్యయంతో అంగన్వాడీ కేంద్రం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఎన్టీఆర్ గ్రామీణ గహ కల్ప పథకంలో భాగంగా ఇల్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. లక్కిరెడ్డి పల్లె గ్రామంలో 5 లక్షల వ్యయంతో నిర్మించిన విలేజ్ పార్క్ ని ప్రారంభించారు. 39 లక్షల వ్యయంతో నిర్మించనున్న హిందూ, ముస్లిం,క్రిస్టియన్ స్మశానాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 14 లక్షల వ్యయంతో అంగన్వాడీ కేంద్రం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 61 లక్షల అంచనా వ్యయంతో సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 60 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన బిటి అప్రోచ్ రోడ్డుని ప్రారంభించారు. 60 లక్షల వ్యయంతో ఆర్వి రోడ్డు నుండి సోమాలవాండ్ల పల్లె వరకూ నిర్మించిన బిటిరోడ్డుని ప్రారంభించారు. 5 కోట్ల వ్యయంతో 15 నివాస ప్రాంతాలకు తాగునీరు అందించే విధంగా నిర్మించిన తాగునీటి పథకాన్ని ప్రారంభించారు. లక్కిరెడ్డి పల్లె గ్రామంలో 40 లక్షల అంచనా వ్యయంతో ఆర్వి రోడ్డు నుండి బసిరెడ్డి పల్లె వరకూ నిర్మించిన బిటి అప్రోచ్‌రోడ్డుని ప్రారంభించారు. 7.70 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని ప్రారంభించారు. 36 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన అన్న క్యాంటీన్ ని ప్రారంభించారు. సోమాలవాండ్ల పల్లెలో 7 లక్షల అంచనా వ్యయంతో అంగన్వాడీ కేంద్రం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 24 కోట్ల వ్యయంతో రాయచోటి నియోజికవర్గం వివిధ గ్రామాల్లో సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 19 కోట్ల వ్యయంతో రాయచోటిలో ఎన్టీఆర్ క్రీడా వికాస కేంద్రం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 12 కోట్ల వ్యయంతో రాయచోటిలోని ప్రభుత్వ పాఠశాలలకు కాంపౌండ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 4 కోట్ల వ్యయంతో రాయచోటిలో 55 అంగన్వాడీ కేంద్రాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 50 లక్షల వ్యయంతో బండపల్లి నుండి బైనేని హరిజనవాడ వరకూ నిర్మించిన సిసి రోడ్డుని ప్రారంభించారు. 75.78 కోట్ల వ్యయంతో పలు అభివద్ధి కార్యక్రమాలను ప్రారంభించి, పలు అభివద్ధి కార్యక్రమాలకి మంత్రి నారా లోకేష్ శంకుస్థాపన చేశారు.

అమరావతి నిర్మాణం,పనులు ఫ్లెక్సీపై కలిశెట్టికి చంద్రబాబు ప్రశంసలు



(రాజాం సూర్య మేజర్ న్యూస్ రాజాం) అమరావతిని భ్రమరావతి అంటున్న అభివృద్ధి నిరోధు కులారా కళ్ళు తెరిచి వాస్తవ రూపం చూడండి అని రాష్ట్ర మానవ వనరుల అభివ ద్ధి సభ్యులు, ఉత్తరాంధ్ర నాయకత్వ శిక్షణా శిబిరం డైరెక్టర్ కలిశెట్టి అప్పలనాయుడు ఉత్తరాంధ్ర వ్యాప్తంగా ఫ్లెక్సీలును ఏర్పాటు చేసారు. ఈ ఫోటోలును న్యూస్ పేపర్లో చూసిన ముఖ్యమంత్రి రాజాం పర్యటనకు వచ్చి హెలిప్యాడ్గ దిగి బస్సు ఎక్కగానే రాష్ట్ర పార్టీ అధ్యక్షులు,మంత్రివర్యులు కిమిడి కళావెంకట్రావు, యంపీ కింజరావు రామ్మోహన్ నాయుడు,రాజాం నియోజకవర్గ ఇంచార్జ్ కొండ్రు మురళిమోహన్‌తో మాటలు సంభాషణలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు చాలా బాగున్నాయని,ప్రజలులోకి ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలును తీసుకెళ్ళటానికి వినూత్నంగా వెళ్తున్నారని అభినందించారులి జన్మభూమి కార్యక్రమం అనంతరం హెలిప్యాడ్గ దగ్గర ముఖ్యమంత్రికి వీడ్కోలు చెప్తున్న సందర్భంలో కలిశెట్టికి ముఖ్యమంత్రి అభినందనలు తెలియజేసారు.

కృష్ణాతీరంలో విశ్వశాంతి మహాయజ్ఞం



విజయవాడ, సూర్య బ్యూరో : బెజవాడ కృష్ణానదీ తీరంలోని పద్మావతిఘాట్‌లో హనుమాన్ చాలీ సా పారాయణ కార్యక్రమం వైభవంగా ప్రారంభమైంది. విశ్వ శాంతి మహాయజ్ఞాన్ని ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, గణపతి సచ్చిదానంద స్వామి ప్రారంభించారు. ఆంజనేయుడికి సీఎం చంద్రబాబు తమలపాకులతో అర్చన చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ “గణపతి సచ్చిదానంద దత్తపీఠం ఎంతో విశిష్టత కలిగినది. కష్ణమ్మ, దుర్గమ్మ పాదాల చెంత హనుమాన్ చాలీసా పారాయణం చేయడం ఒక అదష్టం. లక్ష్య సాధనకు పారాయణం ఉపయోగపడుతుంది. ప్రపంచంలోని 5 అగ్ర నగరాల్లో అమరావతి ఉండాలనేది నా సంకల్పం. హనుమాన్ ఆశీస్సులు అందరికీ ఉండాలని కోరుతున్నా” అని వెల్లడించారు. హనుమాన్ చాలీసా పారాయణం, మహాయజ్ఞానికి భక్తులు భారీగా తరలివచ్చారు. వేలాదిగా తరలివచ్చిన హనుమాన్ భక్తులతో కష్ణాతీరం కిటకిటలాడింది.

సమస్యల పరిష్కార వేదికగా జన్మభూమి

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

- 6వ విడత జన్మభూమి మా ఊరు కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, నగర మేయర్ కోనేరు శ్రీధర్ హాజరు
- ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించుకునేందుకు ఒక వేదికగా ప్రజలు ఉపయోగించుకోవాలి
- నగరంలో 60 లక్షల రూపాయలతో భూగర్భ జల డ్రెయినేజీ పనుల పూర్తి చేయడం జరిగింది



విజయవాడ, సూర్య బ్యూరో : ప్రజల సమస్యలు పరిష్కరించే వేదికలుగా 6వ విడత జన్మభూమిమాఊరు కార్యక్రమం నిలుస్తుందని విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. శనివారం నిర్వహించిన 6వ విడత జన్మభూమిమాఊరు కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, నగర మేయర్ కోనేరు శ్రీధర్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా జన్మభూమి కార్యక్రమానికి హాజరైన ప్రజలను ఉద్దేశించి ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ జన్మభూమి కార్యక్రమం ఒక సంక్రాంతి పండుగలాగా నిర్వహించి ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించుకునేందుకు ఒక వేదికలుగా ప్రజలు ఉపయోగించుకోవాలన్నారు. నగరంలో 60 లక్షల రూపాయలతో భూగర్భజల డ్రైనేజీ పనులను పూర్తిచేయడం జరిగిందన్నారు. నగరంలో ప్రజలకు 24 గంటలు మంచినీటి సరఫరా అందించేందుకు రూ.864 కోట్ల రూపాయలు మున్సిపల్ కార్పొరేషన్‌లో డిపాజిట్ అయ్యి ఉన్నాయని సాధ్యమైనంత త్వరగా ఈ పనులను చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో ఇళ్లు లేని పేదవారు ఉండకూడదనే లక్ష్యంతో ప్రభుత్వం 25 లక్షల ఇళ్ల నిర్మాణానికి సంకల్పించిందన్నారు. విజయవాడ నగరంలో లక్షా 50 వేల మంది పేదలకు ఇళ్లు నిర్మించేందుకు దశల వారీగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. సంక్రాంతి పండుగ తరువాత 8 వేల ఇళ్లను అర్హులకు గృహప్రవేశాలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. నగర మేయర్ కోనేరు శ్రీధర్ మాట్లాడుతూ నగరంలో సంక్రాంతి సంబరాలులాగా జన్మభూమి కార్యక్రమాలకు ప్రజలు వచ్చి పాల్గొంటున్నారన్నారు. మేము అధికారం చేపట్టే నాటికి విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ అప్పుల్లో, ఉద్యోగులకు జీతాలు చెల్లించలేని పరిస్థితులో ఉంటే ఇపడు మొదటి తారీఖుకే ఉద్యోగులకు జీతాలు చెల్లిస్తూ పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు రమాదేవి, చెన్నుపాటి గాంధీ, డాంగేకుమారి, నోడల్ అధికారి ఐజాక్ ప్రభాకర్, సిడిపో ఇంఛార్జీ కె.శ్రీనివాసరావు, ఎఎస్‌వో ఉదయ్‌భాస్కర్, ఇంచార్జీ ఎమ్మార్వో శ్రీరామ్ రెడ్డి, సిడిపివో సువర్ణ, ఆర్‌ఐ శ్రీనివాస్, ప్రసాద్‌లు పాల్గొన్నారు.

ప్రతిపక్షానిది ప్రమాదకర రాజకీయం



మంత్రి కాల్వ

అనంతవురం, సూర్య ప్రతినిధి : రాజకీయ అవసరాల కోసం జగన్ ప్రమాదకర రాజకీయాలు చేస్తున్నారని మంత్రి కాల్వ శ్రీనివాసులు వ్యాఖ్యానించారు. రాష్ట్ర ప్రయోజనాలు దెబ్బ తీసేందుకు మోదీతో జగన్ రహస్య స్నేహం చేస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు తిట్టడానికే జగన్ పాదయాత్ర చేస్తున్నారని ధ్వజమెత్తారు. చంద్రబాబును ఏపీ రాజకీయాలకే పరిమితం చేయాలని జగన్, మోదీ కుట్రపన్నుతున్నారని ఆరోపించారు.

రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి

- 10వ వేతన సవరణ కమిటీ సిఫార్సును తక్షణమే అమలు చేయాలి
- దేశంలో ఏ రాష్ట్రంలోను లేని విధంగా మన రాష్ట్రంలో ఉన్న 4 లక్షల పెన్షనర్లు
- కుటుంబ సభ్యులకు మాస్టర్ హెల్త్ చెక్‌అప్ నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు
- ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక పెన్షనర్ల జెఎసీ జిల్లా అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్



విజయవాడ, సూర్య బ్యూరో : రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లకు గతంలో 75 ఏళ్లకు ఉన్న అదనవు క్వాంటం పెన్షన్ విధానాన్ని 70 సంవత్సరాలకి పరిమితం చేస్తూ 10వ వేతన సవరణ కమిటీ సిఫార్సును తక్షణమే అమలు చేయడంతో పాటు పెన్షనర్ల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చినట్లు ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక పెన్షనర్ల జెఎసీ జిల్లా ఆధ్యక్షులు ఎ.విద్యాసాగర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం విజయవాడ తాలూకా కార్యాలయ అవరణలో గల పెన్షనర్ల సంఘ భవనంలో సంఘ ఆధ్యక్షులు కె.దాలినాయుడు ఆధ్యక్షతమ శనివారం నిర్వహించారు. సమావేశంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న విద్యాసాగర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు గతంలో 75 ఏళ్లకు ఉన్న ఆదనవు క్వాంటం పెన్షన్ విధానాన్ని 70 సంవత్సరాలకు పరిమితం చేస్తూ 10వ వేతన సవరణ కమిటీ సిఫార్సు చేయడం జరిగిందన్నారు. కమిటీ సిఫార్సును అమలు చేయాలని రాష్ట్ర జెఏసీ ఇప్పటికే ప్రభుత్వం దృష్టికి తీసుకురావడం జరిగిందని దీని అమలు చేస్తూ త్వరలో ఉత్తర్వులు వెలువడనున్నాయనే ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నానన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలోను లేని విధంగా మన రాష్ట్రంలో ఉన్న 4 లక్షల పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులకు మాస్టర్ హెల్త్ చెక్‌ఆప్ నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. హెల్త్‌చెక్‌ఆప్ ద్వారా పెన్షనర్లు వారి కుటుంబ సభ్యులు ఆరోగ్య స్థితిని నమోదు చేసుకుని చికిత్స చేయించుకునే ఆవకాశం ఉంటుందన్నారు. పెన్షనర్ల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించేందుకు ఎపిఎన్‌జివో ఆసోసియేషన్ ఎల్లపడు సిద్ధంగా ఉంటుందని విద్యాసాగర్ తెలిపారు. సమావేశంలో ఎపిఎన్‌జివో ఆసోసియేషన్ జిల్లా సహ ఆధ్యక్షులు డి.సత్యనారాయణరెడ్డి పెన్షనర్ల సంఘం జిల్లా ఆధ్యక్షులు కె.దాలినాయుడు, ప్రధాన కార్యదర్శి ఎ.సుబ్రహ్మణ్యం, గౌరవ ఆధ్యక్షుడు డి.ఎస్ రెడ్డి, ఉపాధ్యక్షులు ఎం.రాధాకృష్ణమూర్తి, కోశాధికారి కె.నాగేశ్వరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం.మహానంది, జాయింట్ సెక్రటరీ వెంకట్రావు, కార్యవర్గ సభ్యులు, పెన్షనర్లు పాల్గొన్నారు.

టీడీపీ నేతల భారీ నిరసనలో ఎంపి కేశినేని



టీడీపీ నేతల భారీ నిరసనలో ఎంపి కేశినేని
విజయవాడ, సూర్య బ్యూరో : ఏపీ హక్కుల కోసం తాము పార్లమెంటులో పోరాడామని, లోక్‌సభ సాక్షిగా తమ గొంతు నొక్కడం అన్యాయమని ఎంపీ కేశినేని నాని మండపడ్డారు. విజయవాడలో టీడీపీ నేతల భారీ నిరసనలో ఎంపీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టంలో ఉన్నవే ఇవ్వాలని అడిగితే తమని సస్పెండ్గ చేశారన్నారు. రాజ్యాంగానికి మోదీ ప్రభుత్వం తూట్లు పొడుస్తోందని విమర్శించారు. మోదీ అసమర్థ ప్రధాని అని, మోదీ గ్రాఫ్ పడిపోతోందని తెలిపారు. ఏపీకి అన్యాయం చేసిన ఏ పార్టీ గెలిచినట్టు చరిత్రలో లేదన్నారు. దేశ రాజకీయాల్లో చంద్రబాబు కీలకపాత్ర పోషించబోతున్నారని పేర్కొన్నారు. 2019లో బీజేపీ ఘోరంగా ఓడిపోతుందని ఎంపీ కేశినేని నాని అన్నారు.

రాష్ట్రంలో శాంతిభద్రతలు కాపాడాలి: కన్నా



గుంటూరు, సూర్య ప్రతినిధి : సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ ఆదేశాలతో తనను చంపేందుకు టీడీపీ కార్యకర్తలు వచ్చారని బీజేపీనేత కన్నా లక్ష్మీనారాయణ ఆరోపించారు. తన ఇంటి ముందు టీడీపీ శ్రేణుల ధర్నాపై కన్నా మాట్లాడుతూ తన మీద హత్యాయత్నంపై కేంద్ర హోంశాఖకు ఫిర్యాదు చేస్తానని తెలిపారు. గతంలో అమిత్‌షా, జగన్, పవన్‌పై ఇవ్వుడు తనపై హత్యాయత్నానికి పాల్పడ్డారన్నారు. గవర్నర్ దష్టిసారించి రాష్ట్రంలో శాంతిభద్రతలు కాపాడాలని ఆయన డిమాండ్గ చేశారు. ఏపీలో ప్రజాస్వామ్యమే లేదని, వ్యవస్థలన్నింటినీ భ్రష్టుపట్టించారని విమర్శించారు. చంద్రబాబు పోలీసులతో పాలన సాగిస్తున్నారని కన్నా లక్ష్మీనారాయణ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

పునాదులు వేయకుండానే ఇళ్ల మంజూరా?

- తెలుగుదేశం పార్టీ సామాన్య, మధ్య తరగతి ప్రజల సొంత ఇంటి కలతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తోంది
- మూడు నెలలో ఏ మాయాజాలం చేసి ఇంటి నిర్మాణాలు పూర్తి చేస్తారో టీడీపీ నాయకులు నగర ప్రజలకు సమాధానం చెప్పాలి: జనసేన



విజయవాడ, సూర్య బ్యూరో : సామాన్య మధ్య తరగతి ప్రజల సొంత ఇంటి కల విజయవాడ నగరములో నెరవేరుస్తామని, ఓట్లు వేయించుకున్న తెలుగు దేశం పార్టీ సామాన్య, మధ్య తరగతి ప్రజల సొంత ఇంటి కలతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుందని జనసేన పార్టీ జిల్లా జాయింట్ కోఆర్డినేటర్ పోతిన వెంకట మహేష్ ఆరోపించారు. పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశములో మాట్లాడుతూ విజయవాడ నగరములో 28 వేల ఇళ్ళు కట్టిస్తామని, తద్వారా సామాన్యుల సొంత ఇంటి కల నెరవేరుస్తామని పదే పదే ప్రకటనలు ఇచ్చి నాలుగు సంవత్సరములు కాలయాపన చేసి గత 6 నెలలుగా షాబాద్ కొండ దిగువ ప్రాంతములో షుమారు 2,500 ఇళ్ళ నిర్మాణము చేపట్టి 11 వేల మంది దగ్గర రూ. 28 కోట్ల రూపాయలను అడ్వాన్సుగా వసూలు చేసారంటే, సామాన్య, మధ్య తరగతి వర్గాలను రాబోయే ఎన్నికలలో ఓట్లు వేయించుకోవడం కోసం ఎంత దారుణంగా మోసం చేస్తున్నారో అర్ధమవుతుందన్నారు. షుమారు మూడు వేల ఇళ్ళ నిర్మాణము చేపట్టి 11 వేల మంది దగ్గర అడ్వాన్సు వసూలు చేయటమంటే ప్రభుత్వ రియల్ ఎస్టేట్, మోసపూరిత వైఖరి స్పష్టముగా అర్ధమవుతుందని, రాష్ట్ర ప్రభుత్వము విజయవాడ నగరములో తొలి విడతగా 10,624 ఇళ్ళ నిర్మాణము కోసం టెండర్లు జారీ చేసి, కేవలం 8 వేల ఇళ్ళకు మ్త్రామే స్థలము చూపించారంటే, సామాన్య, మధ్య తరగతి వర్గాలను ఏ విధంగా త్రిశంకు స్వర్గములో పెడుతున్నారో ప్రజలు అర్ధం చేసుకోవాలన్నారు. మూడు నెలలో ఏ మాయాజాలం చేసి ఇంటి నిర్మాణాలు పూర్తి చేస్తారో టీడీపీ నాయకులు నగర ప్రజలకు సమాధానం చెప్పాలని, వునాదులు కూడా లేని నిర్మాణాలకు మంజూరు పత్రాలు జారీ చేసిన టీడీపీ పాలకులను నగరం నుండి తరిమి కొట్టడం ఖాయమని మహేష్ హెచ్చరించారు.

‘టీడీపీ గెలుపు కోసం బ్రాహ్మణులంతా కృషి చేస్తాం’

విజయవాడ, సూర్య బ్యూరో : గవర్నర్‌పేటలోని తన కార్యాలయం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీడీపీ నాయకులు ముష్టి శ్రీనివాసరావు కార్యాలయం లో ఆయన మాట్లాడుతూ నిన్న జగన్ కేసు పురోగతిని ఆపాలని కేంద్రం ఒక కుట్ర పూరితమైన ఉత్తరువు లిచ్చింది. ఎన్‌ఐఎ వారు సెక్షన్ 3 కింద ఎఫ్‌ఐఆర్ ఫైల్ చేశారు కానీ ఆ సెక్షన్‌లో ఎవరైతే తప్పు చేశారో వారిని మాత్రమే ఫనిష్ చేయాలని ఉంది. ఎన్‌ఐఎ సెక్షన్ 7, 8, 9, 10 ఆక్ట్ కింద రాష్ట్ర ప్రభుత్వానికి ఈ ఎంక్విరినీ ఆపాలని ఎక్కడ ఇవ్వలేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి కూడా ఎంక్విరీ చేసే హక్కు ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తన పని తాను చేస్తుందని తెలిపారు. ఎన్‌ఐఎ పెట్టిన సెక్షన్‌లో రాష్ట్ర ప్రభుత్వాని సహాయం కోరాలని ఉంది కాని కేంద్రం రాష్ట్రాన్నీ ఎటువంటి సహాయం కోరకుండా రాష్ట్ర ప్రభుత్వ హక్కులను హరిస్తుంది. ఈ వ్యవహారం అంత చూస్తే మోడీ జగన్‌తో చేతులు కలిపి రాష్ట్రం ఒరబుత్వం పై కుట్రలు చేస్తుందని అర్ధమవుతుంది. దీనిపై టీడీపీ పెద్దలతో చర్చించి టీడీపీ ప్రభుత్వం హైకోర్టులో పిల్ వేయడానికి రెడిగా ఉన్నామని తెలిపారు. బ్రాహ్మణులకు రాబోయే ఎన్నికల్లో సీట్లు కేటాయిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారని స్పష్టం చేశారు. ఇది రాష్ట్రంలో ఉన్న బ్రాహ్మణులకు తీపి కబురని అన్నారు. ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయం పట్ల రాష్ట్రవ్యాప్తంగా బ్రాహ్మణ సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయని పేర్కొన్నారు. ఈ నిర్ణయాన్నీ తామంతా స్వాగతిస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో బ్రాహ్మణులు ఎక్కడ ఉంటే అక్కడ సీట్లు కేటాయిస్తామండంతో ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న బ్రాహ్మణుల కల నెరవేరిందని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ గెలువుకోసం బ్రాహ్మణులంతా కషి చేస్తామని చెప్పారు.

న్యూఢిల్లీలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు

న్యూఢిల్లీ, సూర్య ప్రతినిధి : శ్రీవేంకటేశ్వర స్వామివారి దేవస్థానం, ద్వారకా తిరుమల, పశ్చిమ గోదావరి జిల్లా ఆంధ్రప్రదేశ్ వారి సౌజన్యంతో న్యూఢిల్లీలోని గోల్డ్ మార్కెట్‌లో గల శ్రీ బాలాజీ మందిర్, ధ్యానమందిర్‌లో శనివారం అష్టోత్తర సహస్రనామార్చన సేవ, సాయంత్రం గం. 5.30 లకు శ్రీ వేంకటేశ్వర స్వామివారి కళ్యాణోత్సవం ఘనంగా నిర్వహించినట్లు ఎపి భవన్ రెసిడెంట్ కమీషనర్ ప్రవీణ్‌ప్రకాష్ తెలిపారు.

ద్వారకా తిరుమల దేవస్థానం నుంచి విచ్చేసిన ఆలయ కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు, ప్రధానార్చకులు బ్రహ్మశ్రీ పెద్దింటి జగన్నాధాచార్యులు నేతత్వంలోని అర్చక బందం కార్యక్రమాన్ని నిర్వహించారు.

దేవస్థాన ఆగమ పాఠశాల ఉపాధ్యాయుడు సుదర్శన శ్రీనివాసాచార్యులు అష్టోత్తరనామార్చన విశిష్టతను, శ్రీవారి కళ్యాణోత్సవ వైశిష్ట్యాన్ని ఆద్యంతం విశదీకరించారు.

ప్రజల సంక్షేమం కోసమే ఈ ప్రజా కూటమి:ఎమ్మార్పీఎస్



విజయవాడ, సూర్య బ్యూరో : ప్రజల కోసం, ప్రజల సంక్షేమం కోసం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘాలనీ ప్రజాశాంతి పార్టీకి మద్దతును తెలువు తున్నామని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మేదర సురేష్‌కుమార్ తెలి పారు. గత, ప్రస్తుత ప్రభుత్వాలు ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఇచ్చిన హామీలను అమ లుచేయడంలో వైఫల్యం అవ్వడంవలనే ప్రజాశాంతి పార్టీకి మద్దతు తెలి యజేస్తున్నామని ఏపీ ఎమ్మార్పీఎస్ ఉపాధ్యక్షులు మేదర సురేష్ పేర్కొన్నారు. శనివారం నగరంలో ఏపీ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ప్రజా సంఘాలు, వివిధ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కే ఏ పాల్ స్థాపించిన ప్రజా శాంతి పార్టీ 2007లో పార్టీ పెట్టడం జరిగిందన్నారు. ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని ప్రజల పక్షాన ప్రజాశాంతి పార్టీ నిలబడిందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని ప్రజాసంక్షేమం కోసం ప్రజాశాంతి పార్టీతో ముందుకు వెళ్తామని ఆయన హామీ ఇచ్చారు. ఢిల్లీలో ఆమ్‌ఆద్మీపార్టీ తరహాలో బిజెపి కాంగ్రెస్‌లు లేకుండా ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని తెలిపారు. బహుజనులు రాజ్యాధికారం సాధించే దిశగా బీసీ,ఎస్సీ, ఎస్టీలు ప్రజాశాంతి పార్టీకి మద్దతు ఇవ్వాలని కోరారు. అనంతరం నవరంగ్ కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు షేక్ జలీల్ మాట్లాడుతూ ఈ నెల 12న కెఏ పాల్ విజయవాడకు వస్తున్నారని ప్రజా సమ స్యలు పరిష్కారించడానికి రౌండ్గటేబుల్ సమావేశం జరువుతున్నామ న్నారు. ఈ కార్యక్రమంలో బీసీ ఇంటర్నేషనల్ వెల్ఫేర్ సొసైటీ నాయకులు నమ్మి అప్పా రావు, మాలమహానాడు నాయకులు దాసరి రంగనాథ్, ఎంఆర్పీఎస్ జిల్లా అధ్య క్షులు నల్లూరి శేఖర్‌బాబు, ఎం.ప్రవీణ్, కె.పకాష్, బి.దాస్‌లు పాల్గొన్నారు.



మైనర్ల వాహన చోదకం ప్రమాదభరితం

మైనర్‌ల డ్రైవింగ్‌ను ప్రోత్సహించవద్దు, వాహనాలు నడపడానికి శారీరక దృఢత్వంతో పాటుగా మానసిక పరిపక్వత తప్పనిసరి, పిల్లలు చెడు అలవాట్లకు త్వరగా బానిస, కొత్త వాహనాలతో మైనర్‌లలో స్పీడ్ పెరుగుతోంది, మితిమీరిన వేగం పిల్లల ప్రాణాలతో చెలగాటం, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాల జోలికి వెళ్లవద్దు, రహదారి భద్రతా నియమాల అమలు సామాజిక బాధ్యతగా గుర్తించాలి, తల్లిదండ్రుల అతి ప్రేమ వల్లే పిల్లలు రహదారి ప్రమాదాలకు గురవుతున్నారు. చిన్నపిల్లలకు వాహనాలు ఇవ్వడాన్ని నేరంగా పరిగణిస్తున్నా యి. రవాణా, రహదారి భద్రతా చట్టాలు. వారు ఏదైనా ప్రమాదం చేస్తే కచ్చితంగా తల్లిదండ్రులను అరెస్టు చేసేందుకు కూడా వెనుకాడబోమని పోలీసు వర్గాలు హెచ్చరిస్తున్నాయి. జాగ్రత్త పడండి...

మోటార్ వాహన చట్టం ప్రకారం మైనర్ లు వాహనాలు నడుపకూడదు అని చట్టం చెబుతున్నా, మైనర్ పిల్లలు వాహనాలు నడిపితే తల్లిదండ్రులు జైలుకే అని పోలీసులు, పత్రికలు, ప్రభుత్వం ఎన్ని హెచ్చరికలు ప్రకటనలు జారీ చేసినా, పత్రికలలో పతాక శీర్షికలలో వార్తలు రాసినా, పోలీసులు ఎన్నిసార్లు కౌన్సిలింగ్ చేసినా, ఎన్ని జరిమానాలు విధించినా తల్లిదండ్రులు పట్టించుకోవడం లేదు. పిల్లలు కోరిందే తడవుగా అప్పు సప్పు చేసైనా సరే డబ్బులు ఖర్చుపెట్టి మరీ వాహనాన్ని కొని పిల్లల చేతికి అందిస్తున్నారు. కొడుకు అడిగింది తెచ్చి ఇచ్చేస్తే తమ పని అయిపోయిందనే భావించే తల్లిదండ్రు ల సంఖ్య పెరిగిపోతోంది. పిల్లలకు బైక్ కొనిచ్చేస్తే పాఠశాలకు తీసుకుని వెల్లడం, తీసుకు రావడం బాద్యతనుండి విశ్రాంతి దొరుకుతుందని తల్లిదండ్రులు భావించకూడదు. ప్రాజెక్టుల పేరుతో కంప్యూటర్ , నెట్ సెంటర్‌ల వద్దకు, తోటి స్నేహితుల పుట్టిన రోజు వేడుకలకు, హోలి సంబరాలకు, నూతన సంవత్సర వేడుకలకు పిల్లలు విచ్చల విడిగా వాహనాలపై ముగ్గురు, ముగ్గురు మితీమీరిన వేగంతో వెల్తూ మన కళ్ళ ముందు కనిపిస్తున్న సంఘటనలు కోకోల్లలు. పిల్లవాడిలో శారీరక ధృఢత్వం, మానసిక పరిపక్వత, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపడానికి తల్లిదండ్రులు ప్రోత్సహించవద్దు. రోడ్లపై తిరుగుతున్న కొత్త కొత్త వాహనాలతో పాటుగానే రోడ్డు ప్రమాదాల సంఖ్య కూడా నానాటికీ పెరుగుతోంది. రోడ్డుమీదకు వెళ్ళిన వారు తిరిగి వచ్చేదాకా నమ్మకం లేని పరిస్థితులు ఏర్పడు తున్నాయి. అప్పటి వరకు అందరితో సరదాగా గడిపిన పిల్లవాడు రోడ్డు మీదకి వెళ్లిన కొద్ది నిమిషాలలోనే కనిపించని కానరాని లోకాలకు వెళ్ళటంతో ఆ తల్లిదండ్రుల అంతులేని శోఖాన్ని ఆపేవారు ఎవరూ... రోడ్డు ప్రమాదాలతో పచ్చని కుటుంబాల్లో విషాద చాయలు అలుముకుంటున్నాయి. రోడ్డు ప్రమాదాలు జరగడానికి ముఖ్యంగా వ్యక్తుల జీవన శైలిలో మార్పులతో పాటు యాంత్రికమైన జీవనం.







లక్ష్యం దూరం భారం: చదువుకునే పిల్లలు వారి లక్ష్యం పై దృష్టి సారించకుండా విలాసాలకు అలవాటుగా మారుతున్నారు. పాఠశాలలు విద్యనిస్తాయి, ఇంటర్మీడియట్ చదివే దశలోనే బైక్‌లపై స్పీడ్‌గా వెల్తూ ఎంజాయ్ చేస్తున్నామని అనుకుంటున్నారు. కాని వారు లక్ష్యం నుండి దూరంగా వెల్తున్నారు, లక్ష్య సాధన భారంగా మారే ప్రమాదం ఉంది. బైక్ లు అలవాటు పడిన పిల్లలు నడకను మరిచి పోయే ప్రమాదం ఏర్పడబోతోంది. శారీరక శ్రమను మరిచిపోతున్నాడు. దగ్గరలో ఉన్న దుకాణం కు వెల్లాలన్న బైక్ ఇస్తేనే వెల్తాను అనే స్తాయికి దిగజారిపోతున్నారు.

రోడ్డు ప్రమాదాలు దు:ఖ సాగరం:

తల్లిదండ్రులకు గారాబంగా పెంచుకున్న పిల్లలహఠాన్మరణాలు కోలుకో లేని షాక్ కు గురి చేస్తున్నాయి. ఎంత సంపాదించి ఏం లాభం తను కన్న పిల్లలు లేనప్పుడూ......అని బోరున విలపిస్తున్న తల్లిదండ్రుల దు:ఖాన్ని ఆపేదెవరూ... తల్లిదండ్రులనూ అనాధలుగా మార్చే హక్కు పిల్లలకు ఎక్క డినుండి వచ్చింది.ఎల్లవాడిని చెడు సాహవాసాలకు బానిసగా మారకుండా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రుల పైన ఉంది. పిల్లలంటే మీకు ప్రేమ ఎక్కువగా ఉంటే ఒక గంట సమయం ఎక్కువగా మీ పిల్లలతో గడపడానికి ప్రయత్నిం చాలి. మైనర్ పిల్లలకు ఎట్టి పరిస్తితులలో వాహనాలు కొనివ్వకండి. చట్టరీత్యా తల్లిదండ్రులు జైలుకు వెల్లాల్సి ఉంటుంది. పిల్లవాడి భవిష్యత్తు జీవితం బంగా రు భవిత్యం అందించాలి. తల్లిదండ్రులు బైక్ కొనివ్వక పోతే పిల్లలు ఉన్మాదం గా ప్రవర్తించవచ్చు. బైక్ కొనిచ్చే విషయంలో తల్లిదండ్రుల మాట పిల్లలు వినక, పిల్లవాడి ప్రవర్తనలో మార్పు వస్తే వెంటనే కౌన్సె లింగ్ ఇప్పించాలి. ఎవ్వరూ కూడా రోడ్డు ప్రమాదాలు జరుగుతాయని ఊహించరు, కానీ జరిగేవి జరుగుతూ నే ఉంటాయి. ప్రజల ప్రాణాలు బలిగొంటున్న రోడ్డు ప్ర మాదాల నివారణ ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలి.

తల్లిదండ్రుల పై కేసులు

మైనర్ బాలలకు వాహనాలిచ్చే తల్లిదండ్రుల పై కేసులు నమోదు చేసేందుకు చట్టాలు సిద్ధమయ్యాయి. మైనర్ బాలలు వాహనాలతో ప్రమాదాలు చేస్తే తల్లిదండ్రులు జైలుకేల్లె ప్రమాదం ఉందని పోలీసులు చేస్తున్న హెచ్చరికలని కొంతైనా పట్టించుకోవాలి. వాహనాలు నడువుతూ పట్టుబడిన బాలల కారణంగా జరుతున్న ప్రమాదాలు ఎక్కువవుతున్న క్రమంలోనే ఈ నిర్ణయం జరిగినట్లు పోలీ సు వర్గాలు చెపుతున్నాయి. మైనర్ బాలల వాహనాలు ప్రమాదాలు జరిపినట్లైతే ఐపిసి 324 కింద కేసులు నమో దు చేస్తామని , సదరు ప్రమాదాల్లో వ్యక్తులు మృతి చెందితే ఐపిసి 304 పార్ట్ 2 కింద కేసులు నమోదు చేస్తున్నామని స్పష్టం చేశారు . పలితంగా కనీసం పది సంవత్సరాలు జైలు శిక్ష పడే అవకాశం ఉంటుందని వారు వివరించారు .

– డా. అట్ల శ్రీనివాస్ రెడ్డి
కౌన్సెలింగ్ సైకాలజిస్ట్ ఫ్యామిలీ కౌన్సెలర్
9703935321





మన మూడ్ బాలేక పోవడా నికి, ఆధునిక జీవనశైలి వలన కలిగే ఒత్తిడి, టెన్షన్ ముఖ్య కారణాలు. ఇతర మానసిక కారణాలు కూడా దీనికి దోహదపడతాయి. కొన్నిసార్లు మన ఆరోగ్యం క్షీణించడం వల్ల కూడా మూడ్ పాడవుతుంది. ఇవన్నీ ఒక ఎత్తైతే, మన శరీరంలో ఉండే హార్మోన్లు చేసే మాయాజాలం ఇంకొక ఎత్తు. మీ మూడ్ బాగులేకపోవడానికి కారణం ఏమైఉంటుందో అని ఆలోచిస్తూ బాధపడటం వలన కూడా మూడ్ ఇంకా పాడవుతుంది.ఇటువంటి సమయంలో మీరు ఆలోచించ వలసినదల్లా, తిరిగి మీరు ఉత్సాహంగా మారడానికి ఎలా ప్రయత్నించాలి అనే! ఈ పరిస్థితి నుండి బయట పడాలంటే, మీకు నచ్చినపని ఏదైనా చేయాలి.ప్రకృతితో మమేకమై ఉన్న వారి ఆరోగ్యసామర్థ్యాలు అత్యుత్తమంగా ఉంటాయని నిరూపి తమైన దే! కనుక మనచుట్టూ పశు పక్షులు మరియు పూలు, మొక్కలు ఉంటే వాటి సానుకూల ప్రభావం మనపై పడి మన మానసిక, శారీరక ఆరోగ్యం మెరుగ్గా ఉంటుంది. ఈ వ్యాసం ద్వారా మేము మీ మూడును తెలికపరిచే కొన్ని పూల విశిష్టత ను గురించి తెలియజేయబోతున్నాం. ఇంకెందు కు ఆలస్యం, చదివేయండి!

గులాబీలు: ఈవువ్వు ప్రేమాభిమానాలకు చిహ్నం. ఇవి రంగుల్లో దొరుకుతాయి. ప్రతి రంగుకు ఒక విశిష్టత ఉన్నప్పటికీ, మీ మూడ్ బాగు చేయడానికి సమాన సహకారాన్ని అందిస్తాయి. గులాబీని చూడటం, దాని వాసన పీల్చుడం వన, మన లో మన గురించి మన చుట్టూ ఉన్న ప్రపంచం గురించి మంచి భావనలు కలుగుతాయి.


చామంతి

చూపుకు అందంగా ఉండటమే కాక, మన నేరాలను శాంతపరుస్తుంది. మనలో చాలమంది చక్కనైన రుచి మరియు సువాసన కలిగిన కేమోమైల్ టీని గురించి తెలిసినవారే! ఈ టీని సేవించినంతనే మనసుకు ప్రశాంతత చేకూరుతుంది. ఈ పూల నుండి వెలికి తీసిన సారంతో, నిద్రకు సంబంధిం చిన సమస్యలు, ముఖ్యంగా పెద్దవారిలో పరిష్కారమవుతాయి. మీ మూడ్‌ని తేలికపరచి, రోజంతా మిమ్మల్ని ఉత్సాహంగా, ఉల్లాసంగా ఉంచే శక్తి వీటికి ఉంది.

మూడ్‌ని మార్చే మొక్కలు


తులసి:

తులసిలో ఉండే లినోలోల్ దాని గొప్పదనానికి కారణం. మన అభిజ్ఞ శక్తి దెబ్బతినకుండా చేస్తూ, ఒత్తిడితో పోరాడుతూ, మనలో సానుకూల భావనలు ఏర్పడటానికి ఇది తోడ్పడుతుంది. మనం ముందు చెప్పుకున్న మొక్క వలే, దీని పూలు చూపుకు, వాసనకు అంత ఇంపుగా ఉండవు. కానీ మన నాలుకతో రుచి చూసినప్పుడు, దేరని రుచిలోని ఘాటుదనం మన మూడ్‌ను ఉత్సాహపరుస్తుంది.



సూర్య
హైదరాబాద్
ఆదివారం
6 జనవరి 2019
cinema@suryaa.com
సూర్య సినిమా

అతివల మనసులు దోచే అభినవ మజ్ను అరుదెంచుతున్నాడు



అఖిల్ అక్కినేని హీరోగా శ్రీవెంకటేశ్వర సినీ చిత్ర ఎల్ఎల్‌పి పతాకంపై 'తొలిప్రేమ' ఫేం వెంకీ అట్లూరి దర్శకత్వంలో భారీ నిర్మాత బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్ నిర్మిస్తున్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'మిస్టర్ మజ్ను'. ప్రస్తుతం ఈ చిత్రం చిత్రీకరణ దశలో ఉంది. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి జనవరి 25న ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇటీవల ఈ చిత్రానికి సంబంధించి విడుదలైన 'ఏమైనదో.. ఏమైనదో.. పలుకు మరచినట్టు పెదవికేమైనదో..', టైటిల్ సాంగ్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది. కాగా ఈ చిత్రంలోని 'హార్ట్ బ్రేక్' సాంగ్‌ను నేటి సాయంత్రం 6 గంటలకు విడుదల చేస్తున్నారు.

అఖిల్ అక్కినేని సరసన నిధి అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో నాగబాబు, ప్రియదర్శి, జయప్రకాష్, హైపర్ ఆది ఇతర ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: థమన్, పాటలు: శ్రీమణి, సినిమాటోగ్రఫీ: జార్జ్ సి. విలియమ్స్, ఎడిటింగ్: నవీన్ నూలి, ఆర్ట్: అవినాష్ కొల్లా, కొరియోగ్రఫీ: శేఖర్, నిర్మాత: బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: వెంకీ అట్లూరి!!



ఎన్టీఆర్-కథానాయకుడులో నందమూరి బాలకృష్ణ

బాబాయ్ పిలుపివ్వడం ఆలస్యం
ప్రచారాన్ని పరుగులు పెట్టిస్తాం

రామ్‌చరణ్ కొణిదెల



దర్శకుడు బోయపాటి శ్రీనుతో తొలిసారి రామ్‌చరణ్ నటించిన వినయ విధేయ రామ ఈనెల 11న ప్రేక్షకుల ముందుకు వస్తున్నది. ఈ చిత్రం గురించి మాట్లాడుతూ.. బాబాయ్ పవన్ కళ్యాణ్ పిలుపిస్తే ప్రచారాన్ని పరుగులు పెట్టిస్తామని చరణ్ పేర్కొనడం రాజకీయవర్గాల్లో చర్చనీయాంశమవుతోంది. బాబాయ్ ఒక్క ఫోన్ కాల్ చేస్తే చాలు తామంతా ఆయన ఆజ్ఞను శిరసావహిస్తామని చెప్పిన చెర్రీ వినయ విధేయ రామ గురించి మరిన్ని విషయాలు పంచుకున్నారు.

సక్సెస్‌లు ప్లాన్ చేస్తే రావు అనిపిస్తుంది. నా విషయంలో 'రంగస్థలం' దానికి సరైన ఉదాహరణ. 'ధృవ' నుంచి నాకు మంచి సినిమాలే చేయాలని అనిపిస్తోంది. రంగస్థలం' అంత పెద్ద హిట్ అవుతుందని షూటింగ్ సమయంలో అనుకోలేదు. ప్రేక్షకులకు సరిగ్గా రీచ్ అవుతుందా?, మరీ ప్రయోగం చేస్తున్నామా?.. అని కూడా అనిపించింది.

వినయ విధేయ రామ బోయపాటి మార్క్ సినిమా. నాకు ఇలాంటి సినిమా కొత్త. 'భద్ర' నుంచి బోయపాటి సినిమాలు ఇలానే ఓ ప్యాక్‌లా ఉంటున్నాయి. 'వినయ విధేయ రామ'లో అన్నీ ఉంటాయి. పెద్ద కుటుంబం కనిపిస్తుంది. ఇందులో నా పాత్ర విభిన్నంగా ఉంటుంది. అంత వినయంగా ఉండదు.. అంత రౌద్రంగా ఉండదు. తన ఫ్యామిలీ కోసం తాపత్రయ పడే యువకుడి పాత్రలో కనిపిస్తా.

మా హీరోయిన్ కియారా మంచి నటి. నేను 'భరత్ అనే నేను' కూడా చూశాను. ఆమె కళ్లతోనే హావ భావాలు పలికిస్తారు. నేను కలిసి పని చేసిన వారిలో ఓ మంచి డ్యాన్సింగ్ భాగస్వామి ఆమె. బాగా స్టెప్పులు వేశారు. వివేక్ ఒబెరాయ్ ఓ గొప్ప నటుడు. ప్రశాంత్, స్నేహా.. వీళ్లందరి నుంచి చాలా నేర్చుకున్నా.

ఆర్.ఆర్.ఆర్' తొలి షెడ్యూల్ పూర్తయింది. నాకు, తారక్‌కు మధ్య సీన్లు తీశారు. దీని గురించి ఇంతకుమించి ఎక్కువ చెప్పలేను. 'సైరా' షూటింగ్ రెండు నెలల్లో పూర్తవుతుంది. సురేంద్రరెడ్డి సత్తా మరోసారి అందరికీ తెలుస్తుంది.

పవన్ బాబాయికి ఎలాంటి సహకారం అందించడానికైనా మేమంతా ముందుంటాం. ఆయన అడగాలే కానీ ఏదైనా చేస్తాం. ఆయన నుంచి ఒక్క ఫోన్‌కాల్ వస్తే చాలు మేమంతా పరిగెత్తుకుంటూ వెళ్లి చేస్తాం!!

సంక్రాంతికి సెగ పుట్టిస్తున్నారు



పలువురు హీరోయిన్లు సంక్రాంతికి సొగసులద్దేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. వారిలో ముఖ్యంగా చెప్పుకోవాల్సింది విద్యాబాలన్ గురించి. పలు హిందీ చిత్రాల ద్వారా తెలుగు ప్రేక్షకులకు సుపరిచితురాలైన విద్య.. గతంలో కూడా తెలుగులో నటించే అవకాశం వచ్చినప్పటికీ.. అప్పుడు పెద్దగా ఆసక్తి చూపలేదు. ఇప్పుడు ఎన్టీఆర్ బయోపిక్‌తో తెలుగు ప్రేక్షకుల మనసులు దోచుకునేందుకు ఆసక్తిగా ఎదురు చూస్తోంది. ఈమెతోపాటు ఈ చిత్రంలో నిత్యామీనన్, రకుల్ ప్రీత్‌సింగ్, హన్సిక, పాయల్ రాజ్‌పుత్, మంజీమా మోహన్ వంటి పలువురు హీరోయిన్లు మెరుపులు మెరిపించనున్నారు.

ఎన్టీఆర్-కథానాయకుడు తర్వాత విడుదలయ్యే చిత్రం రజనీకాంత్ పేట. దాదాపు ఓ దశాబ్దంపాటు తెలుగు ప్రేక్షకుల్ని ఉర్రూతలూగించిన సిమ్రన్ ఈ చిత్రంతో రీ ఎంట్రీ ఇస్తోంది. అలాగే వర్షం, అతడు, నువ్వొస్తానంటే నేనొద్దంటానా, ఆడవారి మాటలకు అర్థాలు వేరులే వంటి చిత్రాలతో తెలుగువారి గుండెల్లో చెరగని ముద్ర వేసిన త్రిష కూడా తన అందాలతో ఆకట్టుకునేందుకు ఎదురు చూస్తున్నది.

భరత్ అనే నేనుతో తెలుగులో మంచి బోణీ కొట్టిన కైరా అద్వానీ వినయ విధేయ రామతో సంక్రాంతికి ప్రేక్షకుల్ని అలరించనున్నది. ఇదే చిత్రంలో ఐటం సాంగ్ చేసిన ఇషా గుప్తా కూడా కుర్రకారులో నిషా నింపనున్నది.

ఇక ఈ మూడు చిత్రాల తర్వాత ప్రేక్షకుల ముందుకు వస్తున్న ముద్దుగుమ్మలు తమన్నా, మెహరీన్‌లు. ఎఫ్-2లో వెంకీ, వరుణ్‌తేజ్ సరసన నటించిన ఈ ఇద్దరు ముద్దుగుమ్మలు కూడా సంక్రాంతికి సెగ పెంచేందుకు సిద్ధమవుతున్నారు!!





ప్రచారచిత్రం వినాయక్‌చే ఆవిష్కారం



విశ్వనాథ్ ఫిలిం ఫ్యాక్టరీ, శ్రీలక్ష్మి వెంకటాద్రి క్రియేషన్స్ బ్యానర్స్‌పై విశ్వనాథ్ తన్నీరు నిర్మిస్తున్న చిత్రం 'యమ్6'. ఈ చిత్రం ట్రైలర్‌ను ప్రముఖ దర్శకుడు వి.వి.వినాయక్ ఆవిష్కరించి చిత్ర యూనిట్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో హీరో ధ్రువ, నిర్మాత విశ్వనాథ్ తన్నీరు పాల్గొన్నారు.

నిర్మాత విశ్వనాథ్ తన్నీరు మాట్లాడుతూ.. వినాయక్‌గారి చేతులమీదుగా మా 'యమ్6' ట్రైలర్ విడుదల కావడం మాకెంతో సంతోషాన్ని కలిగించింది. ట్రైలర్‌కి మంచి స్పందన వస్తోంది. సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ చిత్రాన్ని ఖర్చు విషయంలో ఎక్కడా రాజీ పడకుండా ఎంతో క్వాలిటీగా నిర్మించాం. దర్శకుడు జైరాం చిత్రాన్ని అద్భుతంగా తెరకెక్కించారు. మా హీరో ధ్రువ కొత్తవాడైనప్పటికీ చక్కటి నటనను ప్రదర్శించాడు. ఈ చిత్రంలో ధ్రువ సరసన అశ్విని హీరోయిన్‌గా నటించింది. ఆమెకు ఇదే తొలి సినిమా. మంచి కంటెంట్‌తో రూపొందిన ఈ సినిమా ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంటుంది.. అన్నారు!!

స్థిర గంభీర ధీవర



తెలుగులో వైవిధ్యమైన సినిమాల హవా పెరుగుతోంది. కొత్తగా వస్తోన్న దర్శకులే కాదు.. నిర్మాతలు కూడా ఈ తరహా కథలకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ క్రమంలో మరో డిఫరెంట్ మూవీ రాబోతోంది. సినిమా పేరు ధీవర. భరీరథ ఆర్ట్ క్రియేషన్స్ బ్యానర్‌పై నాగసాయి, విదా చైతన్య హీరోహీరోయిన్లుగా నటించారు. టైటిల్‌కు తగ్గట్టుగానే డైనమిక్ స్క్రిప్ట్‌తో డిఫరెంట్ స్క్రీన్ ప్లేతో సాగే ఈ మూవీ సస్పెన్స్ థ్రిల్లర్‌గా రాబోతోంది. ఈ చిత్రం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను దర్శకుడు బాబీ చేతుల మీదుగా విడుదల చేశారు.

దర్శకుడు విజయ్ జిక్కి మాట్లాడుతూ.. దీవర సినిమాలో స్క్రీన్ ప్లే హైలెట్‌గా ఉంటుందని.. లవ్ అండ్ సస్పెన్స్ థ్రిల్లర్‌గా సాగుతుందని..అన్నారు.

నిర్మాత హరనాథ్ బాబు మాట్లాడుతూ.. కమర్షియల్ అంశాలకు కూడా పెద్ద పీట వేసినట్టు చెప్పాడు. అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా యూత్ ఫుల్ యాక్షన్ ఎంటర్టైనర్‌గా వస్తోన్న ఈ మూవీ ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ జరుపుకుంటోంది. త్వరలోనే ఆడియోతో పాటు ట్రైలర్‌ను విడుదల చేస్తాం. అన్ని కార్యక్రమాలూ పూర్తి చేసుకుని వచ్చే నెలాఖరు వరకూ ప్రేక్షకుల ముందుకు తెస్తామని.. అన్నారు!!

విదేశీ విద్యార్థులూ ఇక్కడే ఉండండి: ట్రంప్

వాషింగ్టన్ : అమెరికాలోని ఉన్నత విద్యా సంస్థల్లో చదువుకున్న విదేశీ విద్యార్థులు ఇక్కడే ఉండాలని, అమెరికన్ కంపెనీల అభివృద్ధికి దోహదపడాలని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కోరారు. శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడిన ట్రంప్ అమెరికాలో హాస్యాస్పదమైన వలస విధానాల వల్ల ప్రతిభావంతులను కోల్పోతున్నాం అని పేర్కొన్నారు. చట్టబద్ధమైన వలస విధానాల్లో ఉన్న లొసుగులను అంతం చేయాలని, ప్రతిభ ఆధారిత వలసలను ప్రోత్సహించాలని అన్నారు. ప్రజలు చట్టబద్ధంగా, ప్రతిభ ఆధారంగా అమెరికాకు వలస రావాలని తన యంత్రాంగం భావిస్తోందని చెప్పారు.
'నాకు గొప్ప గొప్ప టెక్ కంపెనీల నుంచి ఫోన్లు వస్తున్నాయి. దేశంలోని మంచి విద్యా సంస్థలలో చదువుకున్న వారిని ఇక్కడ ఉంచలేకపోతున్నాం అని చెబుతున్నారు. వారు తిరిగి చైనా, జపాన్, తదితర దేశాలకు వెళ్లిపోతున్నారు. వారిని ఇక్కడ ఉంచలేకపోతున్నాం. వారు ఇక్కడి అత్యుత్తమమైన విద్యా సంస్థల్లో చదువుతున్నారు. వివిధ కారణాలతో వారికి ఇక్కడ ఉండే అవకాశం ఉండడం లేదు. దీనితో గొప్ప ప్రతిభావంతులను కోల్పోతున్నాం. మనం అలా చేయకూడదు' అని ట్రంప్ అన్నారు. విదేశీ విద్యార్థులు చదువు పూర్తయిన అనంతరం అమెరికాలో ఉండి ఉద్యోగం చేసుకునే విషయంలో ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి ట్రంప్ ప్రస్తావించారు. ఈ విషయంపై డెమోక్రటిక్ కాంగ్రెషనల్ నేతలతో చర్చించినట్లు చెప్పారు. గొప్ప కంపెనీలను, ప్రతిభావంతులను వదులుకోబోమని చెప్పారు.
ఆశ్రయం కావాలని కోరుకునే వారికి చట్టబద్ధమైన విధానాలు ఉన్నాయని ఆయన తెలిపారు. ఇటీవల కాలిఫోర్నియాలో భారత సంతతికి చెందిన పోలీసు అధికారిని అక్రమ వలసదారుడు కాల్చి చంపడంపై స్పందించిన ట్రంప్ అమెరికన్లను సురక్షితంగా ఉంచేందుకు సరిహద్దులు మరింత భద్రంగా ఉండాలని కోరారు.

సీబీఐ నెక్స్ట్ టార్గెట్ అఖిలేష్ యాదవ్?

• యూపీ, తెలంగాణ సహా 12 చోట్ల సీబీఐ దాడులు • మైనింగ్ స్కామ్‌కు సంబంధించి దాడులు • ఎఫ్ఐఆర్‌లో పలు మార్లు అఖిలేష్ పేరు • తెలంగాణ ఐఏఎస్ అధికారిణి చంద్రకళ ఇంటిపై సీబీఐ దాడులు • ఇసుక మాఫియాతో సంబంధాలపై కేసు నమోదు • అక్రమార్కులపై గతంలో ఉక్కుపాదం మోపిన చంద్రకళ



న్యూఢిల్లీ, కరీంనగర్ : ఉత్తర ప్రదేశ్‌లో సీబీఐ విరుచుకుపడింది. మొత్తం 12 ప్రాంతాల్లో సీబీఐ దాడులు నిర్వహించింది. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో కలసి పోటీ చేయాలని సమాజ్‌వాది పార్టీ, బహుజన్ సమాజ్ పార్టీ నిర్ణయించిన కొన్ని గంటల వ్యవధిలోనే ఈ దాడులు ప్రారంభం కావడం గమనార్హం. మైనింగ్ స్కామ్‌కు సంబంధించి ఈ దాడులు జరిగాయి. ఇసుక అక్రమ తవ్వకాల్లో ఉత్తర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేశ్ యాదవ్ పాత్ర ఉన్నట్లు సీబీఐ ఆరోపిస్తోంది. ఈ నేపథ్యంలోనే ఆయనను విచారించనున్నారు. ఇసుక తవ్వకాల్లో అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు రావడంతో యూపీలోని ఐఏఎస్ అధికారి చంద్రకళ నివాసం, ఢిల్లీ, తెలంగాణ సహా 12 చోట్ల అధికారులు ఏక కాలంలో సోదాలు నిర్వహించిన విషయం తెలిసిందే. 2012-13 మధ్యలోనే ఈ అక్రమాలు జరిగినట్లు సీబీఐ తెలియజేసింది. ఆ సమయంలో మైనింగ్ శాఖ బాధ్యతలను అప్పటి యూపీ సీఎం అఖిలేశ్ యాదవ్ నిర్వర్తించారు. ఇందులో భాగంగానే విచారణ చేపట్టనున్నారు. అఖిలేశ్ ఆ తరువాత మైనింగ్ శాఖను గాయత్రి ప్రసాద్ ప్రజాపతికి అప్పగించారు. ఈ కేసులో ఆయనకు కూడా సమన్లు పంపించి విచారణ చేయనున్నట్లు సీబీఐ అధికారులు వెల్లడించారు. ఇసుక అక్రమ తవ్వకాల ఆరోపణలు ఎదుర్కొంటున్న సమాజ్‌వాదీ పార్టీ ఎమ్మెల్సీ రమేష్ మిశ్రా, బీఎస్పీ నేత రామ్ అవతార్ రాజ్‌పుత్ ఇళ్లలోను సీబీఐ అధికారులు శనివారం సోదాలు నిర్వహించారు. 2017లో దీనికి సంబంధించి ప్రిలిమినరీ ఎఫ్ఐఆర్‌లు సిద్ధం చేసినా ఎలాంటి చర్యా తీసుకోకపోవడం గమనార్హం. ఎఫ్ఐఆర్‌లో అఖిలేష్ యాదవ్ పేరును నిందితుల జాబితాలో చేర్చనప్పటికీ పలు మార్లు ఆయన పేరును ప్రస్తావించారు. 2012-13లో ఉత్తర ప్రదేశ్ మైనింగ్ శాఖకు అఖిలేష్ ఇన్‌చార్జ్ మంత్రిగా ఉన్నారు. ఆయనతో పాటు గాయత్రి ప్రజాపతి మైనింగ్ శాఖను నిర్వహించారు. ప్రస్తుత ఎఫ్ఐఆర్‌లో ఎస్పీ ఎమ్మెల్సీ రమేష్ కామత్ మిశ్రా, బీఎస్పీ నేత సంజయ్ దీక్షిత్, ఐఏఎస్ అధికారి చంద్రకళను, మరి ఎనిమిది మందిని నిందితులుగా చేర్చారు. రానున్న రోజుల్లో ఈ కేసుకు సంబంధించి మరిన్ని చార్జ్‌షీట్లు నమోదయ్యే అవకాశం ఉంది. వీటిలో అఖిలేష్‌ను నిందితుడిగా చేర్చే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. కాగా, తెలంగాణకు చెందిన ఐఏఎస్ అధికారిణి చంద్రకళ ఇంటిపై సీబీఐ అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. ఉత్తర ప్రదేశ్‌లో ఇసుక కుంభకోణం వ్యవహారంలో కేసు నమోదు చేసిన అధికారులు శనివారం 12 చోట్ల సోదాలు నిర్వహించారు. ఇసుక మాఫియాతో కలసి చంద్రకళ అవకతవకలకు పాల్పడినట్లు అధికారులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ వ్యవహారంలో అలహాబాద్ హైకోర్టు ఆదేశాలతో కేసు నమోదు చేసిన అధికారులు తెలంగాణలోని కరీంనగర్‌తో పాటు యూపీలోని 12 చోట్ల సోదాలు సాగించారు. హమీర్‌పూర్‌లోని బీఎస్పీ నేత సత్యదేవ్ దీక్షిత్, ఎస్పీ ఎమ్మెల్సీ రమేశ్ మిశ్రా ఇళ్లలోనూ తనిఖీలు కొనసాగాయి. వీటిపై మరింత వివరాలు తెలియవలసి ఉంది. కరీంనగర్ జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం గర్జనపల్లి చంద్రకళ స్వగ్రామం. 2008లో సివిల్స్ సాధించిన చంద్రకళ అలహాబాద్‌లో ట్రైనీ ఆర్డీఓగా చేరారు. బులంద్‌షహర్ జిల్లా కలెక్టర్‌గా పని చేస్తున్న సమయంలో రహదారి పనుల్లో అక్రమాలకు పాల్పడిన అధికారులు, కాంట్రాక్టర్లకు చంద్రకళ క్లాస్ పీకిన వీడియో అప్పట్లో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ సందర్భంగా నాణ్యత లేకుండా పనులు చేసినందుకు 12 కాంట్రాక్టులను సైతం ఆమె రద్దు చేశారు. అత్యంత నిక్కచ్చిగా ఉండే అధికారిణిగా పేరు తెచ్చుకున్న చంద్రకళను ప్రధాని నరేంద్ర మోడీ స్వచ్ఛ భారత్ మిషన్ డైరెక్టర్‌గా, కేంద్ర తాగునీరు, పారిశుద్ధ్య మంత్రిత్వశాఖ ఉప కార్యదర్శిగా నియమించారు. తాజాగా అలాంటి అధికారిణిపై సీబీఐ దాడులు చోటు చేసుకోవడం గమనార్హం.

మోడీ పార్లమెంటు ముందుకు వచ్చి ఎందుకు మాట్లాడలేకపోతున్నారు?



బెంగళూరు : ప్రధాని నరేంద్ర మోడీపై మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో భాగంగా రాఫెల్ వివాదం కుదిపేస్తున్న నేపథ్యంలో దేవెగౌడ మీడియాతో మాట్లాడుతూ, రాఫెల్ వివాదంలో ప్రధానిపైనే ఆరోపణలు వచ్చాయి కాబట్టి ఆయనే వచ్చి సమాధానం చెప్పాలని అన్నారు. అసలు మోడీ పార్లమెంటుకు వచ్చి ఎందుకు మాట్లాడలేకపోతున్నారని ఆయన నిలదీశారు. రక్షణ శాఖ మంత్రి సమర్థంగా వాదించినప్పటికీ ఆరోపణలు వచ్చిన నేత మాత్రం సభ ముందుకు రావల్సిందేనని దేవెగౌడ స్పష్టం చేశారు. మోడీ తనకు తానే ప్రజలు అనుమానించేలా వ్యవహరిస్తున్నారని దేవెగౌడ వ్యాఖ్యానించారు.

ఉత్తర ప్రదేశ్‌లో ఎన్‌కౌంటర్



లక్నో : గోహంతకులకు, పోలీసులకు మధ్య జరిగిన కాల్పుల్లో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన ఉత్తర ప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్ సమీపంలో ఉన్న శికర్పూర్ గ్రామంలో జరిగింది. వివరాల్లోకి వెళితే, గ్రామంలోని కొందరు వ్యక్తులు ఆవులను చంపి, వాటి మాంసాన్ని విక్రయిస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. వెంటనే పోలీసులు ఆ ప్రాంతానికి వెళ్లారు. ఈ సందర్భంగా పోలీసులపై వారు కాల్పులు ప్రారంభించారు. పోలీసులు ఎదురుకాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో ఇద్దరు గోహంతకులు మరణించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, మరి ఇద్దరు గోహంతకులు పారిపోయారని చెప్పారు. ఘటన స్థలంలో వంద కిలోల ఆవు మాంసాన్ని స్వాధీనం చేసుకున్నామని ఆయన తెలిపారు.

ఆగని ఆందోళనలు : ఇంకా అట్టుడుకుతున్న కేరళ!

• శబరిమల ఆలయంలోకి మహిళల ప్రవేశంపై నిరసన జ్వాలలు
• కొనసాగుతున్న హిందూ సంస్థల ఆందోళన
• ఇప్పటి వరకు 1800 మంది అరెస్టు

తిరువనంతపురం : కేరళ ఇంకా అట్టుడుకుతోంది. ఆందోళనలు శనివారం కూడా తీవ్ర స్థాయిలో కొనసాగాయి. శబరిమలలోని అయ్యప్ప స్వామి ఆలయంలోకి మహిళల ప్రవేశాన్ని నిరసిస్తూ హిందూ సంస్థలు చేపట్టిన ఆందోళనతో రాష్ట్రం రణరంగంగా కనిపిస్తోంది. పలు చోట్ల అవాంఛనీయ సంఘటనలు కూడా చోటు చేసుకుంటున్నాయి. కన్నూర్ జిల్లా ఇరిత్తి ప్రాంతంలో సిపిఎంకు చెందిన కార్యకర్తపై శుక్రవారం అర్ధరాత్రి కొందరు ఆందోళన కారులు దాడి చేసి అతన్ని కత్తితో గాయపరిచారు. ఎమ్మెల్యే ఎ.ఎన్. షంషీర్ ఇంటిపై కూడా దాడి జరిగింది. తలస్సెరీ ప్రాంతంలో బిజెపి ఎంపి వి. మురళీధరన్ నివాసంపై ఆందోళనకారులు బాంబులు విసిరారు. ఆ సమయానికి ఎంపి కుటుంబ సభ్యులు ఇంటిలోనే నిద్రిస్తున్నప్పటికీ ఎవరికీ ఏమీ కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. తెల్లవారు జామున కన్నూరులోని ఆర్ఎస్ఎస్ కార్యాలయానికి నిప్పు పెట్టారు. కోజికోడ్ జిల్లాలో సిపిఎం, బిజెపి కార్యకర్తల మధ్య ఘర్షణలు చోటు చేసుకున్నాయి. శనివారం ఉదయం వరకు ఆందోళనలు ఏ మాత్రం సద్దుమణగలేదు. గురువారం నుంచి ప్రారంభమైన ఆందోళనలు తగ్గకపోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా ఉంది. ఇప్పటి వరకు పోలీసులు 1800 మందిని అరెస్టు చేశారు. కాగా, ఆందోళనల కారణంగా ఆదివారం (6న) రాష్ట్రంలోని పథనందిట్టకు రావలసి ఉన్న ప్రధాని నరేంద్ర మోడీ పర్యటన వాయిదా పడింది.



శబరిమల ఆలయంలోకి శ్రీలంక మహిళ ప్రవేశం నిజమే : పట్టేసిన సీసీటీవీ


ఇది ఇలా ఉండగా, శ్రీలంకకు చెందిన 47 ఏళ్ల మహిళ శశికళ అయ్యప్ప ఆలయంలోకి ప్రవేశించిందా? లేదా? వెళ్లిందని కొందరు, లేదని ఆమె చెబుతున్న దాంట్లో నిజమెంత? ఎవరి వాదనలు ఎలా ఉన్నా ఆమె ఆలయంలోకి వెళ్లడాన్ని మూడో కన్ను (సీసీ టీవీ) పట్టేసింది. ఆమె సన్నిధానం చుట్టూ నడుస్తున్నట్టు సీసీటీవీ కెమెరాల్లో నిక్షిప్తమైంది. శ్రీకోవిల్‌లోని పోలీసుల సీసీటీవీ కెమెరా దీనిని రికార్డు చేసింది. మరికొందరితో కలసి ఆమె గర్భగుడి నుంచి బయటకు వస్తుండడం వీడియోలో స్పష్టంగా కనిపిస్తోంది. గురువారం రాత్రి శ్రీలంక మహిళ శశికళ 18 మెట్లు ఎక్కి స్వామిని దర్శించుకున్నట్టు వార్తలు రావడంతో ఒక్కసారిగా కలకలం రేగింది. అప్పటికే ఇద్దరు మహిళల ఆలయ ప్రవేశంతో వేడెక్కిన కేరళ శశికళ ఆలయ ప్రవేశ వార్తలతో మరింత ఉద్రిక్తంగా మారింది. ఈ నెల 2న కేరళకు చెందిన బిందు, కనకదుర్గ అయ్యప్పను దర్శించుకోవడంతో పరిస్థితులు ఒక్కసారిగా అదుపు తప్పాయి. వారి ప్రవేశానికి నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా బంద్ కూడా నిర్వహించారు. ఇక తనను 18 మెట్ల వద్ద నుంచి వెనక్కి పంపారని శశికళ చెబుతున్నదానిలో వాస్తవం లేదని సీసీ టీవీ ఫుటేజీ నిరూపించింది.

కాబోయే ప్రధానుల్లో ఎక్కువ మంది మహారాష్ట్ర వాసులే : సీఎం ఫడ్నవీస్



నాగపూర్ : భవిష్యత్తులో కాబోయే ప్రధానుల్లో ఎక్కువ మంది మహారాష్ట్ర వాసులే ఉంటారని రాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ వ్యాఖ్యానించారు. 2050 లోపు ఇది జరిగి తీరుతుందని ఆయన చెప్పారు. నాగపూర్‌లో జరిగిన ప్రపంచ మరాఠీ సమ్మేళనానికి హాజరైన ఆయన ముఖాముఖిలో పాల్గొన్నారు. ఇప్పటి వరకు మహారాష్ట్రకు చెందిన వ్యక్తి ఎవరూ ప్రధాని కాలేదు. ఈ నేపథ్యంలో 2050 కల్లా మహారాష్ట్ర నుంచి ఎవరైనా ప్రధాని మంత్రి అయ్యే అవకాశం ఉందా అని ఓ వ్యక్తి అడిగిన ప్రశ్నకు ఫడ్నవీస్ ఈ విధంగా ఆసక్తికరమైన సమాధానం చెప్పారు. రాజుల కాలంలో భారత్‌లో ఎక్కువ ప్రాంతాన్ని పాలించింది మహారాష్ట్రీయులేనని ఆయన గుర్తు చేశారు. 18వ శతాబ్దంలో పాకిస్తాన్‌లోని ఆటోక్‌ను సైతం జయించిన ఘనత మహారాష్ట్ర వాసులదేనని ఆయన చెప్పారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత అవకాశాలు రాకపోయినా భవిష్యత్తులో ఆ ముచ్చట తీరుతుందని ఫడ్నవీస్ అన్నారు.

పారికర్‌కు రక్షణ కల్పించాలనే అభ్యర్థనతో రాష్ట్రపతికి లేఖ



పణజీ : గోవా ముఖ్యమంత్రి, రక్షణ శాఖ మాజీ మంత్రి మనోహర్ పారికర్‌కు భద్రత పెంచాలని కోరుతూ గోవా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు లేఖ రాసింది. రఫేల్ ఒప్పందం వివరాలు బయటకు వస్తే అందులో అవినీతి జరిగిందని ప్రజలకు తెలుస్తుందని, అందుకే ఆ వివరాలు బయటకు రాకూడదని కోరుకునే వారు పారికర్‌కు హాని తలపెట్టే ప్రమాదం ఉందని కాంగ్రెస్ ఆ లేఖలో ఆరోపిస్తూ, ఆయనకు తగిన రక్షణ కల్పించాలని కోరింది. రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలు ఒప్పందానికి సంబంధించిన పత్రాలు తన పడక గదిలో ఉన్నట్లు మనోహర్ పారికర్ చెప్పారని గోవా మంత్రి విశ్వజిత్ రాణె ఫోన్‌లో ఎవరితోనో మాట్లాడుతున్న ఆడియో టేప్‌ను కాంగ్రెస్ అధికార ప్రతినిధి రణ్‌దీప్ సుర్జేవాలా విడుదల చేసిన సంగతి విదితమే. కాగా, అదంతా కల్పిత ఆడియో టేప్ అని పారికర్ ఖండించారు. ఈ విషయంపై భారతీయ జనతా పార్టీ, కాంగ్రెస్ మధ్య దుమారం రేగింది. లోక్‌సభలో కూడా చర్చ జరిగింది. రఫేల్ ఒప్పందంపై కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ భారతీయ జనతా పార్టీపై తీవ్ర విమర్శలు చేస్తుండగా బిజెపి నేతలు అదే స్థాయిలో కాంగ్రెస్‌పై ఎదురుదాడికి దిగుతున్నారు.

మేఘాలయ ప్రభుత్వానికి రూ. 100 కోట్లు జరిమానా

జరిమానా విధించిన జాతీయ హరిత ట్రైబ్యునల్

న్యూఢిల్లీ : మేఘాలయలో అక్రమ మైనింగ్‌ను ఆపలేకపోయినందుకు గానూ జాతీయ హరిత ట్రైబ్యునల్ (ఎన్‌జీటీ) ఆ రాష్ట్రానికి రూ. 100 కోట్ల జరిమానా విధించింది. 2014లో బొగ్గు గనుల అక్రమ మైనింగ్‌ను బ్యాన్ చేయాలని ఎన్‌జీటీ తీర్పు ఇచ్చింది. దీనిని అమలు చేయడంలో విఫలమైనందుకు రెండు నెలల్లోగా కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు (సీపీసీబీ) వద్ద రూ. 100 కోట్లు జమ చేయాలని ఎన్‌జీటీ చైర్‌పర్సన్ జస్టిస్ ఆదర్శ్ కుమార్ గోయల్‌తో కూడిన ధర్మాసనం రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. రాష్ట్రంలో అక్రమ మైనింగ్ విషయంలో గత ఏడాది నియమించిన కమిటీ నివేదికతో సహా ఎన్‌జీటీని ఆశ్రయించగా ఈ మేరకు ధర్మాసనం తీర్పు ఇచ్చింది. ఇంకా అక్రమంగా బొగ్గు తవ్వకాలు చేపడుతున్న ప్రాంతాల్లో క్రేన్లను, ఇతర వాహనాలను సీజ్ చేయాలని బెంచ్ ఆదేశించింది. ఒక్కో ట్రక్కుకూ 50 శాతం ధర చెల్లిస్తేనే ఇప్పటి వరకు సీజ్ చేసిన 2700 ట్రక్కులను విడుదల చేయాలని బెంచ్ సూచించింది. '2014 ఏప్రిల్‌లో ఇచ్చిన ఆదేశాలను స్పష్టంగా బేఖాతరు చేశారు. నదులు, సరస్సుల్లోని నీరు గనుల గుండా ప్రవహిస్తుండడంతో (యాసిడ్ మైన్ డిశ్చార్జ్ - ఏఎండీ) జల కాలుష్యం విపరీతంగా పెరుగుతోంది. పర్యావరణానికి హాని కలుగుతోంది. ఈ నీరు మానవ అవసరాలకు పనికిరాదు' అని నివేదికలో పేర్కొన్నట్లు న్యాయవాది రాజ్ పంజ్‌వానీ వెల్లడించారు. ఇది ఇలా ఉండగా, మేఘాలయలోని బొగ్గు గనుల్లో 21 రోజుల క్రితం 15 మంది కార్మికులు చిక్కుకుపోయిన విషయం తెలిసిందే. డిసెంబర్ 13న గనిలో చిక్కుకుపోయిన కార్మికుల ఆచూకీ ఇప్పటి వరకు తెలియ రాలేదు. మేఘాలయలోని తూర్పు జయంతియా జిల్లాలో ఈ దుర్ఘటన జరిగింది. దట్టమైన చెట్లు ఉన్న కొండపై ఎలుక బొరియల్లా ఉండే గనుల్లో అక్రమంగా బొగ్గు తవ్వేందుకు కూలీలు లోపలికి వెళ్లారు. పక్కనే ప్రవహిస్తున్న లిటిల్ నది నీరు గనిలోకి ముంచెత్తడంతో కార్మికులు అందులోనే చిక్కుకుపోయారు. కొందరు ప్రాణాలతో బయటపడ్డారు. చిక్కుకుపోయిన వారిని



కాపాడేందుకు ఎన్డీఆర్ఎఫ్, వైమానిక దళం, అగ్నిమాపక దళం రంగంలోకి దిగి సహాయక చర్యలు సాగిస్తున్నాయి. ఘటన జరిగి రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు కార్మికుల జాడ తెలియలేదు. గనిలో చిక్కుకున్న వారు ప్రాణాలతో బయటకు వచ్చే అవకాశమే లేదని ప్రమాదం నుంచి బయటపడిన ఓ వ్యక్తి అభిప్రాయపడ్డారు.

ఇండిపెండెంటుగా బరిలోకి ప్రకాశ్ రాజ్



బెంగళూరు: క్రియాశీల రాజకీయాల్లోకి వస్తున్నట్టు ఈ నెల ఒకటో తేదీన ప్రకటించిన సినీ నటుడు ప్రకాశ్ రాజ్ రానున్న లోక్ సభ ఎన్నికలలో బెంగళూరు సెంట్రల్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నట్లు వెల్లడించారు. స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలుస్తానని తెలిపారు. తన కొత్త ప్రయాణానికి మద్దతుగా నిలుస్తున్న వారికి అభినందనలు చెబుతూ ట్వీట్ చేశారు. త్వరలోనే అన్ని వివరాలను వివరిస్తానన్నారు. సిటిజన్ వాయిస్ స్వచ్ఛంద సంస్థ ద్వారా సామాజిక దృక్పథాన్ని చాటుతున్న ప్రకాశ్ రాజ్ సన్నిహితులతో పోటీ విషయంపై చర్చించారు. కర్నాటకతో పాటు తెలంగాణ, తమిళనాడులోని పలు గ్రామాలను దత్తత తీసుకున్న ఈ బహుభాషా నటుడు ఏ రాష్ట్రంలో పోటీ చేస్తారనే దానిపై అభిమానుల్లో నెలకొన్న ఉత్కంఠకు ఈ ప్రకటనతో తెరపడింది. చలన చిత్రాల్లో విలక్షణ నటనతో అలరిస్తున్న ప్రకాశ్ రాజ్ గత ఏడాది ప్రముఖ పాత్రికేయురాలు గౌరీ లంకేశ్ హత్య తర్వాత తన గళానికి పదును పెట్టారు. సామాజిక మాధ్యమాల్లో భాజపాను లక్ష్యంగా చేసుకుని పదునైన విమర్శలు గుప్పించి వార్తల్లో నిలిచారు. నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వాన్ని జస్ట్ ఆస్కింగ్ ద్వారా ప్రశ్నిస్తూ తన పోరాటాన్ని కొనసాగించారు. కర్ణాటక విధానసభ ఎన్నికల సందర్భంలో గుజరాత్ దళిత నాయకుడు జిగ్నేశ్‌తో కలిసి భాజపాకు వ్యతిరేకంగా కార్యక్రమాలు చేపట్టారు.

యూపీలో ఒంటరి పోరుకు సిద్ధమే



లక్నో : ఉత్తర ప్రదేశ్ లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ లేకుండానే సమాజ్‌వాదీ, బహుజన్ సమాజ్ పార్టీ మహ కూటమిని ఏర్పాటు చేసేందుకు సిద్ధమైనట్లు వస్తున్న వార్తలపై పార్టీ సీనియర్ నేత, రాజ్యసభ ఎంపీ పీఎల్ పునియా స్పందించారు. యూపీలో ఒంటరి పోరుకు కాంగ్రెస్ సిద్ధంగానే ఉన్నట్లు చెప్పారు.
'మహ కూటమి ముఖ్యం కాదు. మా కార్యకర్తలు రెడీగా ఉన్నారు. పొత్తుల గురించి మేం ఎవరితోనూ చర్చలు జరపలేదు. ఎన్నికల కోసం ఒంటరిగానే సిద్ధమవుతున్నాం' అని పునియా మీడియాతో చెప్పారు. సార్వత్రిక ఎన్నికల్లో సీట్లు సర్దుబాటుపై చర్చలు జరిపేందుకు ఎస్పీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ బీఎస్పీ అధినేత్రి మాయావతితో శుక్రవారం ఢిల్లీలో భేటీ అయ్యారు. రెండు పార్టీల నడుమ దాదాపు సీట్ల సర్దుబాటు ఖరారైనట్లేనని, ఈ నెల 15 తరువాత అధికారిక ప్రకటన వెలువడే అవకాశాలు ఉన్నాయని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. అయితే, కాంగ్రెస్ పార్టీపై అఖిలేశ్, మాయావతి అసంతృప్తిగా ఉన్నారని, దీంతో యూపీ మహ కూటమిలో కాంగ్రెస్‌ను చేర్చుకోవాలని వారు భావించడం లేదని సదరు వర్గాలు చెబుతున్నాయి. అయితే, ఈ వార్తలను సమాజ్‌వాదీ పార్టీ సీనియర్ నేత, అఖిలేశ్ బంధువు రామ్‌గోపాల్ యాదవ్ కొట్టిపారేశారు. అవన్నీ ఊహాగానాలే అని, కాంగ్రెస్‌తో పొత్తు ఉంటుందని ఆయన చెప్పారు.

రాహుల్ గాంధీ వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చిన స్మృతి ఇరానీ

• రాముడు ఉన్నాడని చెప్పడానికి చారిత్రక ఆధారాలు లేవని గతంలో యూపీఏ అఫిడవిట్ దాఖలు చేసింది
• రామ మందిరం అంశానికి ప్రాధాన్యం లేదని రాహుల్ చెప్పారు • అమేథీలో కీలక వ్యాఖ్యలు చేసిన స్మృతి ఇరానీ

అమేథీ : కాంగ్రెస్ పార్టీపై కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ దృష్టిలో రాముడే లేడని, అయోధ్యకు ఎలాంటి ప్రాముఖ్యతా లేదని ఆమె విమర్శించారు. అయోధ్య రామ మందిరం అంశం సుప్రీం కోర్టు పరిధిలో ఉన్నందున దానిపై తాను ఏమీ మాట్లాడబోనని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించిన మరుసటి రోజే స్మృతి ఈ మేరకు విమర్శలు గుప్పించారు. అమేథీలో స్మృతి మాట్లాడుతూ, 'రామ మందిరం అంశం తనకు అంత ప్రాధాన్యం కలిగిన విషయం కాదని రాహుల్ అన్నారు. రాముడు ఉన్నాడని నిరూపించడానికి చారిత్రక ఆధారాలు



లేవని, రామ మందిరానికి కూడా ఎలాంటి ప్రాముఖ్యం లేదని గతంలో సుప్రీం కోర్టులో ఆనాటి యూపీఏ ప్రభుత్వం అఫిడవిట్ దాఖలు చేసింది. గాంధీ కుటుంబం, కాంగ్రెస్ పార్టీ దృష్టిలో రాముడు లేడు' అని వ్యాఖ్యానించారు. రాహుల్ శుక్రవారం మాట్లాడుతూ, రైతు సమస్యలపై పోరాటం, నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు, రాఫెల్ డీల్‌లో అవినీతిపైనే 2019 లోక్ సభ ఎన్నికలు ఉంటాయని, రామ మందిరం సమస్య ఆధారంగా ఎన్నికలు జరగబోవని అన్నారు. ఈ వ్యాఖ్యలకు కౌంటర్‌గా శనివారం స్మృతి ఇరానీ పైవిధంగా స్పందించారు.



పీవీ నరసింహారావు తరువాత దేశంలో విజయవంతమైన ప్రధాని మన్మోహన్ మాత్రమే



ముంబయి : దేశంలో ప్రధానిగా బాధ్యతలు నిర్వహించిన వారిలో పి.వి. నరసింహారావు తరువాత అత్యంత విజయవంతమైన ప్రధాని ఎవరైనా ఉన్నారంటే అది మన్మోహన్ సింగ్ మాత్రమేనని, ఆయ నను 'ఏక్సిడెంటల్ పీఎం' అనడం సరి కాదని శివసేన నాయ కుడు సంజయ్ రౌత్ అన్నారు. మన్మోహన్ బయోపిక్ 'ది ఏక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్' ఈ నెల 11న విడుదలవుతున్న నేపథ్యంలో రౌత్ చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. ఈ చిత్రంలో ప్రముఖ బాలీవుడ్ నటుడు అనుపమ్ ఖేర్ మన్మోహన్ సింగ్‌గా నటించారు. పది సంవత్సరాల పాటు దేశానికి సేవలు అందించిన మన్మోహన్‌ను గౌరవించాల్సిన అవసరం ఉందని, ఆయనను అనుకోకుండా వచ్చిన నాయకునిగా చూడకూడదని అన్నారు. ఎన్‌డీఏలో భాగస్వామ్య పక్షమైన శివసేన ఇటీవలి కాలంలో బీజేపీకి వ్యతిరేకంగా విమర్శలు చేస్తూనే ఉంది. తాజాగా రౌత్ చేసిన వ్యాఖ్యలు కూడా చర్చనీయంగా మారాయి. ఈ చిత్రంపై కాంగ్రెస్ కూడా ఆరోపణలు చేస్తోంది. చిత్రంలో కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌ను తప్పుగా చూపించారని ఆరోపిస్తున్నారు.


సూర్య స్పోర్ట్స్

ఎంఎస్ ధోనిని దాటేస్తాడు



సిడ్నీ : టీమిండియా యువ క్రికెటర్ రిషభ్ పంత్‌పై ఆస్ట్రేలియా దిగ్గజ ఆటగాడు రికీ పాంటింగ్ ప్రశంసల వర్షం కురిపించాడు. రిషభ్ పంత్‌లో అపారమైన నైపుణ్యం దాగుందనడానికి ఆసీస్‌తో నాల్గో టెస్టులో అతను సాధించిన భారీ సెంచరీనే చక్కటి ఉదాహరణ అని కొనియాడాడు. రిషభ్ పంత్ కేవలం తొమ్మిది టెస్టుల్లోనే రెండు సెంచరీలు సాధించడంతో పాటు కొన్ని సందర్భాల్లో తొంభైల దగ్గర ఔటైన విషయాన్ని పాంటింగ్ ప్రస్తావించాడు. భారత్ క్రికెట్‌లో ఎంఎస్ ధోని ప్రభావం గురించే మాత్రమే ఇప్పటివరకూ మాట్లాడుకున్నాం. ఇక నుంచి రిషభ్ పంత్ గురించి మాట్లాడుకుంటా. ధోని ఎక్కువ కాలం టెస్టు క్రికెట్ ఆడినా ఈ ఫార్మాట్‌లో కేవలం ఆరు సెంచరీలు మాత్రమే సాధించాడు. అదే సమయంలో ఎన్నో ఘనతలు ధోని సొంతం. కానీ ఈ యువ వికెట్ కీపర్ కచ్చితంగా ధోనిని దాటేస్తాడు. పరిస్థితులకు తగ్గట్టు ఆడే నైపుణ్యం రిషభ్‌కు ఉంది. అతనిలో అసాధారణ ప్రతిభ దాగి ఉంది. బంతిని స్ట్రైక్ చేసే విధానం చూడ ముచ్చటగా ఉంది. అతను బ్యాటింగ్ చేసేటప్పుడు ఆడమ్ గిల్‌క్రిస్ట్‌ను గుర్తుకు తెస్తున్నాడు. ప్రస్తుతం 21 ఒడిలో ఉన్న రిషభ్ సుదీర్ఘ కాలం భారత్ జట్టుకు సేవలందించడం ఖాయం అని పాంటింగ్ పేర్కొన్నాడు.

భారత్‌దే ఆధిక్యం



- ఆసీస్ తొలి ఇన్నింగ్స్ 236/6
- మూడోరోజు ఆట ముగిసే సమయానికి భారత్ 386 పరుగుల పైచేయి
- వర్షం కారణంగా కొంతసేపు మ్యాచ్‌కు అంతరాయం



సిడ్నీ : భారత్, ఆస్ట్రేలియా మధ్య ఇక్కడ జరుగుతున్న చివరిదైన నాల్గో టెస్టు మూడో రోజు ఆట శనివారం ముగిసింది. సిడ్నీలో భారీ వర్షం కురియడంతో, వెలుతురు లేమి కారణంగా మ్యాచ్‌ను కొంత ముందే నిలిపేశారు. దీంతో ఆట ముగిసే సమయానికి ఆసీస్ ఆరు వికెట్ల నష్టానికి 236 పరుగులు చేసింది. మూడో రోజు మ్యాచ్‌లో టీమిండియా బౌలర్లు విజృంభించడంతో తొలి ఇన్నింగ్స్‌లో ఆసీస్ తడబడుతోంది. ఊహించని విధంగా ఆరు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. దీంతో మూడో రోజు ఆటలో టీమిండియా పైచేయి సాధించింది. ఆట ముగిసే సమయానికి క్రీజులో పాట్ కమిన్స్ (25), హాండ్స్‌కాంబ్ (28) ఉన్నారు. కుల్‌దీప్ మూడు వికెట్లు, జడేజా రెండు, షమీ ఒక వికెట్ తీశారు.

మూడో రోజు ఆటలో భాగంగా 24/0 ఓవర్‌నైట్ స్కోరుతో మ్యాచ్ ప్రారంభించిన ఆసీస్ ఆదిలోనే వికెట్ కోల్పోయింది. బౌండరీలు బాదుతూ దూకుడు మీదున్న ఆసీస్ ఓపెనర్ ఉస్మాన్ ఖవాజా (27)ను కుల్‌దీప్ పెవిలియన్ చేర్చాడు. దీంతో ఆసీస్ తొలి వికెట్ కోల్పోయింది. తర్వాత క్రీజులో నిలదొక్కుకున్న ఆసీస్ బ్యాట్స్‌మెన్ ఆచితూచి ఆడారు. లంచ్ విరామం వరకు వికెట్ కోల్పోకుండా పైన్ సేన చాలా జాగ్రత్తగా ఆడింది. ఆ తర్వాత జడేజా ఆసీస్ దూకుడుకు కళ్లెం వేశాడు. ఆరంభం నుంచి క్రీజులో పాతుకుపోయి శతకం బాదేలా కనిపించిన మార్కస్ హారిస్ (79)ను జడేజా ఔట్ చేశాడు.

తర్వాత కూడా జడేజా తన దూకుడు కొనసాగించాడు. మూడో వికెట్ పడగొట్టడానికి ఎంతో సమయం తీసుకోలేదు. 49వ ఓవర్లో జడేజా వేసిన బంతిని షాన్ మార్ష్ (8) భారీ షాట్ కొట్టి రహానే చేతికి క్యాచ్ ఇచ్చాడు. అత్యంత ప్రమాదకర బ్యాట్స్‌మెన్ మార్ష్ కూడా పెవిలియన్ బాట పట్టడంతో ఆసీస్ మీద మరింత ఒత్తిడి పెరిగింది. కాసేపటికే లబుషేన్ (38) కూడా ఔటయ్యాడు. దీంతో ఆసీస్ టాప్ ఆర్డర్ కుదేలైంది.

కుల్‌దీప్ ఖాతాలో కీలక వికెట్లు..

తుది జట్టులో స్థానం దక్కించుకున్న కుల్‌దీప్.. ఆసీస్‌పై విరుచుకుపడ్డాడు. ట్రావిస్ హెడ్, టిమ్‌పైన్ వంటి కీలక వికెట్లు పడగొట్టాడు. కాసేపు నిలకడగా ఆడినట్లు కనిపించిన ట్రావిస్ హెడ్ (20)ను కుల్‌దీప్ పెవిలియన్ చేర్చాడు. అప్పటికి ఆసీస్ 192 పరుగులు చేసింది. బ్యాటింగ్‌కు దిగిన వెంటనే బౌండరీ బాదిన ఆసీస్ సారథి వికెట్ సైతం కుల్‌దీపే పడగొట్టాడు. 69ఓవర్లో కుల్‌దీప్ వేసిన బంతికి టిమ్‌పైన్ (5) బౌల్డ్ అయ్యాడు. దీంతో ఆసీస్ టాప్ ఆర్డర్‌తో పాటు మిడిలార్డర్ కూడా దెబ్బతింది. కాసేపటికే వర్షం, వెలుతురు లేమి కారణంగా మ్యాచ్‌ను కొంత సేపటివరకు నిలిపి వేశారు. తర్వాత భారీ వర్షం కురవడంతో మూడో రోజు మ్యాచ్‌ను 84 ఓవర్లకే ముగించారు. ప్రస్తుతం పైన్‌సేన ఆరు వికెట్లు కోల్పోయి 236 పరుగులు చేసింది. టీమిండియా 386 పరుగుల ఆధిక్యంలో ఉంది.

రాహుల్ నిజాయతీకి అంపైర్ ఫిదా...

టీమిండియా ఆటగాడు కేఎల్ రాహుల్ నిజాయతీకి ఫీల్డ్ అంపైర్ ఇయాన్ గౌల్డ్ ఫిదా అయిపోయాడు. చప్పట్లు కొట్టి అభినందించాడు. శభాష్ అంటూ వేలు పైకెత్తాడు. సిడ్నీలో ప్రస్తుతం జరుగుతున్న టెస్టులో ఆసీస్ ఇన్నింగ్స్ 15వ ఓవర్‌లో ఓపెనర్ మార్కస్ హ్యారిస్ ఆడుతున్నాడు. రవీంద్ర జడేజా వేసిన బంతిని బలంగా మిడాన్‌లోకి ఆడాడు. అక్కడే ఉన్న లోకేశ్ రాహుల్ అద్భుతంగా డైవ్ చేసి బంతిని ఒడిసిపట్టుకున్నాడు. దీంతో జడేజా సహా ఆటగాళ్లందరూ హ్యారిస్ అవుటంటూ సంబరాలు చేసుకున్నారు. అయితే, రాహుల్ మాత్రం అది క్యాచ్ కాదని, తాను పట్టుకోవడానికి ముందే బంతి నేలను తాకిందని చెప్పాడు. దీంతో జడేజా నిరుత్సాహానికి గురికాగా, ఫీల్డ్ అంపైర్ ఇయాన్ గౌల్డ్ మాత్రం రాహుల్‌ను ప్రశంసించాడు. అతడి నిజాయతీకి ఫిదా అయిపోయాడు. చప్పట్లు కొట్టి ప్రశంసించాడు. బొటనవేలు పైకెత్తి శభాష్ అంటూ కొనియాడాడు. మిగతా సహచరులు కూడా వెన్ను తట్టి అభినందించారు.

పింక్ క్యాప్‌లతో మైదానానికి కోహ్లీసేన

సిడ్నీ వేదికగా ఆసీస్‌తో జరుగుతున్న చివరి టెస్టు మూడో రోజు ఆటలో భాగంగా కోహ్లీసేన గులాబి రంగు టోపీలు ధరించి మైదానంలోకి దిగింది. బ్రెస్ట్ కేన్సర్ మీద అవగాహన కల్పించడానికి టీమిండియా ఆటగాళ్లు గులాబి రంగు టోపీలు ధరించారు. దీంతోపాటు ఆసీస్ మాజీ క్రికెటర్ గ్లెన్ మెక్‌గ్రాత్ ఫౌండేషన్‌కు నిధుల సేకరణకు గౌరవ సూచకంగా వీటిని ధరించారు. ఈ విరాళాల సేకరణ కోసం సిడ్నీ టెస్టు మూడో రోజు మ్యాచ్‌ను పింక్ డేగా నామకరణం చేశారు. దీంతో ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున స్పందన వచ్చింది. సిడ్నీ స్టేడియం గులాబీరంగుతో నిండిపోయింది. పలువురు క్రికెట్ అభిమానులు సైతం గులాబీ రంగు దుస్తులు ధరించి మైదానానికి వచ్చారు. ఈ రోజు సేకరించిన మొత్తాన్ని ఆస్ట్రేలియా వ్యాప్తంగా బ్రెస్ట్‌కేన్సర్‌తో బాధపడుతున్న వారికి మెక్‌గ్రాత్ ఫౌండేషన్ ద్వారా అందిస్తారు. మెక్‌గ్రాత్ భార్య జేన్ మెక్‌గ్రాత్ కేన్సర్‌తో బాధపడుతూ 2008లో మృతి చెందారు. జేన్ కొన్ని సంవత్సరాల పాటు బ్రెస్ట్ క్యాన్సర్‌తో బాధపడ్డారు. దీంతో 2005లో మెక్‌గ్రాత్ ఫౌండేషన్‌ను ప్రారంభించారు. బ్రెస్ట్ కేన్సర్ బాధితులకు ఈ ఫౌండేషన్ బాసటగా నిలుస్తోంది. అవగాహనా కార్యక్రమాలు నిర్వహించడం, చికిత్స అందించడం వంటి సేవలను ఈ ఫౌండేషన్ అందిస్తోంది.

స్కోరు వివరాలు

భారత్ తొలి ఇన్నింగ్స్ : మయాంక్ అగర్వాల్ సి స్టార్క్ బి లియాన్ 77, లోకేష్ రాహుల్ సి షాన్ మార్ష్ బి హజ్లివుడ్ 9, ఛతేశ్వర్ పుజారా సి అండ్ బి లియాన్ 193, విరాట్ కోహ్లీ సి పెయిన్ బి హజ్లివుడ్ 23, అజియెంక్యా రహనే సి పెయిన్ బి స్టార్క్ 18, హనుమ విహారి సి లబుస్‌ఛేగ్‌నే బి లియాన్ 42, రిషబ్ పంత్ నాటౌట్ 159, రవీంద్ర జడేజా బి లియాన్ 81. అదనం–20. మొత్తం (167.2 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి) 622 డిక్లేర్డ్. బౌలింగ్ : మిచ్చెల్ స్టార్క్ 26–0–123–1, జోష్ హజ్లివుడ్ 35–11–105–2, పాట్ కమ్మిన్స్ 28–5–101–0, నాథన్ లియాన్ 57.2–8–178–4, మార్నూస్ లబుస్‌ఛేగ్‌నే 16–0–76–0, ట్రావెస్ హెడ్ 4–0–20–0, ఉస్మాన్ ఖవాజ్ 1–0–4–0.

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ : మార్కస్ హరీస్ బి రవీంద్ర జడేజా 79, ఉస్మాన్ ఖవాజ్ సి పుజారా బి కుల్‌దీప్ యాదవ్ 27, మార్నూస్ లబుస్‌ఛేగ్‌నే సి రహనే బి శమీ 38, షాన్ మార్ష్ సి రహనే బి రవీంద్ర జడేజా 8, ట్రావిస్ హెడ్ సి అండ్ బి కుల్‌దీప్ యాదవ్ 20, పీటర్ హ్యాండ్స్‌కాంబ్ బ్యాటింగ్ 28, టిమ్ పెయిన్ బి కుల్‌దీప్ యాదవ్ 5, పాట్ కమ్మిన్స్ బ్యాటింగ్ 25. అదనం–6. మొత్తం : (10 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి) 236. బౌలింగ్ : మహ్మద్ శమి 16–1–54–1, జస్ప్రీత్ బుమ్రా 16–4–43–0, రవీంద్ర జడేజా 27.3–9–62–2, కుల్‌దీప్ యాదవ్ 24–6–71–3.

మయాంక్ స్వప్నం నెరవేరలేదట!



న్యూఢిల్లీ : టీమిండియా యువ బ్యాట్స్‌మెన్ మయాంక్ అగర్వాల్ తొలి టెస్టులోనే అదరగొట్టాడు. అరంగేట్ర టెస్టులో 118 పరుగులు చేసి సత్తా చాటాడు. ఆసీస్‌తో సిడ్నీలో జరుగుతున్న చివరి టెస్టు తొలి ఇన్నింగ్స్‌లోనూ మయాంక్ 77 పరుగులు చేశాడు. దేశవాళీ క్రికెట్‌లో తన మార్క్ చూపించిన మయాంక్.. జాతీయ జట్టులో ఆడాలన్న కోరికనూ తీర్చేసుకున్నాడు. అయితే ఇంత పెద్ద లక్ష్యాన్ని చేరుకున్నా మయాంక్ చిన్ననాటి కల మాత్రం తీరలేదట. మీడియాకిచ్చిన ఇంటర్వ్యూలో తన మనోగతాన్ని గురించి చెప్పుకొచ్చాడు. నాకు చిన్నప్పటి నుంచి విమానాలు అంటే చాలా ఇష్టం. దీంతో సైన్స్ చదివి పైలట్ అవ్వాలనుకున్నా. కానీ తర్వాత క్రికెట్‌ను ఆప్షన్‌గా ఎంచుకున్నా. క్రికెట్ కలైతే తీరింది. కర్ణాటక జట్టుకు నేను ఆడే సమయంలో నాకు నా మీద నమ్మకం కలిగింది. అప్పటిదాకా క్రికెట్‌పై నాకు అనుమానం ఉండేది. కానీ సొంత రాష్ట్రానికి ఆడేటప్పుడే నాకు క్రికెట్ సరైందనిపించింది. పైలట్‌ని అవ్వాలన్నే నా కోరికను మా తల్లిదండ్రుల ముందు పెట్టినప్పుడు వాళ్లు నన్ను ఏమీ అనలేదు. తర్వాత క్రికెటర్‌ని అవుతానన్నా ఏమీ అనలేదు. నా వెన్నంటే ఉండి నాకెంతో ప్రోత్సాహం ఇచ్చారు. అయోమయం పడకుండా ఒక లక్ష్యం మీదే ఏకాగ్రత నిలిపేలా చేశారు. నా కోరికలను, ఆసక్తులను భయపడకుండా ఎప్పటికప్పుడు బయటికి చెప్పేయమనే వారు అని అన్నాడు. టీమిండియాకు ఆడటం గురించి మాట్లాడుతూ.. ఓసారి నాతో రవి సర్ మాట్లాడుతూ.. టీమిండియా మ్యాచ్‌లకు సిద్ధంగా ఉండు. నీకు కూడా అవకాశం వస్తుంది అన్నారు. ఆ మాట వినగానే నోట మాట రాలేదు. కాసేపు అలాగే ఉండిపోయా. తర్వాత ఒకింత భావోద్వేగానికి గురయ్యాను. పైలట్ కోరికను పక్కన పెట్టాక నేను దృష్టంతా క్రికెట్ మీదే పెట్టాను. భారత జట్టుకు ఆడాలనే లక్ష్యంగా పెట్టుకున్నాను. అది ఇప్పటికి నెరవేరింది అని తెలిపాడు.

'టెస్టు బౌలర్‌గా నేను ఇంకా మెరుగుపడాలి'



సిడ్నీ : టెస్టు క్రికెట్‌లో మరింత రాణించాలంటే బౌలర్‌గా తాను ఇంకా మెరుగుపడాలని భారత యువ స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్ అభిప్రాయపడ్డాడు. ఆస్ట్రేలియా గడ్డపై తొలి టెస్టు ఆడుతున్న కుల్‌దీప్ సిడ్నీ వేదికగా జరుగుతున్న నాలుగో టెస్టులో మూడు వికెట్లు తీసి ఆతిథ్య ఆసీస్‌ను 236/6 పరుగులకు కట్టడి చేయడంలో కీలక పాత్ర పోషించాడు. ఈ మ్యాచ్‌లో కొంత ఒత్తిడికి గురైనట్లు కనిపించిన కుల్‌దీప్ విలేకరులతో మాట్లాడుతూ.. నిజాయతీగా చెప్పాలంటే నేనేమీ మారలేదు.(ఆస్ట్రేలియాలో బౌలింగ్ చేయడంపై) ఈ సిరీస్‌లో నా తొలి టెస్టును ఆడుతుండంటంతో కాస్త ఒత్తిడికి గురయ్యా అని తెలిపాడు. నేను చాలా తక్కువ క్రికెట్ మాత్రమే ఆడా. ఆ స్థాయిలో మాత్రమే నాకు క్రికెట్‌పై అవగాహన ఉంది. ముఖ్యంగా టెస్టు క్రికెట్‌లో నేను ఇంకా ఎన్నో రెట్లు మెరుగుపడాలి. ఎన్ని టెస్టు మ్యాచ్‌లాడితే, అంత మెరుగుడుపడతా. ఒక బ్యాట్స్‌మెన్ ఆటతీరును అర్థం చేసుకోవడానికి, మరింత రాణించడానికి టెస్టు క్రికెట్‌లో మాత్రమే అవకాశం ఉంది. బ్యాట్స్‌మెన్‌ను పడగొట్టడానికి వ్యూహం రచించేందుకు మనకు తగినంత సమయం ఉంటుంది. అలా ఎక్కువ బంతులు వేయడం, ఫీల్డింగ్‌లో మార్పులు చేయవచ్చు. నాపై చాలా ఒత్తిడి ఉంది. ఒక లెగ్ స్పిన్నర్‌గా నేను కుదురుకోవడానికి కనీసం పదిరోజుల సమయం పడుతుంది.అని అన్నాడు. నెట్స్‌లో బౌలింగ్ చేయడం కన్నా, నేరుగా మ్యాచ్‌లాడితేనే ఎక్కువ మెరుగుపడతామన్నాడు. వన్డేలతో పోలిస్తే టెస్టు క్రికెట్ పూర్తి భిన్నమని అభిప్రాయపడ్డాడు. అశ్విన్, రవీంద్ర జడేలాల నుంచి ఎంతో స్ఫూర్తి పొందుతానని పేర్కొన్నాడు.

ప్రో కబడ్డీ టైటిల్ విజేత బెంగళూర్ బుల్స్



ముంబై : కూత కూతకు గెలువు సమీకరణాలు మారిపోయాయి. ఫైనల్ మజా ఎలా ఉండాలని అభిమానులు కోరుకుంటారే అంతకు మించి హోరు జరిగింది. ఈ సారైనా టైటిల్ గెలవాలని పట్టుదలగా ఆడిన గుజరాత్ ఫార్చ్యూన్ జెయింట్స్ గెలువు ముంగిట బోల్తాపడింది. ఉత్కంఠ భరితంగా సాగిన ప్రొ కబడ్డీ ఆరో సీజన్ తుది పోరులో బెంగళూరు బుల్స్ విజేతగా అవతరించింది. గుజరాత్ ఫార్చ్యూన్ జెయింట్స్‌తో హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో బెంగళూరు బుల్స్ 38–33 తేడాతో విజయం సాధించింది. తొలి అర్ధభాగం ముగిసేసరికి ఆధిక్యంలో నిలిచిన గుజరాత్ రెండో భాగంలో తడబడింది. బెంగళూరు సారథి రోహిత్ ఫైనల్ పోరులో తడబడినా స్టార్ రైడర్ పవన్ మరోసారి తనదైన రీతిలో రెచ్చిపోయి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు.

ఆనర్స్ బోర్డుపై పుజారా, పంత్ సంతకాలు సిడ్నీలో అరుదైన గౌరవం

సిడ్నీ: ఆస్ట్రేలియాతో జరుగుతున్న చివరి టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో పుజారా, రిషబ్‌పంత్ అద్భుతమైన ఇన్నింగ్స్‌తో శతకాలు నమోదు చేసిన విషయం తెలిసిందే. సిడ్నీ క్రికెట్ మైదానం(ఎస్‌సీజీ)లో జరుగుతున్న ఈ మ్యాచ్‌లో పుజారా 193 పరుగులు చేయగా.. పంత్ 159 నాటౌట్‌గా నిలిచాడు. ఈ మైదానంలో ఒకే ఇన్నింగ్స్‌లో సెంచరీ లేదా ఐదు వికెట్లు లేదా రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 10 వికెట్లు తీసిన ఆటగాళ్లను గౌరవించడం ఎస్‌సీజీ ఆనవాయితీ. ఇందులో భాగంగా మైదానంలోని ఆనర్స్ బోర్డుపై ఈ ఘనత సాధించిన ఆటగాళ్లు పేర్లు చేర్చి వారి సంతకాలు తీసుకుంటారు. తొలి ఇన్నింగ్స్‌లో 622 పరుగుల భారీ స్కోరుకు బాటలు వేసిన పుజారా, పంత్.. ఈ బోర్డుపై తమ సంతకాలు చేశారు. శనివారం వర్షం కారణంగా మ్యాచ్ నిలిచిపోయిన అనంతరం ఎస్‌సీజీ నిర్వాహకులు వారిని ఆనర్ బోర్డుపై సంతకాలు చేయాల్సిందిగా కోరారు. దీంతో ఇద్దరు బోర్డుపై సంతకాలు చేసి ఈ గౌరవం దక్కినందుకు సంతోషం వ్యక్తం చేశారు. ఇందుకు సంబంధించిన వీడియోను బీసీసీఐ ట్విటర్‌లో పంచుకుంది. పుజారా ఈ సిరీస్‌లో మూడో సెంచరీ నమోదు చేయగా.. పంత్ ఆసీస్ గడ్డపై శతకం చేసిన తొలి భారత వికెట్ కీపర్‌గా రికార్డు సృష్టించిన విషయం తెలిసిందే.

ముందు ఆట మీద దృష్టి పెట్టు

మను బకర్‌పై మండిపడిన హరియానా మంత్రి



చండీగఢ్ : గతేడాది జరిగిన యూత్ ఒలింపిక్స్‌లో భారతీయ షూటర్ మను బకర్ స్వర్ణం సాధించి రికార్డు సృష్టించింది. యూత్ ఒలింపిక్స్‌లో స్వర్ణం సాధించిన తొలి భారత మహిళా షూటర్‌గా రికార్డులకెక్కిన మను బకర్‌ను అభినందించిన హరియాణా క్రీడల శాఖా మంత్రి అనిల్ విజ్ ఆమెకు రూ. 2 కోట్ల నజరానా ప్రకటించారు. అయితే, ఆ తర్వాత ప్రభుత్వం ఆ విషయాన్ని మర్చిపోయింది. తాజాగా ఈ విషయాన్ని మను బకర్ గుర్తు చేస్తూ మంత్రికి ట్వీట్ చేసింది. అప్పట్లో ఆయన చేసిన వ్యాఖ్యల ట్వీట్ల స్క్రీన్‌షాట్లను పోస్టు చేస్తూ.. తనకిచ్చిన హామీ సంగతేంటని ప్రశ్నించింది. ఆ హామీ నిజమేనా? లేక, తప్పుడు హామీ (జుమ్లా)నా? అని ట్వీట్ చేసింది. మను బకర్ ట్వీట్‌తో మంత్రి గారికి చిర్రెత్తుకొచ్చింది. ఆమె తన దృష్టిని ఆట మీద కేంద్రకరిస్తే బెటరంటూ హితవు పలికారు. ట్వీట్ చేసి వివాదం రేపినందుకు ఆమె తప్పకుండా బాధపడతారంటూ హెచ్చరికలు జారీ చేశారు. ఇచ్చిన హామీ ప్రకారం ఆమెకు రూ. రెండు కోట్లు అందుతాయని పేర్కొన్నారు. ఓ విషయాన్ని బహిరంగంగా చెప్పేముందు ఆమె క్రీడా విభాగాన్ని సంప్రదించి ఉండాల్సిందన్నారు. ఆటగాళ్లు క్రమ శిక్షణ కూడా పాటించాల్సి ఉంటుందని ట్వీట్ చేశారు. మంత్రి వ్యాఖ్యలపై నెటిజన్లు మండిపడుతున్నారు. మంత్రి పదవిలో ఉండి దేశానికి పేరు ప్రఖ్యాతులు తీసుకొచ్చే క్రీడాకారులను ఇలా అవమానిస్తారా? అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.22, DOOR NO. 8-2-293/82/A/22, ROAD NO. 5, JUBILEE HILLS, HYDERABAD-33, TELANGANA. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO 22, DOOR NO.8-2- 293/82/A/22, ROAD NO. 5, JUBILEE HILLS HYDERABAD-33, TELANGANA. PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.22, DOOR NO. 8-2- 293/82/A/22,ROAD NO. 5, JUBILEE HILLS, HYDERABAD-33, TELANGANA. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044-